నమస్తే తెలంగాణ
జిల్లా టాబ్లాయిడ్ వార్తల కోసం 10, 11పేజీలు చూడండి.

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

బతుకమ్మ
నమస్తే తెలంగాణ ప్రత్యేక అనుబంధం
నేటి సంచికతో ఉచితంగా అందుకోండి

ఆదివారం 12.4.2020
• సంపుటి 9 • సంచిక 288 • వెల. రూ. 8.00

కరీంనగర్
పేజీలు : 12 + 32 పేజీల ఆదివారం అనుబంధం

పంచమి

సూర్యోదయం: 6.02, సూర్యాస్తమయం: 6.32, శార్వరినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, చైత్రమాసం, కృష్ణపక్షం, తిథి: పంచమి సాయంత్రం 5.16 వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం: జ్యేష్ఠ రాత్రి 7.12 వరకు, తదుపరి మూల, వర్జ్యం: తె. 3.10 నుంచి 4.45 వరకు, అమృత ఘడియలు: ఉదయం 10.46 నుంచి ఉదయం 12.18 వరకు, రాహుకాలం: సాయంత్రం 4.57 నుంచి 6.30 వరకు, దుర్ముహూర్తం: సాయంత్రం 4.50 నుంచి 5.40 వరకు

PUBLISHED FROM KARIMNAGAR • HYDERABAD • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD
www.ntnews.com /ntdailyonline

లాక్‌డౌన్ 30 వరకు

మే 1 నుంచి దశలవారీగా ఎత్తివేత?

శనివారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు సీఎంఆర్ఎఫ్ కోసం రూ.5 కోట్ల విరాళం చెక్కు అందజేస్తున్న రాంకీ ఎన్వీరో ఇంజినీరింగ్ లిమిటెడ్ ప్రతినిధులు. చిత్రంలో మంత్రి ఈటల రాజేందర్ కూడా ఉన్నారు.

- ప్రజలు స్వీయ నియంత్రణ పాటించాలి.. కంటైన్మెంట్ ప్రాంతాల్లో కఠినచర్యలు
- ఇండ్లవద్దకే నిత్యావసరాల సరఫరా.. అవసరమైతే మహారాష్ట్ర సరిహద్దు సీజ్
- ప్రభుత్వ దవాఖానల్లోనే కరోనా చికిత్సలు.. కేంద్ర మార్గదర్శకాల ప్రకారమే చర్యలు
- మాస్కులు ఇండ్లలోనే తయారుచేసుకోవాలి: మీడియా సమావేశంలో సీఎం కేసీఆర్

- వ్యవసాయానికి మినహాయింపు
- ఫుడ్‌ప్రాసెసింగ్‌కు వెసులుబాటు
- రైస్ మిల్లులు, పిండిమరలు, నూనె మిల్లులు నడించేందుకు అనుమతి
- 1 నుంచి 9వ తరగతి పరీక్షలు రద్దు
- నేరుగా పైతరగతులకు ప్రమోట్
- టెన్త్ పరీక్షలపై త్వరలో నిర్ణయం
- 15 వరకు పొలాలకు సాగునీరు
- రూ.800కు పప్పుశనగ కొనుగోలు

కొత్త కేసులు రాకుంటే ఈ నెల 24 నాటికి రాష్ట్రంలో జీరో కరోనా

పాజిటివ్ కేసులు	503
మృతులు	14
డిశ్చార్జి అయినవారు	96
క్వారంటైన్‌లో ఉన్నవారు	1654
నియంత్రిత ప్రాంతాలు	243
జీహెచ్ఎంసీలో 123 , జిల్లాల్లో 120	

రాష్ట్రంలో లాక్‌డౌన్‌ను ఈ నెల 30 వరకు పొడిగిస్తున్నట్లు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. రాష్ట్ర ప్రజలంతా ఇప్పుడు సహకరించినట్లే.. మరో రెండువారాలపాటు కూడా స్వీయ నియంత్రణ పాటించి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. రాష్ట్రంలో కొత్త కేసులు రాకుంటే ఈ నెల 24 నాటికి చికిత్స పొందుతున్నవాళ్లు, క్వారంటైన్‌లో ఉన్నవాళ్లు పూర్తిగా డిశ్చార్జి అయిపోతారని, అదే జరిగితే.. మే ఒకటి నుంచి దశలవారీగా లాక్‌డౌన్‌ను సడలించుకోవడానికి అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. రాష్ట్రంలో 1 నుంచి 9 వ తరగతి వరకు పరీక్షలు రద్దుచేస్తున్నామని.. విద్యార్థులందరినీ నేరుగా పై తరగతులకు ప్రమోట్‌చేస్తామని వెల్లడించారు. పదో తరగతి పరీక్షల గురించి ఆలోచిస్తామన్నారు. ఏప్రిల్ 15 వరకు అన్ని ప్రాజెక్టుల కింద సాగునీరు అందిస్తామని సీఎం చెప్పారు. ప్రస్తుత లాక్‌డౌన్ పరిస్థితుల్లో వ్యవసాయాన్ని సరేగా పనులకు అనుసంధానంచేయాలని.. కనీసం రెండు నెలల వరకైనా ఇందుకు అనుమతించాలని ప్రధానిని కోరినట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం ప్రధాని నరేంద్రమోదీతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న సీఎం.. రాష్ట్రం తరపున లాక్‌డౌన్ పొడిగించాలని కోరారు. దీంతోపాటు పలు డిమాండ్లను మోదీముందుంచారు. ఆ తర్వాత రాష్ట్ర మంత్రిమండలి సమావేశమై లాక్‌డౌన్ పొడిగింపుతోపాటు పలు నిర్ణయాలను తీసుకొన్నది. క్యాబినెట్ భేటీ అనంతరం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్.. ప్రధాని మోదీతో సమావేశం, క్యాబినెట్ నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు.

> వివరాలు 2వ పేజీలో

హెలికాప్టర్ మనీయే ఏకైక మార్గం

- ప్రధాని మోదీకి సీఎం కేసీఆర్ వినూత్న ప్రతిపాదన
- క్వాంటిటేటివ్ ఈజింగ్‌తో నిధుల లభ్యతకు సూచన
- 5% క్యూఈతో 10 లక్షల కోట్ల నిధుల అందుబాటు
- రిజర్వుబ్యాంకు నుంచి డబ్బులు తీసుకొని రాష్ట్రాలకివ్వాలి
- వ్యవసాయాన్ని నరేగాకు అనుసంధానం చేయాలి
- ధాన్యం చెల్లింపులపై వడ్డీ మాఫీ చేయాలి
- రాష్ట్రాల అప్పుల చెల్లింపులు ఆర్నెళ్లు వాయిదా వేయాలి
- ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని 5 శాతానికి పెంచాలి
- పీఎంకేర్స్ నిబంధనలే సీఎంఆర్ఎఫ్‌కూ ఉండాలి
- కేంద్రానికి కేసీఆర్ లేఖ

పన్నులు కట్టేవారు లేరు. కట్టించుకునే పరిస్థితీ లేదు. పన్నులడిగే సందర్భమూ కాదు. రాష్ట్రాల ఖజానాలు నిండుకున్నాయి. కేంద్ర బొక్కసమూ చిక్కుల్లో పడింది. అటు ఆర్థిక మందగమనం. ఇటు వైరస్ జోరు పయనం. స్టిములస్ ప్యాకేజీలు మార్కెట్లో నిలబడటం లేదు. కరోనా సంక్షోభం మరికొంతకాలం కొనసాగడం ఖాయం. ఆ తర్వాత ఖజానా సంక్షోభమూ అనివార్యం! మరిప్పుడు ఏం చేయాలి? ఎవరు ఎవరిని ఆదుకోవాలి? ఆ రాష్ట్రం ఈ రాష్ట్రం అని కాదు; జాతి యావత్తూ సంక్షోభంలో చిక్కుకున్న ఈ తరుణంలో తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు తరుణోపాయం సూచించారు. హెలికాప్టర్ మనీ ఒక్కటే ఇప్పుడు దేశాన్ని గట్టెక్కించే మార్గమని ప్రధాని నరేంద్ర మోదీ అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఈ వినూత్న ప్రతిపాదన చేశారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: క్వాంటిటేటివ్ ఈజింగ్ అనే ఆర్థిక సూత్రీకరణ ద్వారా, దేశానికి అవసరమైన నిధులను అందుబాటులోకి తెచ్చుకునే విధానం ఒకటుందని ముఖ్యమంత్రి కేసీఆర్ కేంద్ర ప్రభుత్వానికి ప్రాతిపాదించారు. దేశ నిర్ధారిత స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో నిర్ణీత శాతం మేరకు, క్వాంటిటేటివ్ ఈజింగ్ పద్ధతిలో రిజర్వు బ్యాంకు నుంచి నిధులను వాడుకునే వీలుందని పేర్కొన్నారు. 2019-20లో నిర్ధారిత జీడీపీ 203 లక్షల కోట్లనీ, ఇందులో క్వాంటిటేటివ్ ఈజింగ్ కింద 5 శాతం లెక్కవేసుకున్నా 10 లక్షల కోట్లకు పైగా అందుబాటులోకి వస్తాయని లెక్కవేసి చెప్పారు. 1929 మహామాంద్యం, 2008 ఆర్థిక సంక్షోభం కంటే భీకరమైన ఆర్థిక సంక్షోభం నెలకొన్న ఈ తరుణంలో ఇంతకుమించి మరో మార్గం లేదని ఆయన వివరించారు. అమెరికా, ఐరోపా, ఇంగ్లాండ్, జపాన్, చైనా, రష్యా, కెనడా,

> మిగతా 3వ పేజీలో

కొవిడ్ సమాచారం ఒక్క క్లిక్‌తో

- ఎప్పటికప్పుడు పక్కాగా కరోనా లెక్క
- టీకొవిడ్-19 మొబైల్ యాప్ రూపకల్పన
- ఆవిష్కరించిన పురపాలకమంత్రి కేటీఆర్
- ప్రజల స్వీయ నిర్ధారణ పరీక్షలకు అవకాశం
- ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్‌కూ అనుసంధానం

డౌన్‌లోడ్ లింకులు: 3
https://bit.ly/android-TCOVID19
https://bit.ly/GoT-iOS-TCOVID19

కరోనా కట్టడిలో తెలంగాణ భేష్

కేంద్రమంత్రి అర్జున్‌ముండా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా కట్టడిలో తెలంగాణ ప్రభుత్వం చర్యలు బాగున్నాయని కేంద్ర గిరిజన శాఖ మంత్రి అర్జున్ ముండా ప్రశంసించారు. శనివారం ఆయన తెలంగాణ గిరిజన సంక్షేమ, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌తో ఫోన్లో మాట్లాడి కరోనా నేపథ్యంలో రాష్ట్రంలో గిరిజనుల కోసం తీసుకొంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకొన్నారు. లాక్‌డౌన్ సందర్భంగా గిరిజన ప్రాంతాల వారికి సీఎం కేసీఆర్ ఆదేశాలతో రేషన్ బియ్యం, అంగన్‌వాడీల ద్వారా అందించే పాలు, గుడ్లు, నిత్యావసరాలు అందించడంలో అవాంతరాలు లేకుండా చూస్తున్నట్టు కేంద్రమంత్రికి మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. వైద్యసేవలకు ఇబ్బందులు లేకుండా ఐటీడీఏల ద్వారా అందించేందుకు సంబంధిత జిల్లాల కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. బాలింతలు, గర్భిణులు, చిన్న పిల్లలకు వైద్యసేవల్లో లోపం రాకుండా అధికారులు చర్యలు తీసుకొంటున్నట్టు చెప్పారు.

ఇగురం నేర్చిన మేడిగూడ

మాంసం తినరు.. మందు ముట్టరు.. పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యం

ఒక ఊరికి మంచి పేరు రావాలంటే ప్రజలు ఇగురం తెలిసినవారై ఉండాలి..! లేదా మంచి చెడులు తెలిసిన వ్యక్తి ముందుండి నడిపించాలి..!! ఓ గిరిజనగూడెంలో అచ్చం ఇలాగే ప్రజలు ఓ మహరాజ్ మాటలకు ప్రభావితమై మార్పుచెందారు. ఒకప్పుడు మత్తు పానీయాలకు బానిసలై.. మాంసానికి అలవాటు పడి.. నిత్యం గొడవలు పడుతూ.. పిల్లల ఆలనా పాలనా పట్టనివారు.. పక్కవారి ఆపదను పట్టించుకోనివారు.. పచ్చదనం, పరిశుభ్రతకు తావివ్వనోళ్లు.. ఆ మహరాజ్ చూపిన మార్గాన్ని పాటిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. మద్యం, మాంసం మాని, మొక్కల పెంపకం, పరిశుభ్రతకు తావిస్తున్నారు. ఐకమత్యంగా సమస్యలను పరిష్కరించుకుంటూ.. సామాజిక కార్యకర్త అన్నాహజారే స్వగ్రామమైన మహారాష్ట్రలోని రాలెగావ్‌సిద్ధిని గుర్తుచేస్తున్నారు.. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం మేడిగూడ గిరిపుత్రులు. 7

ఒక్కరోజులోనే 2,108 మరణాలు

అమెరికాపై కరోనా విశ్వరూపం.. మృతుల సంఖ్యలో ఇటలీని దాటేసిన అగ్రరాజ్యం

అత్యధిక కేసులు, మరణాలు నమోదైన దేశంగా రికార్డు 4

ఇదిప్పుడు నరలోకం కాదు.. నరకలోకమైంది
తల్లులు సచ్చినా పిల్లలు పోలేరు
పిల్లలు సచ్చినా తల్లులు పోలేరు
మానవత్వం మంటగలిసింది
ఇదెక్కడి కరోనానో - డాక్టర కూరెళ్ల

ఉష్ణోగ్రతలు

	గరిష్ఠం	కనిష్ఠం		గరిష్ఠం	కనిష్ఠం
హైదరాబాద్	36.2°c	23.4°c	మెదక్	37.0°c	23.0°c
కరీంనగర్	38.0°c	24.0°c	ఆదిలాబాద్	37.8°c	23.0°c
వరంగల్	38.0°c	23.0°c	నిజామాబాద్	39.5°c	24.1°c
రంగారెడ్డి	37.0°c	23.0°c	మహబూబ్‌నగర్	37.3°c	23.1°c
నల్లగొండ	39.0°c	24.0°c	ఖమ్మం	34.0°c	24.0°c

శనివారం ప్రగతిభవన్‌లో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు ఈటల రాజేందర్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, సబితా ఇంద్రారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి కూడా ఉన్నారు.

30 వరకు లాక్‌డౌన్

- ప్రజలంతా సహకరించాలి..
- పదిహేను రోజులు ఓపికపడితే చాలు
- మే 1 నుంచి దశలవారీ ఎత్తివేత యోచన
- రాష్ట్రంలో 243 నియంత్రిత ప్రాంతాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఏప్రిల్ 30 వరకు రాష్ట్రంలో లాక్‌డౌన్‌ను కొనసాగించాలని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించిందని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. శనివారం ప్రగతిభవన్‌లో మంత్రిమండలి నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. లాక్‌డౌన్ పొడిగింపుపై సీఎం వెల్లడించిన వివరాలు ఆయన మాటల్లోనే..

మన క్షేమంకోసమే..

'లాక్‌డౌన్‌ను కచ్చితంగా, కఠినంగా అమలుచేస్తాం. నేను ప్రజలను మరోసారి కోరుతున్నా. దయచేసి ఈ లాక్‌డౌన్ మన క్షేమం కోసం, మన సమాజంకోసం, మన పిల్లల భవిష్యత్ కోసం.. అందరి మంచిని కాంక్షించి చేస్తున్న పని. గతంలో ఏ విధంగా సహకరించారో.. ఇప్పుడూ సహకరించాలి. అన్ని మతాలు, కులాలు, వర్గాలవారు సామూహిక కార్యక్రమాలు మానుకోవాలి. నాలుగురోజులు ఓపిక పడితే.. అదృష్టం బాగుండి కాలం కలిసివస్తే ఏప్రిల్ 30 తర్వాత లాక్‌డౌన్‌ను దశలవారీగా ఎత్తివేసే ఆలోచన చేయొచ్చు. ప్రధాని మోదీ ఈ రోజు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, లెఫ్టినెంట్ గవర్నర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మూడుగంటలపాటు సుదీర్ఘంగా సమావేశం జరిగింది. అన్ని రాష్ట్రాలు అభిప్రాయం చెప్పాయి. అందరూ కచ్చితంగా లాక్‌డౌన్‌ను కనీసం రెండువారాలు పొడిగించాల్సిందేనని విజ్ఞప్తిచేశారు. ఒకరిద్దరు రెడ్‌జోన్, హాట్‌జోన్లకు పరిమితంచేయాలన్నారు. కానీ చాలా మంది అంగీకరించలేదు. ఒకరిద్దరు సీఎంలు కొందరు వేరే రాష్ట్రాల వాళ్లున్నారు.. పోవాలనుకొంటున్నారు.. వాళ్లను పంపించడానికి ప్రత్యేక రైళ్లు పెట్టాలన్నారు కానీ.. అనుమతించలేదు. ఎక్కడివాళ్లు అక్కడ ఉంటేనే క్షేమం అని చెప్పాం. దేశాన్ని లాక్‌డౌన్ చేయడంలో ప్రధాని సరైన సమయంలో, సరైన నిర్ణయం తీసుకున్నారు. అన్ని రాష్ట్రాలు అనుసరించాయి. రాజకీయాలు పక్కనపెట్టి యావత్ దేశం ఒకే మూసలో పనిచేసినందునే కరోనా నియంత్రణలో ఉన్నది. ఇంకో 15-20 రోజులు ఇదేరీతిన ముందుకుపోతే కచ్చితంగా బయటపడే ఆస్కారం ఉంటది. ప్రపంచం ఎటుపోయినా మనల్ని మనం కాపాడుకోగలుగుతం. అందుకే కేంద్రం లాక్‌డౌన్‌ను ఈ నెల 30దాకా పొడిగించాలని డిమాండ్ చేస్తున్నా.

అద్భుతమైన ప్రజా సహకారం...

కరోనావ్యాప్తిని నిరోధించేందుకు కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ ముందుకుపోతున్నాం. వైరస్ నియంత్రణలో ఇతర దేశాలతో పోలిస్తే భారత్ మంచి స్థితిలో ఉంది. అద్భుతమైన ఆర్థికశక్తి.. ప్రపంచాన్ని శాసించే శక్తి, హెలికాప్టర్ అంబులెన్స్‌లు ఉన్న అమెరికాయే సతమతమవుతున్నది. అక్కడ రోజుకు దాదాపు రెండువేల మంది చనిపోతున్నరు. ఇంకో పదివేల మంది పరిస్థితి ఆందోళనకరంగా (క్రిటికల్) ఉన్నట్లు తాజా రిపోర్టులు చెప్తున్నాయి. అక్కడ 4 లక్షల మందికి పైగా వైరస్ సోకింది. మనదేశంలో ఏడువేల పైచిలుకు మాత్రమే ఎఫెక్ట్ అయ్యారు. మరణాలు ఈరోజు వరకు 300 లోపు ఉన్నాయి. 135 కోట్ల జనాభాను చూసుకుంటే మనం మంచి నియంత్రణలోనే దేశాన్ని ఉంచుకున్నట్లు లెక్క. దీనికి ప్రజలు ఇచ్చిన సహకారమే అన్నింటికంటే ముఖ్యమైంది. వాళ్లందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నా.

ఏం తప్పు చేశామోగానీ.. మాకీ శిక్ష చాలు..

ప్రజలు ఇంకొంచెం సమయం ఓపిక పడితే కచ్చితంగా ఈ గండం నుంచి బయటపడతం. భగవంతుడిని నిండు మనసుతో ప్రార్థిస్తున్నాం. మేం ఏం తప్పు చేశామోగానీ మాకీ శిక్ష చాలు. ఏప్రిల్ 30 వరకు దేశం నుంచి ఈ మహమ్మారిని తరిమివేస్తే కనీసం పనిచేసి బతుకుతం. అందుకే ఆ వెసులుబాటు కల్పించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నా. ఈ గండం నుంచి బయటపడేందుకు ప్రజలు సహకరించాలి. ఇప్పటివరకు కులం, మతం, జాతి అని తేడా లేకుండా ఎలా ముందుకు పోతున్నారో ఇక ముందుకూడా అలాగే పోవాలి.

యంత్రాంగం దృష్టంతా కరోనాపైనే

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలు కరోనాపైనే దృష్టి పెట్టారు. కలెక్టర్లు, కమిషనర్లు, ఎస్పీలు అందరు అధికారులు కరోనా సోషల్ ట్రాన్స్‌మిట్ కావద్దనే ఉద్దేశంతో పనిచేస్తున్నారు. కంటైన్మెంట్ చేయడం, ఐసోలేషన్, హోం క్వారంటైన్‌లో పెట్టడం, హాస్పిటల్‌లో ఉంచడం వెనుక ఉద్దేశం కరోనా వ్యాప్తి కావద్దనే. పాజిటివ్ వచ్చినవారు ఎంత పెద్ద కోటీశ్వరుడైనా సరే.. గాంధీ దవాఖానలో ఉండాల్సిందేనని గతంలోనే చెప్పాను. ప్రభుత్వ పర్యవేక్షణలో ఉండటం వేరు.. ఎక్కడో ప్రైవేట్ దవాఖానలో ఉంచితే ఎవరు కాపలాకాయాలి? ఎవరు చూడాలి? అదే గాంధీలో 1,500 బెడ్ల వరకు అవకాశం ఉన్నది. అక్కడ వేరేవారిని లోపలికి పంపించడంలేదు. పోలీసు బందోబస్తు పెట్టించాం. దవాఖాన సిబ్బందికి పాసులు ఇచ్చాం. రోగుల బంధువులను కూడా బయటే ఉంచుతున్నాం. రేయింబవళ్లు పనిచేస్తున్న వైద్యులు, సిబ్బందిపై రోగులు, బంధువులు ఎమోషనలై కొడుతున్నారు. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా చికిత్సచేస్తున్నవారిని కొట్టడం దుర్మార్గం.

ప్రైవేటులో కరోనా టెస్టులకు అవకాశం ఇవ్వం

కరోనా నిర్ధారణకు సంబంధించి నేనే ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వకూడదన్నాను. రోజుకు వెయ్యి టెస్టులుచేసే కెపాసిటీ ప్రభుత్వానికి ఉన్నది. వరంగల్, కరీంనగర్, హైదరాబాద్‌లలో టెస్టులుచేస్తున్నం. నెగెటివ్ వస్తే వెళ్లిపోమంటం. పాజిటివ్ వస్తే ఏం చేస్తాం? వందశాతం తక్షణమే నోటిఫైడ్ దవాఖానలో పెడతాం. అక్కడ సకల హంగులున్నయ్. ఏయే మందులు వాడాలి? టెంపరేచర్ తగ్గాలంటే ఏం చేయాలి? వైద్యుల పర్యవేక్షణలో చికిత్సలు జరుపుతాం. ఇండోనేషియా వాళ్లు వస్తే ల్యాప్‌టాప్‌లు, ఐప్యాడ్‌లు కావాలంటే ఇచ్చినం. తేనె కావాలన్నారు.. కావాల్సిన భోజనం కూడా పెట్టినం. ప్రభుత్వ దవాఖాన అయితే క్వారంటైన్ ఎక్కడ పెట్టాలో సూచిస్తాం. ధైర్యమిస్తాం. నిరుపేదలైనా, ధనికులైనా సరే.. పూర్తిగా మన కంట్రోల్‌లో ఉంటది. ప్రైవేటుకు అయితే ఎక్కడ పోవాలె..? ప్రాక్టికల్‌గా చాలా కష్టం. ఇదో టెర్రిఫిక్, డ్రెడ్‌ఫుల్ వైరస్. సమాజాన్ని కాపాడుకోవాలంటే కఠినంగా వ్యవహరించాల్సి ఉంటది. సుప్రీంకోర్టు కరోనా కేసులను ప్రైవేటు దవాఖానలు కూడా చూడవచ్చని చెప్పింది. కానీ పేషంట్ల నుంచి ఫీజు తీసుకోవద్దన్నది. దీంతో ఇప్పుడు ప్రైవేటు దవాఖానల వాళ్లు కనిపిస్తలేరు.

పరీక్షలుచేయడం పెద్ద తతంగం

కరోనా టెస్టులు చేయాలంటే ఒక పద్ధతి, వ్యవస్థ, స్కేల్ ఉంటది. 25 వేల మందికి తెలంగాణ ప్రభుత్వం కరోనా టెస్టులు చేసింది. కొందరిని డిశ్చార్జి చేసినం. 14 రోజులున్నా నెగెటివ్ రావాలె. చెస్ట్ ఎక్స్‌రే తీయాలె. దానికో పెద్ద తతంగం ఉన్నది. రెండుసార్లు నెగెటివ్ రావాలె. ఇవన్నీ చూసుకోకుండా పంపిస్తే.. సమాజంలోకి మనం టైం బాంబ్ పంపించినట్లే. ఒక్కొక్కడు పదివేల మందికి అంటిస్తడు. అందుకని అంత ఈజీగా డిశ్చార్జి చేయం. అక్కడో బోర్డు ఉంటది. వాళ్లు డిశ్చార్జి చేయాలంటేనే చేస్తం. ఇండియాలో మొత్తం కంట్రోల్‌లోకి వచ్చింది. 135 కోట్ల జనాభాలో ఏడువేల లోపే ఉన్నది. నిజాముద్దీన్ లేకపోతే మనం ఆరాంగా ఉండేవాళ్లం. మాములుగా ఒకటో రెండో వస్తే దర్జాగా చేసుకుంటూ ఉండేవాళ్లం. భయమేమిటంటే, ఎప్పుడేరకంగా పెరుగుతుందో తెలియని పరిస్థితి.

మాస్కులను ఇంట్లో తయారు చేసుకోవాలె..

మాస్కులను ఎవరికివారు ఇంట్లనే తయారుచేసుకోవాలని సీఎం కేసీఆర్ అన్నారు. అవసరమైతే దస్తీ కట్టుకోవాలని, భేషజాలకు పోవద్దని సూచించారు. మద్యంపై అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ 'నో లిక్కర్.. సారీ' అని వ్యాఖ్యానించారు.

మరింత కఠినంగా అమలు

లాక్‌డౌన్ కఠినంగానే ఉంటది. ఎందుకంటే, నలుగురు కలిస్తే మళ్లీ ప్రమాదం వస్తది. ఉదాహరణకు సింగపూర్‌ను తీసుకుంటే.. అదో చిన్న దేశం. కరోనా పోయిందని లాక్‌డౌన్ ఎత్తేశారు. మళ్లీ ఇప్పుడు నెల రోజులపాటు లాక్‌డౌన్ పెట్టుకున్నరు. జపాన్‌లో కూడా అదే జరిగింది. ఇదో వింత విచిత్రమైన వ్యాధి. ఎవరూ తెలిసి పాపం మూటగట్టుకోరు. పెద్ద ట్రాజెడీ ఏందంటే వైరస్ సోకిన వ్యక్తికి కరోనా వచ్చిన సంగతి తెలియదు, అది బయటపడదు. కొంతకాలానికి బయటపడుతుంది. కానీ, అప్పటికే అది ఇతరులకు సంక్రమిస్తది. అతడు మంచిగనే ఉన్నాననుకొని నార్మల్‌గానే బిహేవ్ చేస్తడు. హోటల్‌కెళ్తడు, తింటడు, పెండ్లికి, ఫంక్షన్లకు పోతడు. సమాజంలో తిరుగుతడు. ఆ తర్వాత ఆ వ్యాధి ఉందని బయటపడేటప్పటికి అతని ద్వారా ఎంతమందికి సంక్రమించిందో తెలియదు. ఇప్పుడు మన పరేషాన్ అదే. నిజాముద్దీన్ పోయి వచ్చినవాళ్లు ఎవరిని కలిసింద్రు, ఏ టైమ్‌లో కలిసింద్రో తెలియదు. ఇది రోకలిబండను తలకాయకు చుట్టుకుంటున్నట్టు ఉన్నది. కాబట్టి నియంత్రించాలి. అంటే, వారిని ఆ ఏరియాలకే పరిమితంచేస్తే అది ప్రబలకుండా ఉంటది. మనది చిన్నదేశం కాదు.. కాబట్టి, మనకు ఈ బాధలు తప్పవు. ప్రజల కనీస అవసరాలకు సంబంధించి కొన్ని జాగ్రత్తలు తీసుకొంటూ ముందుకుపోవడం మంచిది. కంటైన్మెంట్ ప్రాంతాల్లో సరుకులను డోర్ డెలివరీ చేస్తున్నాం. దేశం మొత్తం ఇదే పద్ధతిని పాటిస్తున్నది.

రాష్ట్ర సరిహద్దుల్లో కఠినంగా లేకపోతే కాపాడుకోలేం

మహారాష్ట్రలో శనివారం ఒక్కరోజే 11 మంది చనిపోయారు. రాజస్థాన్‌లో 117 కొత్త కేసులు వచ్చినట్టు వార్తలు వస్తున్నాయి. మహారాష్ట్రతో మనకు దాదాపు 500 నుంచి 600 కిలోమీటర్ల బార్డర్ ఉంది. లక్ష్మి బరాజ్ నుంచి మొదలుపెడితే పూర్తిగా ప్రాణహిత నది. ఆదిలాబాద్, నిజామాబాద్, నారాయణఖేడ్ వరకు కర్ణాటక బార్డర్ టచ్ అయ్యేదాకా మనకు మహారాష్ట్ర బార్డర్ ఉంటుంది. మన బంధుత్వాలు, రాకపోకలు, వ్యాపారకలాపాలు ఈ ప్రాంతం నుంచి చాలా ఉన్నాయి. కర్ణాటక, మహారాష్ట్ర బార్డర్‌లో కఠినంగా వ్యవహరిస్తే తప్ప మన రాష్ట్రాన్ని కాపాడుకోలేం. మహారాష్ట్ర బోర్డర్‌ను సీజ్ చేయాల్సి వస్తున్నది.. ఇయ్యాలో, రేపో కఠినమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటది.

రాష్ట్రంలో 243 కంటైన్మెంట్ ప్రాంతాలు

కరోనావ్యాప్తిని కచ్చితంగా అరికట్టాల్సిందే. ప్రజల ప్రాణాలు కాపాడుకోవాల్సిందే. ప్రజలు కూడా బాగా సహకరిస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఇతరదేశాల నుంచి వచ్చినవాళ్లు 34 మంది.. వాళ్లద్వారా వైరస్ సోకిన మరికొందరు వందశాతం డిశ్చార్జి అయ్యారు. తొలిదశలో క్వారంటైన్ అయిన 25,937 మంది కూడా డిశ్చార్జి అయ్యారు. తాజా గణాంకాలను చూస్తే శనివారం సాయంత్రం వరకు పాజిటివ్ కేసులు 503. వీరిలో 14 మంది చనిపోగా, 96 మందికి నయమై డిశ్చార్జి అయ్యారు. ప్రస్తుతం దవాఖానల్లో 393 యాక్టివ్ కేసులున్నాయి. మర్కజ్‌కు వెళ్లివచ్చిన 1,200 మందితోపాటు వారి కుటుంబసభ్యులు, సన్నిహితంగా ఉన్నవారందరినీ గుర్తించాం. పరీక్షలు చేయించాం. ఇప్పుడు క్వారంటైన్‌లో 1,654 మంది ఉన్నారు. కొత్తగా కేసులు రావడం తగ్గింది. వ్యాధి ప్రబలకుండా ఉండటానికి రాష్ట్రవ్యాప్తంగా 243 కంటైన్మెంట్ ప్రాంతాలను గుర్తించి నిబంధనలు కఠినంగా అమలుచేస్తున్నాం. జీహెచ్‌ఎంసీ పరిధిలో 123, ఇతర ప్రాంతాల్లో 120 నియంత్రిత ప్రాంతాలున్నాయి. ఈ ప్రాంతాల్లో రాజీపడేది లేదు. ఈ ప్రాంతాల్లో కూడా మంచి ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాం. దవాఖానల్లో చికిత్స పొందుతున్నవారు కానీ, కంటైన్మెంట్ ప్రాంతాల్లో కానీ ఎవరూ సీరియస్‌గా లేరు. భగవంతుడి దయవల్ల మనకు ఈ సంక్రమణ తగ్గిపోతే బహుశా ఏప్రిల్ 24 వరకు పరిస్థితి బాగుపడుతుంది. దవాఖానల్లో ఉన్నవాళ్లకు నెగెటివ్ వస్తే డిశ్చార్జి కావడం, క్వారంటైన్ వాళ్లు విడుదల కావడం జరుగుతుంది. కొత్త ఉప్పెన, కొత్త ఉత్పాతం రాకుంటే ఈ కరోనా నుంచి మనం బయపటపడ్డవాళ్లమవుతాం.

ఏకతాటిపై నిలిచిన భారతావని

కరోనా వ్యాప్తి నేపథ్యంలో దేశాన్ని, రాష్ట్రాల్ని కాపాడుకోవాలని కేంద్రం, రాష్ట్రాలు ఒక్క తాటిపై నిలిచి, రాజకీయాలకు అతీతంగా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు గొప్ప స్ఫూర్తితోటి ప్రధానమంత్రికి అప్పీలుచేశారు. ప్రధాని కూడా అదేరీతిన అప్పీలుచేశారు. అందరం కలిసి ఈ దేశాన్ని కాపాడుకొందామని అనుకొన్నాం. ఇప్పుడు విమానాలు, రైళ్లు నడువవు. ప్రధానమంత్రి దీనిపై అతిత్వరలోనే అధికారికంగా ప్రకటించే అవకాశం ఉన్నది. బహుశా రేపు జాతికి సందేశం ఇచ్చి ప్రకటిస్తారేమో? కొన్ని పాలసీలు కూడా ప్రకటించవచ్చు. కేంద్రం నుంచి నిర్ణయం కోసం వేచి ఉన్నాం.

లోకం పోకడ

రోజూ ఈ లొల్లి భరించలేకపోతున్నాం దేవుడో.. ఇంట్లో కూడా మాస్కులు తప్పనిసరి చేస్తే బాగుండేది!

నరేగాతో సేద్యాన్ని కలపండి

- ఎఫ్‌సీఐ రీయింబర్స్‌మెంట్‌పై కేంద్రం వడ్డీ మాఫీచేయాలి
- ఈ నెల 15 వరకు ప్రాజెక్టుల కింద సాగునీరు
- వరి, మక్కలు కొంటున్న ఏకైక రాష్ట్రం తెలంగాణే: కేసీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వ్యవసాయానికి నరేగా (జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం) ను అనుసంధానంచేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు డిమాండ్‌చేశారు. కనీసం రెండు నెలలపాటు 50 శాతం ఖర్చులను నరేగా కింద భరించాలని కోరినట్టు వెల్లడించారు. తెలంగాణలో ఇప్పుడు రైతులదే రాజ్యమని, తమకు రైతులే ముఖ్యమని పునరుద్ఘాటించారు. శనివారం రాష్ట్ర క్యాబినెట్ సమావేశం అనంతరం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ వివరాలు తెలిపారు. సీఎం ప్రసంగంలోని అంశాలు ఆయన మాటల్లోనే..

రైతులు కొంత భరిస్తారు

రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయాలను ప్రధాని మోదీకి పంపిస్తున్నం. లాక్‌డౌన్‌ను ఏప్రిల్ 30 వరకు కొనసాగించాలనిచేసిన తీర్మానం, కొన్ని డిమాండ్లను కూడా తెలిపినం. ప్రస్తుత సమయంలో యాసంగి కోతలు జరుగుతున్నయి. మన రాష్ట్రంలో మక్క, వరి, నార్త్‌లో గోధుమల కోతలు జరుగుతున్నాయి. ఈ సందర్భంలో కచ్చితంగా నరేగాను వ్యవసాయానికి అనుబంధంచేయాలని కోరుతున్నం. కనీసం ఈ రెండు నెలలైనా కూలీలకు ఇవ్వాల్సిన ఖర్చులను 50 శాతం రైతులు, 50 శాతం ప్రభుత్వం భరించాలని చెప్పినం. దానిపై ఏ నిర్ణయం వస్తుందో చూడాల్సి ఉం టుంది. రాష్ట్రాలు ధాన్యం కొని ఎఫ్‌సీఐకి ఇచ్చే క్రమంలో కొంతసమయం పడుతుం ది. కంప్లీట్ రీయింబర్స్‌మెంట్ ఎఫ్‌సీఐ నుంచి రావడానికి ఐదారునెలలు పడుతుంది. కాబ ట్టి దాని మీద వడ్డీ మాఫీచేయాలని డిమాండ్‌చేసినం. దానిపై ఆదేశాలివ్వాలని కోరినం. చాలామంది సీఎంలు కూడా కోరారు.

ఏప్రిల్ 15 వరకు సాగునీరు ఇస్తం

తొలిసారిగా రాష్ట్రంలో పంటలు చాలా బాగా వస్తున్నాయి. పంటలు బాగా పండుతాయన్న ఆశాభావంతో కాళేశ్వరం కింద, ఇతర ప్రాంతాల్లోనూ కొంత ఆలస్యంగా పంటలు వేసిన వాళ్లు ఉన్నరు. సాగునీటి విడుదలను ఏప్రిల్ 10కి ఆపేద్దాం అని అనుకున్నాం. కానీ చాలా మంది మంత్రులు తమ జిల్లాల రైతులు నీళ్లు ఇవ్వాలని కోరుతున్నారని చెప్తున్నారు. ఏప్రిల్ 15వరకు నీళ్లు ఇస్తే చివరిదశలో ఉన్న పంటలు కూడా చేతికి వస్తాయని కోరారు. కాబట్టి రాష్ట్రంలోని అన్ని ఇరిగేషన్, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల కింద వ్యవసాయానికి ఏప్రిల్ 15 వరకు నీళ్లు ఇవ్వాలని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించింది. ఆ మేరకు ఇరిగేషన్‌శాఖ అధికారులకు ఆదేశాలిచ్చినం.

పప్పు శనగల కొనుగోలుకు రూ.800 కోట్లు

పప్పుశనగ పంట బాగా వస్తుంది. కేంద్రం కోటా పెంచాలని కోరినం. పప్పుశనగల కొనుగోలుకు రూ.800 కోట్ల గ్యారంటీకి ఇప్పుడే అనుమతి ఇచ్చినం. దాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేస్తం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదు. వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఇది కావాలని వాదించి మరీ సాధించుకున్నారు.

పుడ్ ప్రాసెసింగ్‌కు లాక్‌డౌన్ నుంచి మినహాయింపు

జన సమూహాలు పాల్గొనే అన్ని కార్యక్రమాలను బ్యాన్‌చేస్తున్నాం. ఏప్రిల్ 31వరకు దేనినీ అనుమతించం. కానీ వ్యవసాయరంగాన్ని మాత్రం అనుమతిస్తారు. లేకపోతే బువ్వ దొరకదు. ధాన్యం వచ్చింది.. ఆ పంట అంతా ఎఫ్‌సీఐకి పోవాలె, ప్రాసెసింగ్ జరగాలి. ధాన్యాన్ని ప్రాసెసింగ్‌చేసే పుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ.. రైసుమిల్లులు, పిండి మరలు, ఆయిల్‌మిల్లులు తదితరాలు అన్నింటికీ అనుమతిస్తారు. ఆహార ఉత్పత్తుల్ని ప్రాసెసింగ్ చేసి నిత్యావసర వస్తువులుగా అందించే అన్నింటినీ అనుమతిస్తారు. కూరగాయలు రావాలంటే వ్యవసాయాన్ని అనుమతించాలి. అందుకే గతంలో నుంచి వ్యవసాయాన్ని అనుమతిస్తున్నాం.

కనీవినీ ఎరుగని ధాన్యసిరులు

ఈ సీజన్‌లో పంట వచ్చిన వెంటనే రెండు మూడు మార్కెట్ కమిటీలకు పోయి రైతుల మధ్య పండుగ చేసుకోవాలని అనుకున్న. తెలంగాణ చరిత్రలో మొట్టమొదటిసారి చరిత్రలో 40 లక్షల ఎకరాల్లో వరికోతలు కోస్తున్నరు. ఇది ఆల్‌టైం రికార్డు. సుమారు 14-15 లక్షల ఎకరాల్లో మక్కజొన్న దిగుబడి వస్తున్నది. ఇతర పంటలు కూడా సమృద్ధిగ పండినయి. యాసంగిలో 50-60 లక్షల ఎకరాల్లో పంటలు కోసుకోవడం అనేది తెలంగాణలో ఇదే తొలిసారి. ప్రాజెక్టులు ఫలించి ఫలితాలు వస్తున్నయి. రాబోయే రోజుల్లో ఇది ఇంకా పెరుగుతుంది. అయితే కరోనా వల్ల నేను రైతుల మధ్యలోకి పోలేకపోయిన.

స్వావలంబన నిలుపుకోవాలి

భారతదేశం జనాభా 135 కోట్లు. మొత్తం ఈ విశ్వంలో భారతదేశానికి అన్నం పెట్టే శక్తి ఏ దేశానికీ లేదు. ఏ దేశం కూడా సాదలేదు. తెలంగాణ రాష్ట్రం కంటే వందదేశాలు చిన్నగా ఉంటాయి. ఇంత పెద్ద విశాల భారతదేశానికి అన్నం పెట్టలేవు. ఆహారంలో స్వావలంబన సాధించిన దేశం మనది. ప్రధానికి కూడా ఇదే విషయాన్ని సీరియస్‌గానే చెప్పిన. ఎట్టి పరిస్థితుల్లో మన దేశం తన స్థాయి కోల్పోవద్దు. మన ఆహారాన్ని మనమే సంపాదించుకోవాలి. ఎవరూ పెట్టరు. అందుకే మన రైతాంగాన్ని అనుమతించాలి, పుడ్ ప్రాసెసింగ్ అనుమతించాలి. అప్పుడు 135 కోట్ల పొట్టలు నింపుకోగలుగుతం. స్వావలంబన నిలుపుకోగలుగుతం. పుడ్ ప్రాసెసింగ్ సెక్టర్, వ్యవసాయ, కూరగాయల సెక్టర్‌లన్నీ గ్రామాల్లో దూరం దూరంగా ఉంటాయి. అందుకే కొన్ని నియమాలు పెట్టుకొని వాటిని అనుమతిస్తాం. ఐసోలేషన్ పాటించాలి, మాస్కులు ధరించి జాగ్రత్తగా ఉండాలని చెప్పాం.

ఆహార పదార్థాలు కల్తీచేస్తే పీడీ యాక్టులే

ఎవరైనా తినుబండారాలు, నూనెలను కల్తీ చేస్తే వందకు వందశాతం ప్రభుత్వ ఆగ్రహానికి గురవుతరు. పీడీ యాక్టును పెట్టి రెండు, మూడేండ్లు లోపలేస్తం. ఎవ్వరూ వాళ్లను కాపాడలేరు. చాలా సీరియస్‌గా చెప్తున్నం.. ఈ విపత్కర పరిస్థితుల్లో మంచిగా ఉండాలిగానీ, గీ దుర్మార్గం చేయడమేంది? చాలా కఠినంగా వ్యవహరిస్తం. ఇందులో ఎలాంటి కాంప్రమైజ్ లేదు.

ఏప్రిల్ మొత్తానికి బియ్యం ఇచ్చాం

ఇటీవల ఏప్రిల్ నెల మొత్తానికి రేషన్ బియ్యం ఇచ్చినం. ఏప్రిల్ 30 తరువాత రెగ్యులర్‌గా రావాల్సిన రేషన్ వస్తుంది. వలస కార్మికులకు రూ.500 నగదు ఇస్తున్నం, భోజనాలు పెడుతున్నం. అర్హత ఉండి, ఆకలితో ఉన్న ప్రతి ఒక్కరికి అన్నం పెట్టే ప్రయత్నం చేస్తం. తెలంగాణలో ప్రధానమైన పంటలు పత్తి, వరి, మక్కజొన్న. ఇవే 96 శాతం పండుతయి. రైతు పండించే ప్రతి పంటను కొనలేం. ఈ మూడు పంటల్లో వరి, మక్కజొన్నలను ప్రభుత్వమే పూర్తిగా కొనుగోలు చేస్తుంది. భారతదేశ చరిత్రలో పండిన మొత్తం వరి, మక్కజొన్నలను కొనుగోలు చేసిన ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ. ఈ రోజు వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ విషయాన్ని చెప్పాను. మార్కెట్‌కు రైతులను రానివ్వకుండా గ్రామంలోనే రైతు పంటను కొనుగోలు చేస్తున్నామని ప్రధానమంత్రికి చెప్పిన. ఏడు వేల కొనుగోలు కేంద్రాలను పెట్టి కొనుగోలు చేస్తున్నాం. మక్కల కొనుగోలుకు ప్రత్యేకంగా కేంద్రాలను ఏర్పాటు చేసినం. చివరి కిలో వరకు కొనుగోలు చేస్తం.

రుణపరిమితి పెంచాలి

ఆర్నెళ్లపాటు అప్పుల చెల్లింపు వాయిదావేయాలి • క్యూఈ విధానంతోనే ఆర్థిక స్థితి మెరుగు

కేంద్రానికి సీఎం కేసీఆర్ డిమాండ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశంలో లాక్‌డౌన్ నెలకొన్న పరిస్థితుల్లో రాష్ట్రాలకు అప్పులు తీసుకొనే పరిమితిని పెంచాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అన్నారు. ప్రధానమంత్రితో వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా శనివారం రాష్ట్ర క్యాబినెట్ భేటీ అనంతరం ప్రగతిభవన్‌లో మీడియాతో సీఎం వెల్లడించిన అంశాలు ఆయన మాటల్లోనే..

ఎఫ్ఆర్‌బీఎం పరిమితి పెంచాలి

ఎఫ్ఆర్‌బీఎం పరిమితి 3శాతం వరకు ఉన్నది. ఆరు లేదా ఐదు శాతం పొడిగించాలని కోరినం. రాష్ట్రాల రెవెన్యూ పూర్తిగా పడిపోయింది కాబట్టి వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరినం. రాష్ట్రాలకున్న అప్పులను ఆరు నెలలపాటు వాయిదా వేయించాలని ప్రధానిని కోరాం. ఎఫ్ఆర్‌బీఎం కింద కొంత లోన్ తెచ్చుకొంటే ముందుకుపోతాం. కనీస అవసరాలు, వైద్యఅవసరాలు తీరాలంటేవెసులుబాటు కావాలని కోరినం. కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకొంటుందని ఆశిస్తున్నాం.

క్యూఈ అవలంబించాలి

ఇలాంటి ప్రత్యేక సందర్భాలు వచ్చినప్పుడు గవర్నింగ్ బ్యాంకులు క్యూఈ విధానం ద్వారా దేశానికి ఉన్న జీడీపీలో కొంత శాతాన్ని విడుదల చేస్తాయి. దాన్ని వివిధ రూపాల్లో రకరకాల డిమాండ్స్‌ను తీర్చడానికి ఉపయోగించవచ్చు ఇన్‌ఫార్మల్ బిజినెస్ సెక్టార్‌లో చేపల దుకాణాలు, కూరగాయల దుకాణాలు, మాంసం దుకాణాలు.. పాల వ్యాపారాలు.. రోజువారీ వడ్డీ తీసుకునే వారు, స్వల్ప లోన్లు తీసుకునేవారు, పారిశ్రామిక కార్మికులకు సాయం చేయాల్సి ఉంటుంది. రేషన్ కార్డులు లేనివాళ్లకు సాయం చేయాలంటున్నరు. రైతుల ధాన్యాలు కొనాలని డిమాండ్ ఉన్నది. క్యూఈ ద్వారా సమాజంలోకి కొంత ఇస్తే ఉపశమనం లభిస్తుంది. కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకొంటుందని ఆశిస్తున్నాం.

ఒకటి నుంచి తొమ్మిది తరగతుల విద్యార్థులంతా ప్రమోట్

**విద్యార్

ఆపద్బాంధవి.. హెలికాప్టర్ మనీ

సీఎం కేసీఆర్ ప్రస్తావనపై సరికొత్త చర్చ • సంక్షుభిత సమయంలో వినూత్న ఆలోచన
ఆర్థిక సమతుల్యత సాధనకు ఉపయోగకరం • జపాన్ సంక్షోభ సమయంలో వినియోగం

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: కరోనా మహమ్మారి ప్రపంచదేశాలన్నింటినీ అతలాకుతలం చేస్తుండటంతో ఆర్థిక వ్యవస్థలన్నీ కుదేలవుతున్నాయి. ఈ నేపథ్యంలో దేశంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభాన్ని అధిగమించడానికి 'హెలికాప్టర్ మనీ' అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు శనివారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీకి సూచించారు. దీంతో 'హెలికాప్టర్ మనీ' అంటే ఏమిటి అన్నదానిపై చర్చ మొదలైంది. ఆర్థిక పరిభాషలో అత్యంత అరుదైన పదం ఇది. హెలికాప్టర్ నుంచి డబ్బును వెదజల్లితే ఎలా ఉంటుందో.. అదే రీతిలో కేంద్ర ప్రభుత్వాలు, బ్యాంకులు నగదు నిల్వలను మార్కెట్‌లోకి తీసుకురావడాన్ని 'హెలికాప్టర్ మనీ' అంటారు. ప్రజల కొనుగోలు శక్తిని పెంచేందుకు వారికి తక్కువ వడ్డీకి నగదు అందజేస్తారు. వస్తువుల రేట్లు పడిపోయి మార్కెట్లు సంక్షోభంలోకి జారకుండా ఆర్థిక సమతుల్యత సాధించడం

1969లో హెలీకాప్టర్ మనీ విధానాన్ని ప్రతిపాదించిన ఆర్థికవేత్త మిల్టన్ ఫ్రైడ్‌మన్


2002లో ప్రాచుర్యంలోకి తీసుకొచ్చిన ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ మాజీ చైర్మన్ బెన్ బెర్నాంకి

హెలికాప్టర్ మనీ ఉద్దేశం. చరిత్రలో మొదటిసారి ప్రముఖ ఆర్థికవేత్త మిల్టన్ ఫ్రైడ్‌మన్ 1969లో హెలికాప్టర్ మనీ విధానాన్ని ప్రతిపాదించారు. కానీ ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ చైర్మన్ బెన్ బెర్నాంకి దీనిని 2002లో ప్రాచుర్యంలోకి తెచ్చారు. కాగా 2003లో జపాన్ సంక్షోభ సమయంలో దీనిని ఉపయోగించారు. సాధారణంగా ఆర్థికరంగంపై ద్రవ్యోల్బణం (ఇన్‌ఫ్లేషన్), ప్రతి ద్రవ్యోల్బణం (డిఫ్లేషన్) తీవ్ర ప్రభావం చూపుతాయి. ధరలు పెరుగడం ద్రవ్యోల్బణానికి దారితీస్తే.. కొనుగోలు శక్తి తగ్గి ధరలు పడిపోవడం ప్రతి ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. ఏది ఎక్కువైనా, ఏది తక్కువైనా ఆర్థిక పరిస్థితి మందగిస్తుంది. ఈ స్థితిలో ఆర్థిక సమతుల్యత సాధించడానికి ప్రభుత్వాలు రకరకాల ప్రయత్నాలు చేస్తాయి. హెలికాప్టర్ మనీ కొన్ని సందర్భాలలో క్వాంటిటేటివ్ ఈజింగ్‌గా పనిచేస్తుంది. వడ్డీరేట్లు జీరోస్థాయికి చేరుకొని ఆర్థిక సంక్షోభం ఏర్పడినప్పుడు నగదు నిల్వలను విస్తృతంగా వినియోగంలోకి తెచ్చి వినియోగదారులకు అందుబాటులో ఉండేలా చేస్తారు. దీనిద్వారా ప్రజల కొనుగోలుశక్తి పెరిగి మార్కెట్లు పుంజుకుంటాయి. ఇది ఆర్థిక విధానంలో పూర్తిగా భిన్నమైన పద్ధతి. ఆర్థిక అత్యవసర పరిస్థితి ఏర్పడినప్పుడు నిధులను భారీగా విడుదల చేసి, అవి నేరుగా వినియోగదారుడికి అందేలా చర్యలు తీసుకోవడం ఇందులో భాగం. ప్రస్తుతం డిఫ్లేషన్ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్నందున దానిని అడ్డుకోవడానికి హెలికాప్టర్ మనీ విధానం అవసరమని ఆర్థికవేత్తలు భావిస్తున్నారు. నగదు నిల్వలను మార్కెట్‌లోకి విరివిగా అందుబాటులోకి తెచ్చి ఆర్థిక వ్యవస్థను స్థిరపరచడం మంచి మార్గమని ప్రముఖ ఆర్థిక నిపుణుడు నర్సింహ మూర్తి పేర్కొన్నారు.

ఎఫ్ఆర్‌బీఎం పెంచితే

మరోవైపు ఆయా రాష్ట్రాల మొత్తం సంపద (జీఎస్డీపీ)లో 5శాతం వరకు అప్పులు తీసుకునే విధంగా 'ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్(ఎఫ్ఆర్‌బీఎం) పరిమితిని మూడు నుంచి ఐదు శాతానికి పెంచాలని సీఎం కేసీఆర్ సూచించారు. రాష్ట్రాల జీఎస్‌డీపీలో మూడు శాతం వరకు ప్రతి ఏడాది అప్పు తీసుకోవడానికి అనుమతి ఉంటుంది. రెవెన్యూ లోటు లేకుండా స్థిరంగా ఆదాయం పెంచుకుంటున్న తెలంగాణ వంటి రాష్ట్రాలకు కేంద్రం 3 నుంచి 3.25 లేదా 3.5 శాతం వరకు అప్పులు తీసుకోవడానికి అనుమతినిస్తుంది. ప్రస్తుతం తీవ్ర ఆర్థిక సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో రాష్ట్రాలు తమ జీఎస్డీపీలో రెండు శాతం ఎక్కువ అప్పు తీసుకోగలిగితే మార్కెట్లను ఉత్తేజపరచవచ్చు.

శనివారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌కు సీఎంఆర్ఎఫ్ కోసం రూ.2 కోట్ల విరాళం చెక్కు అందజేస్తున్న సైయెంట్ కంపెనీ అధినేత బీవీఆర్ మోహన్‌రెడ్డి, సీఈవో బీ కృష్ణ. చిత్రంలో మంత్రి ఈటల కూడా ఉన్నారు.

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు ఎస్ఆర్ విద్యాసంస్థల తరపున కోటి రూపాయల చెక్కును అందజేస్తున్న ఆ సంస్థ డైరెక్టర్ ఏ సంతోష్‌రెడ్డి

సీఎం కేసీఆర్‌కు రూ.కోటి చెక్కు అందజేస్తున్న రాజా ధన్‌రాజ్‌గిర్ ఎస్టేట్స్ చైర్మన్ మహేందర్‌గిర్, రాజా అరుణ్. చిత్రంలో మంత్రి నిరంజన్‌రెడ్డి

మల్లారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ రూ.50 లక్షలు, మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల రూ.25 లక్షలు, ఇతరులు అందించిన రూ.47 లక్షల చెక్కులను మంత్రి కేటీఆర్‌కు అందజేస్తున్న మల్లారెడ్డి హెల్త్‌సిటీ వైర్మన్ డాక్టర్ భద్రారెడ్డి, మల్లారెడ్డి సంస్థల డైరెక్టర్ మహేందర్‌రెడ్డి. చిత్రంలో మంత్రి మల్లారెడ్డి

సీఎంఆర్ఎఫ్‌కు వెల్లువెత్తిన విరాళాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా వైరస్ వ్యాప్తి నివారణకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న పోరుకు మద్దతుగా పలువురు విరాళాలు అందించారు. పారిశ్రామికవేత్తలు, ప్రజాప్రతినిధులు సీఎం సహాయనిధికి విరాళాలు అందించి తమ పెద్దమనసును చాటుకున్నారు. శనివారం ప్రగతి భవన్‌లో పలువురు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కే తారకరామారావులను కలిసి చెక్కులు అందజేశారు.

శనివారం విరాళాలు ఇచ్చినవారి వివరాలు (రూ.లో)

రాంకీ ఎన్వీరో ఇంజినీరింగ్ లిమిటెడ్	రూ.5 కోట్లు
సైయెంట్ కంపెనీ	రూ.2 కోట్లు
ఎస్ఆర్ విద్యాసంస్థలు	రూ.కోటి
రాజా ధన్‌రాజ్‌గిర్ ఎస్టేట్స్	రూ.కోటి
మల్లారెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ	రూ.50 లక్షలు
హెచ్ఈఎస్ ఇన్‌ఫ్రా ఎండీ వీవీఆర్ కృష్ణంరాజు	రూ.50 లక్షలు
మంత్రి మల్లారెడ్డి ఆధ్వర్యంలో పలువురు	రూ.47 లక్షలు
కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు	రూ.40 లక్షలు
మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల	రూ.25 లక్షలు
ఓక్సెన్ బిజినెస్ స్కూల్ ఎండీ విన్‌పూల	రూ.25 లక్షలు
రాజరాజేశ్వర ఎడ్యుకేషనల్ సొసైటీ	రూ.25 లక్షలు
ఆర్ఏకే ఫార్మా	రూ.25 లక్షలు
ఎస్ఎస్ ఇంజినీరింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్	రూ.25 లక్షలు
ఎస్ఎమ్మార్ బిల్డర్స్	రూ.25 లక్షలు
ఆజాద్ ఇంజినీరింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్	రూ.21 లక్షలు
అక్యురేట్ గ్రీన్ వీడియోస్	రూ.15 లక్షలు
స్కైస్ బిజినెస్ సర్వీసెస్	రూ.11 లక్షలు
సూర్యాపేట జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్‌రావు	రూ.10 లక్షలు
మర్రి ఎడ్యుకేషనల్ సొసైటీ తరపున మర్రి రాజశేఖర్‌రెడ్డి	రూ.10 లక్షలు
ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటికల్ ఇంజినీరింగ్	రూ.10 లక్షలు
సెయింట్ మార్టిన్ చిల్డ్రన్ ఎడ్యుకేషనల్ సొసైటీ	రూ.10 లక్షలు
టెక్ సిస్టమ్స్ గ్లోబల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్	రూ.10 లక్షలు
శ్రీలక్ష్మీ తులసీ ఆగ్రో పేపర్ లిమిటెడ్	రూ.10 లక్షలు

హెలికాప్టర్ మనీయే ఏకైక మార్గం

మొదటిపేజీ తరువాయి...

ఆస్ట్రేలియా తదితర అనేక దేశాల సెంట్రల్ బ్యాంకులు ప్రస్తుతం ఈ పద్ధతినే అనురిస్తున్నట్టు తెలిపారు. ఆర్థిక గండం గడిచేదెలా అని ఆలోచిస్తున్న పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేసీఆర్ ప్రతిపాదనకు వెంటనే సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఇదే కాకుండా అటు మాంద్యం, ఇటు కరోనా కారణంగా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు ఎదుర్కొంటున్న సమస్యలకు కూడా కేసీఆర్ ఆచరణాత్మకమైన పరిష్కారాలను ప్రతిపాదించారు. ఈమేరకు ప్రధానికి లేఖ కూడా రాశారు. వీటిపై త్వరలో నిర్ణయాన్ని ప్రకటిస్తామని ప్రధాని మోదీ తెలిపారు. లేఖ పూర్తి పాఠం ఇలా ఉన్నది..

ఏకతాటిపై పోరాడుతున్నాం..

కష్టాలున్నప్పటికీ కరోనాను నియంత్రించడానికి దేశమంతా ఏకతాటిపై నిలిచి పోరాడుతున్నది. జాతీయస్థాయిలో 21 రోజులు లాక్‌డౌన్ విధించడాన్ని అంతర్జాతీయ సమాజం, వైద్యనిపుణులు ప్రశంసించారు. దీంతో 130 కోట్ల జనాభా మధ్యన కరోనా వ్యాప్తిని గణనీయంగా తగ్గించగలిగాము. ఆర్థికంగా నష్టపోయినా ఈ నెల 30 వరకు లాక్‌డౌన్‌ను కొనసాగించాలి. ప్రజల ప్రాణాలను కాపాడుకోవడానికి ఇదొక్కటే మార్గం. ఆర్థికంగా నష్టపోతే తిరిగి సంపాదించుకోవచ్చు కానీ, ప్రాణాలుపోతే తీసుకొని రాలేం. ఈ విపత్కర పరిస్థితిని ఎదరుర్కోవడానికి, ప్రజల శ్రేయస్సుకు, ఆర్థికంగా ముందుకెళ్లడానికి కొన్ని కార్యక్రమాలు చేపట్టాలి. ఆర్థిక, మానిటరింగ్ పాలసీలు కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉంటాయి కాబట్టి, నా తరపున కొన్ని ప్రతిపాదనలు చేస్తున్నాను.

అప్పులే మార్గం

ఆర్థికరంగంపై కొవిడ్-19 ప్రభావాన్ని ప్రస్తుత సమయంలో పూర్తిగా అంచనా వేయలేము. కానీ, అంతర్జాతీయ ఆర్థిక నిపుణులు, ఆర్థికసంస్థలు చెప్తున్న ప్రకారం తొలి రెండు క్వార్టర్లలో జీడీపీ వృద్ధి తగ్గుతుంది. దీని ప్రభావం ట్యాక్స్, నాన్‌ట్యాక్స్ సేకరణలో కనిపిస్తున్నది. తెలంగాణలో ఒక్క ఏప్రిల్ నెలలో రూ.4వేల కోట్లు రావాల్సి ఉండగా, కేవలం రూ.100 కోట్లు మాత్రమే వచ్చింది, కాబట్టి ప్రస్తుత పరిస్థితుల్లో అప్పులు తీసుకోవడమే ఏకైక మార్గం. ఇందుకోసం ఎఫ్ఆర్‌బీఎం పరిమితిని ఏడాదికాలం పాటు 3 నుంచి 5 శాతానికి పెంచాలి.

రైతులవల్లే స్వయం సమృద్ధి

కేవలం రైతుల వల్లనే దేశంలో వ్యవసాయ రంగం స్వయం సమృద్ధి సాధించింది. దేశంలో 50 శాతం జనాభాకు వ్యవసాయమే ఆధారం. కాబట్టి, ఆ రంగాన్ని ఆదుకోవాలి. తక్షణమే గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని (నరేగా) వ్యవసాయానికి అనుసంధానం చేయాలి. వ్యవసాయ పనుల్లో పాల్గొనే కూలీలకు రైతులు 50 శాతం, మిగిలిన 50శాతం నరేగా నుంచి ఇవ్వాలి. వ్యవసాయరంగానికి అండగా ఉండేందుకు, తక్షణ చర్యలు తీసుకోవడానికి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటుచేయాలి.

ధాన్యం సేకరణకు ఇబ్బంది కలుగొద్దు

యాసంగి సీజన్‌లో పంటకోతలకు, ధాన్యం సేకరణకు ఇబ్బంది లేకుండా చూడాలి. సామాజికదూరాన్ని పాటించడం కోసం తెలంగాణలో ఏఎంసీ/ మండీలెవల్ సేకరణను బంద్‌చేసి, గ్రామాల్లో 6,849 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశాం. ధాన్యం సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.25 వేల కోట్ల గ్యారెంటీ ఇచ్చింది. ఈ రుణాలకు గాను ఆరునెలలకుపైగా వడ్డీ భారం పడుతుంది. కానీ, ఎఫ్‌సీఐ రెండునెలల వ్యవధికి మించి ఇవ్వదు. కాబట్టి, ఈ క్యాష్ క్రెడిట్‌లోన్‌కు వడ్డీలేని రుణ సదుపాయం కల్పించాలి.

రుణాలు ఆర్నెళ్లు వాయిదా వేయాలి

ఆర్థికమాంద్యంపై పోరాడటానికి నగదు ప్రవాహాన్ని తగ్గించడంతోపాటు వనరులను పరిరక్షించడం కోసం అన్ని ఎస్డీఎల్ రుణాలు (అసలు, వడ్డీ చెల్లింపులు), రాష్ట్ర ప్రభుత్వ గ్యారెంటీతో రాష్ట్ర పబ్లిక్‌రంగ సంస్థలు తీసుకొన్న రుణాలను రెండు క్వార్టర్లు (ఆరునెలలు) వాయిదా వేయడం అవసరం. లిక్విడిటీలో తాత్కాలిక అసమతుల్యతను మేనేజ్ చేయడానికి ఆర్బీఐ ఇటీవల వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్‌ను 30 శాతం పెంచింది. దీనిని వంద శాతానికి పెంచాలి.

చాలామంది దాతలు, ట్రస్ట్‌లు, కంపెనీలు పీఎం కేర్స్‌ఫండ్‌కు, సీఎం రిలీఫ్‌ఫండ్‌కు విరాళాలు ఇస్తున్నాయి. ఇది చాలా సంతోషకరం. ఇప్పుడున్న నిబంధనల ప్రకారం సీఎం రిలీఫ్ ఫండ్‌కు ఇచ్చే కార్పొరేట్ కంట్రిబ్యూషన్.. సీఎస్సార్ పరిధిలోరాదు. పీఎం కేర్స్‌ఫండ్‌కు ఇచ్చినవిధంగా సీఎం రిలీఫ్‌ఫండ్‌ను సీఎస్సార్ పరిధిలోకి తీసుకొనిరావాలి.

ఈ విపత్కర పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం సహకరించుకోవాలి. ఆర్థిక తిరోగమనం నేపథ్యంలో తగిన నిర్ణయాలు తీసుకోవడానికి మీరు చైర్మన్‌గా, కొంతమంది ముఖ్యమంత్రులు సభ్యులుగా హైలెవల్ కమిటీని ఏర్పాటుచేయాలని కోరుతున్నాను. దీని వల్ల వివిధ రాష్ట్రాల సామర్థ్యం దేశ ఆర్థిక వ్యవస్థను ఏకతాటిపై నడిపించడానికి వీలవుతుంది.

'హెలికాప్టర్ మనీ' విధానం పాటించాలి

ప్రపంచవ్యాప్తంగా 1929లో వచ్చిన తీవ్ర సంక్షోభం, 2008లో వచ్చిన ఆర్థిక మాంద్యం కంటే ఇప్పుడు తీవ్రంగా వచ్చిన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి అన్ని దేశాల సెంట్రల్‌బ్యాంకులు తీవ్రమైన చర్యలు తీసుకొంటున్నాయి. ఆర్థికమాంద్యాన్ని ఎదుర్కోవడానికి ఇప్పుడు మనముందున్న ఏకైకమార్గం 'క్వాంటిటేటివ్ ఈజింగ్' (క్యూఈ), 'హెలికాప్టర్‌మనీ' విధానమే. అన్ని దేశాల సెంట్రల్‌బ్యాంకులు ముఖ్యంగా ఫెడరల్‌రిజర్వ్ (యూఎస్ఏ), యూరోపియన్ సెంట్రల్‌బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, బ్యాంక్ ఆఫ్ జపాన్, పీపుల్స్‌బ్యాంక్ ఆఫ్ చైనా, సెంట్రల్‌బ్యాంక్ ఆఫ్ రష్యా, బ్యాంక్ ఆఫ్ కెనడా, రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఆస్ట్రేలియాలు ఈ విధానాన్ని అమలుచేస్తున్నాయి. క్యూఈ విధానం దేశ జీడీపీలో కనీసం 5 శాతం ఉండాలి. కేంద్ర గణాంకాలశాఖ లెక్కల ప్రకారం 2019- 20లో భారతదేశ జీడీపీ రూ.203.85 లక్షల కోట్లు. దీని ప్రకారం 5శాతం అనగా రూ.10.15 లక్షల కోట్లు అవుతుంది.

చివరగా, ఈ విపత్కరమైన పరిస్థితి మనదేశమంతా ఏకతాటిపై రావడానికి అవకాశం కల్పించింది. ఈ అసాధారణ సంక్షోభానికి అసాధారణ సాధనాలను ఉపయోగించడం అవసరం. దేశ ప్రజలకు ఆశలు కల్పించడానికి అసాధారణ కొత్త విధాన కార్యక్రమాలు తీసుకొందాం.

కరోనాపై గెలిచి తీరుతం

- కొవిడ్‌పై పోరులో దేశమంతా ఏకతాటిపై..
- ప్రధాని అండగా నిలువడంతో మనోధైర్యం
- వైరస్ నియంత్రణలో లాక్‌డౌన్ ఉపయోగకరం
- పీఎంతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం కేసీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనాపై జరిగే యుద్ధంలో భారతదేశం తప్పక గెలిచి తీరుతుందని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. కరోనాపై పోరులో దేశమంతా ఏకతాటిపై నిలిచిందని, ఇదే స్ఫూర్తిని కొనసాగించాల్సిన అవసరముందని చెప్పారు. ఈ పోరాటంలో రాష్ట్రాలకు కేంద్రం నుంచి తగిన మద్దతు లభిస్తున్నదని అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ శనివారం అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నాలుగు గంటలపాటు సాగిన ఈ భేటీలో ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడుతూ.. కరోనాపై పోరులో కేంద్రం రాష్ట్రాలకు అండగా నిలువడం తమకు మనోధైర్యాన్ని ఇస్తున్నదని చెప్పారు. కరోనాను భారతదేశం ఎంతో గొప్పగా ఎదుర్కొంటున్నదని అంతర్జాతీయ పత్రికలు కూడా మెచ్చుకుంటున్నాయని తెలిపారు. లాక్‌డౌన్‌ను మరో రెండువారాలు పొడిగించాలని ఈ సందర్భంగా సీఎం కేసీఆర్.. ప్రధానికి విజ్ఞప్తి చేశారు. లాక్‌డౌన్ సమయంలో అటు రైతులు నష్టపోకుండా, ఇటు నిత్యావసర సరుకులకు ఇబ్బంది కలుగకుండా చూడాలని, ఇందుకోసం రెండు రంగాలకు ఉపయోగపడే విధంగా ఫుడ్‌ప్రాసెసింగ్ ఇండస్ట్రీ నడిచేలా చూడాలని అభ్యర్థించారు. దేశవ్యాప్తంగా కోట్ల టన్నుల పంటలు పండాయని, వీటిని సేకరించడం ప్రస్తుతం ప్రభుత్వాల ముందున్న కర్తవ్యమని చెప్పారు. సేకరించిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు స్థలం లేదని, అందువల్ల ప్రజలకు మూడు నెలలకు సరిపోయే ఆహారధాన్యాలను ముందుగానే ఇచ్చేయాలని సీఎం కేసీఆర్ సూచించారు. తద్వారా ఎఫ్‌సీఐ గోదాములలో ఉన్న నిల్వలు ఖాళీ అవుతాయని, అప్పుడు కొత్తగా వచ్చే పంటలను వాటిలో నిల్వచేయవచ్చని పేర్కొన్నారు.

ధాన్యం సొమ్ము వచ్చే దాకా ఆగాలి

రైతులు మార్కెట్లో ఒకేసారి జమ కాకుండా ఉండేందుకు తెలంగాణలో గ్రామాల్లోనే 6,849 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నామని ప్రధానితో సీఎం చెప్పారు. ఒక్క ధాన్యం సేకరణ కోసమే ప్రభుత్వం రూ.25వేల కోట్ల బ్యాంకు గ్యారంటీ ఇచ్చిందని తెలిపారు. గ్రామాల్లోనే పంటలు కొని, రైతుల అకౌంట్లో డబ్బులు వేస్తున్నామని, మరోవైపు సేకరించిన ధాన్యాన్ని బియ్యంగా మార్చి ఎఫ్‌సీఐకి అందిస్తున్నామని చెప్పారు. ఎఫ్‌సీఐ నుంచి తిరిగి డబ్బులు రావడానికి నాలుగైదు నెలల సమయం పడుతున్నదని, అప్పటివరకు బ్యాంకులు బకాయిల చెల్లింపుకోసం ఒత్తిడి తేకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్ ప్రధానికి విజ్ఞప్తి చేశారు.

హెలికాప్టర్ మనీతో వెసులుబాటు

1918లో స్పానిష్ ఫ్లూ వచ్చినప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం ఏర్పడిందని, 2008 లో కూడా ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ఏర్పడిందని సీఎం కేసీఆర్ గుర్తుచేశారు. అప్పుడు సకాలంలో స్పందించి సరైన చర్యలు తీసుకోవడం వల్ల కోలుకోగలిగామని అన్నారు. ఇప్పుడు వచ్చిన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవడానికి వ్యూహాత్మక ఆర్థిక విధానం అవసరమని చెప్పారు. క్వాంటిటేటివ్ ఈజింగ్ విధానాన్ని ఆర్‌బీఐ అనుసరించాలంటూ 'హెలికాప్టర్ మనీ'ని ప్రవేశపెట్టాలని సూచించారు. దీని వల్ల రాష్ట్రాలకు, నిధులు సమకూర్చే సంస్థలకు వెసులుబాటు లభిస్తుందని, ఆర్థిక సంక్షోభం నుంచి బయట పడవచ్చని తెలిపారు. జీఎస్డీపీలో 5 శాతం నిధులను క్వాంటిటేటివ్ ఈజింగ్ (క్యూఈ) విధానం ద్వారా విడుదల చేయవచ్చని చెప్పారు. లాక్‌డౌన్ నేపథ్యంలో రైతులకోసం, ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దడం కోసం ఒక వ్యూహాన్ని ఖరారుచేసి అమలుచేసేందుకు ప్రధాని అధ్యక్షతన కేంద్ర మంత్రులతో ఒక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటుచేయాలని సీఎం సూచించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ వెంట వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు తదితరులు ఉన్నారు.

పక్కాగా కొవిడ్ లెక్క

- ఒక్క క్లిక్‌తో తాజా సమాచారం
- టీకొవిడ్-19 మొబైల్ యాప్ ఆవిష్కరించిన మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కొవిడ్-19పై పోరులో రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. ఒక్క క్లిక్‌తో కరోనాకు సంబంధించిన పూర్తి సమాచారం అందించేలా టీకొవిడ్-19 మొబైల్ యాప్ (లింకు 1: https://bit.ly/android-TCOVID19, లింకు 2: https://bit.ly/GoT-iOS-TCOVID19)ను తీసుకొచ్చింది. తెలంగాణ కొవిడ్-19 మొబైల్ యాప్‌ను శనివారం ప్రగతి భవన్‌లో పురపాలక, ఐటీశాఖ మంత్రి కే తారకరామారావు ఆవిష్కరించారు. ఆరోగ్యశాఖ, ఐటీ శాఖలు.. ఏడబ్ల్యూఎస్, సిస్కో, హైదరాబాద్ స్టార్టప్ సంస్థ క్వాంటెలాతో కలిసి ఈ యాప్‌ను రూపొందించాయని మంత్రి వెల్లడించారు. ఇది రాష్ట్ర ప్రజలకు అన్నిరకాలుగా ఉపయోగపడుతుందని తెలిపారు. కరోనాకట్టడిలో సహాయపడేందుకు ఈ మొబైల్ యాప్ ప్రజలకు ఉపయోపడుతుందని క్వాంటెలా ఫౌండర్, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ శ్రీధర్ గాంధీ తెలిపారు.

తెలంగాణ కొవిడ్-19 మొబైల్ యాప్‌ను శనివారం ప్రగతిభవన్‌లో ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ తదితరులు

టీకొవిడ్-19 యాప్ ప్రత్యేకతలు

- కొవిడ్-19 కేసులకు సంబంధించి అధికారిక సమాచారం ఇందులో లభిస్తుంది. కరోనా కేసుల తాజా విశేషాలు, సంఖ్యను ఈ యాప్‌లో తెలుసుకోవచ్చు.
- ప్రజలు అనవసరంగా ఆందోళనకు గురికాకుండా ఈ యాప్ ద్వారా కరోనా నిర్ధారణకు స్వీయ పరీక్షల్ని చేసుకోవచ్చు.
- కాల్‌హెల్ప్ తరహా విధానాన్ని మొబైల్ యాప్‌లో అనుసంధానం చేశారు.
- రోగులు.. డాక్టర్ల అపాయింట్‌మెంట్లను బుక్ చేసుకోవచ్చు.
- రాష్ట్రంలోని కొవిడ్-19 అధీకృత ల్యాబ్‌లు, పరీక్ష కేంద్రాలు, ఐసోలేషన్ వార్డులు, క్వారంటైన్ సెంటర్ల వివరాలుంటాయి.
- కరోనా సోకిన వ్యక్తి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొంటే.. అతడు ఎక్కడెక్కడ తిరిగాడనే విషయం కూడా ప్రభుత్వానికి తెలుస్తుంది. ప్రజలను, ప్రభుత్వ విభాగాలను వెంటనే అప్రమత్తం చేస్తుంది.

హువెల్‌కు మంత్రి కేటీఆర్ అభినందన

హైదరాబాద్‌కు చెందిన హువెల్ లైఫ్ సైన్సెస్ సంస్థ రెండుగంటల్లోనే కరోనాను నిర్ధారించే టెస్ట్ కిట్లను రూపొందించినట్టు తెలిపింది. సంస్థ ప్రతినిధులు రచన, శిశిర్ శనివారం ప్రగతిభవన్‌లో మంత్రి కేటీఆర్‌ను కలిసి కరోనా టెస్టింగ్‌కిట్ గురించి వివరించారు. ప్రస్తుత ఆపత్కాలంలో ఇలాంటి కిట్ తయారుచేసిన సంస్థ హైదరాబాద్‌కు చెందినది కావడం అభినందనీయమని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. భేటీలో పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్, లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ శక్తినాగప్పన్ పాల్గొన్నారు.

కలిసికట్టుగా వైరస్‌పై పోరు

సవాళ్ల నుంచే అవకాశాలను వెతుక్కోవాలి • ప్రభుత్వానికి, ఉద్యోగులకు అండగా నిలువాలి
పరిశ్రమలను ఆదుకొనేందుకు కేంద్రంతో చర్చిస్తున్నాం • 'ఈవో' పారిశ్రామికవేత్తలతో మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా మహమ్మారిని కలిసికట్టుగా ఎదుర్కొని విజయం సాధించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కే తారకరామారావు పేర్కొన్నారు. కరోనా కారణంగా ఎదురవుతున్న సవాళ్ల నుంచే అవకాశాలను గుర్తించాలని అన్నారు. ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆర్గనైజేషన్ (ఈవో) హైదరాబాద్ చాప్టర్‌కు చెందిన 90 మంది పారిశ్రామికవేత్తలతో కేటీఆర్ శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. కరోనా కారణంగా సవాళ్లు ఎదుర్కొంటున్న రంగాల్లో పెట్టుబడులు పెట్టే అంశాన్ని పరిశీలించాలని మంత్రి వారిని కోరారు. లాక్‌డౌన్ నేపథ్యంలో సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న పరిశ్రమలను ఆదుకొనేందుకు కేంద్రంతో చర్చిస్తున్నామని చెప్పారు. ఆపత్కాలంలో ప్రభుత్వానికి, తమ పరిశ్రమల్లోని ఉద్యోగులకు అండగా ఉండాలని ఈవో ప్రతినిధులను కేటీఆర్ కో

లాక్‌డౌన్-డే 20

ఏడుంటివి ఎట్టుంటివి
ఏందయ్యా, ఇదేందయ్యా
గుబులు గుబులవుతున్నది
కరోనా మహమ్మారి
కలలోనా.. ఇలలోనా
కనపడని కిలాడీ
- రవికిశోర్, పెంట్రాల

కరోనా నంతరం

ఆన్‌లైన్ తరగతుల జోష్

లాక్‌డౌన్ కష్టాలను అధిగమించేందుకు చిన్న స్కూళ్లు మొదలు బడా విద్యాసంస్థల వరకు 'ఆన్‌లైన్' బాట పట్టాయి. లైవ్ స్ట్రీమింగ్ లేదా రికార్డు చేసిన వీడియోల ద్వారా తమ విద్యార్థులకు పాఠాలను బోధిస్తున్నాయి. హోంవర్క్‌ను వాట్సాప్‌లో పంపిస్తున్నాయి. భవిష్యత్తులోనూ ఇవి కొనసాగవచ్చు.

- రోజూ ఉపాధ్యాయులు బోధిస్తుంటే.. వీడియో రికార్డింగ్ లేదా లైవ్ స్ట్రీమింగ్ చేస్తారు. వివిధ కారణాల వల్ల తరగతులకు హాజరుకాని విద్యార్థులు విద్యాసంస్థ వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి ఆ పాఠాలను వీక్షించవచ్చు.
- ఈ-పాఠ్య పుస్తకాలు వచ్చేస్తాయి. విద్యాసంస్థలు ఆన్‌లైన్ లైబ్రరీలను ఏర్పాటుచేసుకుంటాయి.
- హోంవర్క్ వాట్సాప్‌లో వచ్చేస్తుంది. పుస్తకాలు, నోట్‌బుక్‌ల స్థానాన్ని ట్యాబ్‌లు ఆక్రమిస్తాయి.
- నిపుణులు నేరుగా విద్యాసంస్థకు రాకుండా.. క్లాస్‌లో ఏర్పాటు చేసిన మానిటర్ ద్వారా లైవ్ స్ట్రీమింగ్‌లో పాఠాలు చెప్తారు.
- వర్చువల్ 3డీ ఇమేజింగ్ విధానంలో ఉపాధ్యాయుడు ఇంట్లోనే ఉంటూ డిజిటల్ రూపంలో ప్రత్యక్షమై పాఠాలు బోధించొచ్చు.

నా జీవితంలో అదే అతిపెద్ద నిర్ణయం: ట్రంప్

వాషింగ్టన్: కరోనా నేపథ్యంలో దేశంలో విధించిన ఆంక్షల్ని ఎత్తివేయడం సవాలుతో కూడుకున్నదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అభిప్రాయపడ్డారు. తన జీవితంలో తీసుకున్న నిర్ణయాల్లో ఇదే అతిపెద్దది కాబోతున్నదన్నారు. ఆర్థిక వ్యవస్థ తిరిగి పుంజుకునేందుకు దేశంలో ఎప్పుడు ఆంక్షల్ని ఎత్తివేయాలన్న దానిపై సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటానన్నారు. దీనికోసం నిపుణుల సూచనల్ని తీసుకుంటానన్నారు.

అమెరికాపై..

'ఒరిజినల్' కరోనా పంజా

- ఏ,బీ,సీ వర్గాలుగా వైరస్ గుర్తింపు
- ఎక్కువ నష్టం చేస్తున్నది మొదటి రకమే
- కేంబ్రిడ్జ్ పరిశోధకుల వెల్లడి

మాన్‌హట్టన్‌లోని మౌంట్ సినాయ్ హాస్పిటల్‌లో కరోనాతో మృతిచెందిన సహచర డాక్టర్లు, నర్సులకు నివాళులర్పిస్తున్న వైద్యసిబ్బంది

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా విశ్వమారి అగ్రరాజ్యం అమెరికాకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నది. మిగిలిన దేశాలతో పోలిస్తే వైరస్ కారణంగా అక్కడి ప్రజలు పెద్దమొత్తంలో మృత్యువాత పడుతున్నారు. దీంతో అమెరికాపై కరోనా ఎందుకు తీవ్రంగా విరుచుకుపడుతున్నదన్న దానిపై కేంబ్రిడ్జ్‌కి చెందిన నిపుణులు పరిశోధనలు చేశారు. ప్రజల రోగ నిరోధక శక్తిని ఎదుర్కొనేందుకు ఈ మహమ్మారి నిరంతరం పరివర్తన చెందుతున్నట్టు ఆ పరిశోధనల్లో గుర్తించారు. ఇందులో భాగంగా వైరస్ ఇప్పటి వరకు మూడు రూపాల్లోకి మారిందన్నారు. వీటిని ఏ,బీ,సీ వర్గాలుగా విభజించినట్టు చెప్పారు. చైనాలో పుట్టిన కరోనా 'ఏ' రకానికి చెందిన వైరస్ ఆనవాళ్లు అమెరికాలో ఉన్నట్టు పేర్కొన్నారు. దీని కారణంగానే అమెరికాపై వైరస్ తీవ్ర ప్రభావం చూపుతున్నదని తెలిపారు. వారి విశ్లేషణ ప్రకారం.. 'ఏ' రకానికి చెందిన వైరస్ మొదట గబ్బిలాల నుంచి మనిషికి సంక్రమించింది. ఇది తొలిరకం వైరస్. చైనాలోని వుహాన్‌తో పాటు, అమెరికా, ఆస్ట్రేలియాలో ఈ రకం వైరస్ కనిపిస్తున్నది. జన్యు మార్పుల కారణంగా 'ఏ' రకం నుంచి 'బీ' రకం వైరస్ పరివర్తన చెందిందని, ఈ వైరస్ కెనడా, బ్రెజిల్, బ్రిటన్, ఫిన్లాండ్, డెన్మార్క్, బెల్జియం, స్పెయిన్, ఫ్రాన్స్‌పై ప్రభావం చూపుతున్నట్టు తెలిపారు. ఇక 'బీ' వైరస్ నుంచి 'సీ' రకానికి చెందిన వైరస్ ఉద్భవించిందని, 'బీ'కి కూతురుగా చెప్పే ఈ వైరస్ సింగపూర్, హాంకాంగ్, దక్షిణ కొరియాలో ఎక్కువగా కనిపిస్తున్నదని వెల్లడించారు. అయితే 'ఏ' రకానికి చెందిన వైరస్ జన్యుక్రమంతో 'సీ' రకానికి చెందిన ఈ వైరస్‌కు ఎలాంటి పోలికలు లేవన్నారు.

40 నుంచి 70 శాతం మరణాలు వారివే

అమెరికాలో కరోనాతో మరణిస్తున్న వారిలో ఎక్కువ శాతం నల్లజాతీయులే ఉంటున్నారు. దేశ జనాభాలో వీరు 13 శాతమే ఉన్నప్పటికీ, మొత్తం కరోనా మరణాల్లో మాత్రం దాదాపు 40 - 70% వీరే ఉంటున్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. నల్లజాతి వారిలో ఎక్కువమందికి మధుమేహం, గుండెజబ్బులు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు ఉండడంమే ఇందుకు ప్రధాన కారణమని వైద్యులు తెలిపారు. అలాగే ఆర్థిక, సామాజిక కారణాలు, ఆహార అలవాట్లు కూడా మరణాలకు మరో కారణమని చెప్పారు.

యూరప్ నుంచే కరోనా..

యూరప్ దేశాల నుంచి వచ్చిన ప్రయాణికుల ద్వారానే కరోనా వైరస్ న్యూయార్క్‌కు వ్యాపించిందని, ఆసియా దేశాల నుంచి కాదని అమెరికాలోని ఎన్‌వైయూ గ్రాస్‌మన్ స్కూల్ ఆఫ్ మెడిసన్, ఇకాన్ స్కూల్ ఆఫ్ మెడిసన్ అధ్యయనంలో తేలింది.

న్యూయార్క్‌పైనే తీవ్రత ఎందుకు?

కరోనాతో అమెరికాలో సంభవించిన మొత్తం మరణాల్లో దాదాపు 41% న్యూయార్క్‌లోనే నమోదయ్యాయి. అత్యధిక జన సాంద్రత కలిగిన నగరాల్లో న్యూయార్క్ ఒకటని, నగరంలో చదరపు కి.మీ.కు సగటున పది వేల మంది వరకు నివసించడం వల్ల వైరస్ సులభంగా వ్యాపించిందని ఆ రాష్ట్ర గవర్నర్ ఆండ్రూ క్యూమో తెలిపారు. దీంతో పాటు అమెరికా సందర్శనకు వచ్చే పర్యటకులు న్యూయార్క్‌లోనే మొదట దిగుతారని, దీంతో వైరస్ వ్యాపిస్తే ముందుగా ప్రభావితం అయ్యేది న్యూయార్క్ నగరమేనని చెప్పారు.

- ఎక్కడి నుంచైతే నడక ప్రారంభించారో.. తిరిగి అక్కడికే

ఓ వైపు లాక్‌డౌన్.. ఏం చేయాలో తెలియదు.. సొంతూరుకు వెళ్దామంటే రవాణా సదుపాయాలు లేవు. అయితేనేం కాలినడకన మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన అచాడ్ గ్రామం నుంచి గుజరాత్‌కు బయలుదేరారు దాదాపు 20 మంది వలస కార్మికులు.మహారాష్ట్ర సరిహద్దు మూసివేసి ఉండటంతో అడవిబాట పట్టారు. అలా అడవిలో నడుచుకుంటూ గుజరాత్‌లోని సూరత్ జిల్లా దరిదాపుల వరకు వెళ్లారు. కానీ అక్కడ ఉన్న పోలీసులు వీరిని గుర్తించి ఓ వాహనంలో మహారాష్ట్ర సరిహద్దు వరకు తీసుకొచ్చి వదిలేశారు. దీంతో చివరికి వాళ్లు ఎక్కడి నుంచైతే నడక ప్రారంభించారో.. తిరిగి అక్కడికే చేరుకున్నారు. ఇలా 10 రోజులు 400 కి.మీ. మేర వీరంతా నడిచారు.

సైకిల్‌పై 1,700 కిలోమీటర్ల ప్రయాణం!

మహేశ్ జెనా (20) వలసకూలీ.. లాక్‌డౌన్‌తో చేతిలో పని లేకుండా పోయింది. రోజు గడవడానికి సరిపోను డబ్బు లేదు. దిక్కుతోచని పరిస్థితిలో సైకిల్‌పై ఒంటరిగా బయల్దేరి ఏడు రోజుల్లో 1,700 కిలోమీటర్లు ప్రయాణించి ఒడిశాలో జాజ్‌పూర్ జిల్లాలోని తన స్వగ్రామం బాదాసురికి చేరుకున్నాడు. మహేశ్ మహారాష్ట్ర సాంగ్లిలోని ఒక ఫ్యాక్టరీలో నెలకు రూ.15,000 జీతానికి పనిచేస్తున్నాడు. కరోనా కట్టడికి లాక్‌డౌన్ ప్రకటించగానే ఫ్యాక్టరీని మూసేశారు. దీంతో సైకిల్‌పై ఇంటికి బయల్దేరాడు.

40మంది ఎన్నారైలు మృతి!

- భారతీయ అమెరికన్లపై కరోనా వైరస్ పంజా
- 1,500 మందికిపైగా బాధితుల గుర్తింపు

వాషింగ్టన్: అమెరికాలో కరోనా బారిన పడి 40 మందికిపైగా భారతీయ అమెరికన్లు ప్రాణాలు కోల్పోగా, పాజిటివ్ కేసుల సంఖ్య 1,500కుపైగా ఉన్నట్టు అక్కడి భారతీయ సంఘాల నాయకులు తెలిపారు. కరోనా మరణాలు అధికంగా ఉన్న న్యూయార్క్, దాని పక్కనున్న న్యూజెర్సీ రాష్ట్రాల్లోనే అత్యధిక సంఖ్యలో భారతీయులు నివసిస్తున్నారు. ఇప్పటివరకూ కరోనా బారినపడి మరణించిన ఎన్నారైలలో 17 మంది కేరళకు చెందినవారుకాగా, 10 మంది గుజరాతీలు, నలుగురు పంజాబీలు, ఇద్దరు ఏపీ, ఒకరు ఒడిశాకు చెందినవారున్నారు. మృతుల్లో 21 ఏండ్ల వ్యక్తి ఒకరు మినహా అందరూ 60 ఏండ్లు పైబడినవారే. మృతుల్లో డజనుమంది లిటిల్ ఇండియాగా గుర్తింపుపొందిన న్యూజెర్సీ, ఓక్ ప్రాంతానికి చెందినవారు కాగా, 15 మంది న్యూయార్క్‌కు చెందినవారు. పెన్సిల్వేనియా, ఫ్లోరిడా రాష్ట్రాల్లో మరో నలుగురు, టెక్సాస్, కాలిఫోర్నియాలో ఒక్కొక్కరు చొప్పున కరోనాతో మరణించినట్టు సమాచారం. ఎంతోమంది భారతీయులు కరోనా సంక్షోభ సమయంలో ఆయా ప్రాంతాల్లో సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్టు న్యూజెర్సీలో రియల్‌ఎస్టేట్ వ్యాపారం నిర్వహించే భవేశ్ దవే తెలిపారు.

ఒక్కరోజులోనే 2,108 మరణాలు

- కరోనా మృతుల్లో అమెరికా రికార్డు

వాషింగ్టన్: కరోనా వైరస్ వల్ల అమెరికాలో ఒక్కరోజే 2,108 మంది మృత్యువాతపడ్డారు. కొవిడ్-19తో ఒక దేశంలో ఒక్కరోజులోనే ఇంత మంది చనిపోవడం ఇదే తొలిసారి. ప్రపంచంలోనే అత్యధిక కరోనా మరణాలు (18,860) నమోదైన దేశంగా కూడా అగ్రరాజ్యం నిలిచింది. దీంతో 18,840 మరణాలతో ఇప్పటివరకూ అత్యధిక కరోనా మరణాలు నమోదైన దేశంగా ఉన్న ఇటలీని అమెరికా అధిగమించినట్టైంది.

- ప్రపంచంలోనే అతిపొడవైన జీవి గుర్తింపు!

జెల్లీఫిష్‌ను పోలి ఉన్న అత్యంత పొడవైన సముద్రజీవిని స్మిథ్‌సోనియన్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధకులు గుర్తించారు. హిందూ మహా సముద్రంలో దీన్ని కనుగొన్నారు. ఇది ప్రపంచంలోనే అత్యంత పొడవైన జీవిగా భావిస్తున్నారు. దీని పొడవు దాదాపు 15 మీటర్లు.

ఒంటె పాలను పంపిన రైల్వే

న్యూఢిల్లీ: ఆటిజంతో బాధపడుతున్న తన కుమారుడిని ఆదుకోవాలని ట్విట్టర్ ద్వారా ఓ తల్లి చేసిన విజ్ఞప్తికి రైల్వే శాఖ స్పందించింది. 20 లీటర్ల ఒంటె పాలను ఆ కుటుంబానికి పంపింది. తన కుమారుడికి ఆటిజం ఉన్నదని, ఒంటె పాలు మాత్రమే పిల్లాడికి పడుతాయని ముంబైకి చెందిన రేణు అనే మహిళ ట్వీట్‌చేశారు. లాక్‌డౌన్ కారణంగా ఒంటె పాలు దొరకడం లేదని, దయచేసి ఆదుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన ఐపీఎస్ అధికారి అరుణ్ బోత్రా రాజస్థాన్‌లోని ఒంటె పాల సరఫరా సంస్థ అద్విక్ ఫుడ్స్‌ను సంప్రదించారు. రైల్వే సహకారంతో గూడ్స్ రైలులో పాలను ముంబైకి సరఫరా చేయించారు.

అన్ని అవయవాలకూ ముప్పే!

వైరస్ వ్యాప్తి తీవ్రమైతే భారీ మూల్యమే ● ఇండ్లకు పరిమితంకావడమే ఉత్తమం

'నమస్తే తెలంగాణ'తో 'గాంధీ' జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ రాజారావు



హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: కరోనా వైరస్ ఊపిరితిత్తులపైనే ప్రభావం చూపుతుందని తొలుత భావించామని, కానీ ప్రధాన అవయవాలపై కూడా ప్రభావం చూపుతున్నట్టు తాజా కేసుల ద్వారా తెలుస్తున్నదని గాంధీ దవాఖాన జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ రాజారావు పేర్కొన్నారు. 'నమస్తే తెలంగాణ'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన అనేక ఆసక్తికర విషయాలు వెల్లడించారు.

మందులేనందున ప్రమాదకరం

కరోనా వైరస్ ఎలా సంక్రమిస్తున్నది? గుణగణాలు ఏమిటన్న విషయాలపై పరిశోధనలు జరుగుతున్నాయి. సరైన మందులు, చికిత్స అందుబాటులో లేనందునే వైరస్‌ను ప్రమాదకరమైనదిగా పరిగణిస్తున్నాం. సాధారణంగా ఈ వైరస్ లోహపు వస్తువులపై 12 గంటలు, దుస్తులపై 9 గంటలు, వ్యక్తుల చేతులపై 10 నిమిషాలే బతికి ఉంటుంది. కొవిడ్-19 బాధితుడు ఏవైనా వస్తువులను తాకినప్పుడు, కరచాలనం చేసినప్పుడు ఈ వైరస్ ఇతరులకు సోకే అవకాశాలు ఉంటాయి. అందువల్ల తరచూ సబ్బు లేదా హ్యాండ్‌వాష్‌తో చేతులను శుభ్రపరుచుకోవడం ఉత్తమం. జలుబు, దగ్గు, జ్వరం ఉన్నవారు ఇతరులకు దూరంగా ఉండాలి. కరోనా వైరస్ సోకిన ప్రతి 100 మందిలో 80 మందికి స్వల్ప అనారోగ్య సమస్యలు ఎదురవుతాయి, మిగిలిన 20 మంది ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుంది. వీరిలో కేవలం ముగ్గురికే ప్రాణాపాయం ఉంటుంది. ఊపిరితిత్తులకు సోకిన కరోనా వైరస్.. క్రమంగా గుండె, మూత్రపిండాలు, కాలేయం లాంటి ప్రధాన అవయవాలపై ప్రభావం చూపడంవల్ల మరణాలు సంభవిస్తాయి.

వీరు ఎక్కువ ముప్పు

రోగనిరోధకశక్తి తక్కువగా ఉండే వృద్ధులు, గర్భిణులతోపాటు బీపీ, షుగర్, థైరాయిడ్, హెచ్‌ఐవీ, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు త్వరగా కరోనా ప్రభావానికి గురయ్యే అవకాశాలుంటాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలెవరూ ఇండ్ల నుంచి బయటకు రాకపోవడం మంచిది. ఎవరైనా అత్యవసర పరిస్థితుల్లో బయటకు రావాల్సి వస్తే సరైన మాస్కులు, గ్లౌజులు ధరించాలి. బయట నుంచి వచ్చిన వెంటనే స్నానంచేసి ఇంట్లోకి వెళ్లడం, తరచూ చేతులను శుభ్రపరుచుకోవడం మంచిది.

51 మంది డిశ్చార్జి

- కరోనా నుంచి కోలుకున్న బాధితులు
- తాజాగా 16 కేసులు
- 503మందికి పాటిటివ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో శనివారం కొత్తగా 16 పాజిటివ్ కేసులు నమోదుకాగా, 51 మంది డిశ్చార్జి అయ్యారని, ఇద్దరు మృతి చెందినట్టు వైద్యారోగ్యశాఖ బులెటిన్ విడుదలచేసింది. రాష్ట్రంలో ఇప్పటివరకు 503 మందికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ కాగా, అందులో 96 మంది కోలుకుని డిశ్చార్జి అయ్యారు. మరో 14 మంది మృత్యువాతపడ్డారు. ప్రస్తుతం 393 మంది ఆయా దవాఖానల్లో చికిత్స పొందుతున్నారు. తెలంగాణలో ఇప్పటివరకు కమ్యూనిటీ ట్రాన్స్‌మిషన్ జరిగినట్టు నిర్ధారణ కాలేదని, రాష్ట్రంలో ఆరు డయాగ్నస్టిక్స్ ల్యాబ్‌లలో 24 గంటలు కొవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు బులెటిన్ పేర్కొన్నది. పాజిటివ్ కేసులు నమోదైన జిల్లాల్లో కంటైన్మెంట్ చర్యలు కొనసాగుతున్నట్టు ప్రకటించింది.

రాష్ట్రాలకు లాక్‌డౌన్ నిధులు

- కేంద్రానికి ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ విజ్ఞప్తి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా వ్యాప్తి నిరోధానికి లాక్‌డౌన్‌ను మరోసారి పొడిగిస్తే రాష్ట్రాలకు కేంద్రం సహాయం చేయాలని, పెద్దమొత్తంలో నిధులు కేటాయించాలని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కోరారు. ఉపాధి కోల్పోయిన కార్మికులకు రూ.5వేలు ఇవ్వాలని, వలస కూలీలకు ఆహారం సరఫరా చేయాలని విజ్ఞప్తిచేశారు. కరోనా నుంచి ప్రజల ప్రాణాలను కాపాడటం ఎంత ముఖ్యమో ఆకలి నుంచి పేదలను కాపాడటం కూడా అంతే ముఖ్యమని ట్వీట్ చేశారు. కేంద్రం హడావిడిగా లాక్‌డౌన్‌ను ప్రకటించడం వల్ల కూలీలు దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

లాక్‌డౌన్‌కు సహకరించాలి: అక్బరుద్దీన్

రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలను పాటించి, లాక్‌డౌన్ విజయవంతానికి ముస్లింలు సహకరించాలని ఎంఐఎం పార్టీ శాసనసభా పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ విజ్ఞప్తి చేశారు. కరోనా విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ ఇంట్లో ఉంటేనే అందరికీ మంచిదని పేర్కొన్నారు. ఖతర్నాక్ కరోనా వల్ల ప్రపంచవ్యాప్తంగా వేలమంది మృత్యువాత పడుతున్నారని చెప్పారు. మన కారణంగా ఎవరికి వైరస్ సోకినా వారి మరణానికి మనమే బాధ్యులమవుతామన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

రైల్వే కొవిడ్ వార్డులకు నియామకాలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: కొవిడ్-19 ప్రత్యేక వార్డుల్లో తాత్కాలిక వైద్య సిబ్బంది నియామకానికి దక్షిణ మధ్య రైల్వే నోటిఫికేషన్ జారీచేసింది. రైల్వే సెంట్రల్ దవాఖాన, లాలాగూడ, సికింద్రాబాద్ దవాఖానల్లోని వార్డుల్లో పనిచేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. మరిన్ని వివరాలకు 9701370624 లోగానీ, www.scr.indianrailways.gov.in లో సంప్రదించాలని సూచించింది.

మైనార్టీ గురుకులాలకు వక్ఫ్‌బోర్డు స్థలాలు

- హోంమంత్రి కృతజ్ఞతలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మైనార్టీ గురుకుల పాఠశాలల నిర్మాణం కోసం స్థలాలను నామమాత్రపు ధరలకే కేటాయించాలని వక్ఫ్‌బోర్డు తీర్మానించడంపై బోర్డు చైర్మన్ సలీం, సభ్యులకు హోంమంత్రి మహమూద్ అలీ కృతజ్ఞతలు తెలిపారు.

జర్నలిస్టులకు నేడు నిత్యావసరాలు పంపిణీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: లాక్‌డౌన్ సమాచారాన్ని ప్రజలకు చేరవేసే విధుల్లో ఉన్న జర్నలిస్టులకు నిత్యావసర సరుకులను అందజేయనున్నట్టు తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు సమాచారభవన్‌లో వేతనాలులేని జర్నలిస్టులు ముఖ్యంగా పార్ట్ టైమర్లు, స్ట్రింగర్లకు నిత్యావసర సరుకులతోపాటు మాస్క్‌లు, శానిటైజర్లు అందించనున్నట్టు పేర్కొన్నారు.

ఏపీ ఎస్ఈసీగా కనగరాజ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) కమిషనర్‌గా రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ వీ కనగరాజ్ బాధ్యతలు స్వీకరించారు. ఆయనను ఎస్ఈసీగా నియమిస్తూ ఏపీ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన గతంలో మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు.

భవిష్యత్‌పై కరోనా ప్రభావమెంత?

- వైరస్ అనంతర ఫలితాలపై ఉస్మానియావర్సిటీ దృష్టి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: భవిష్యత్‌లో కరోనా ప్రభావం ఎలా ఉండబోతున్నదనే అంశంపై పరిశోధనలు చేయడానికి పలు వర్సిటీలు ముందుకువస్తున్నాయి. కరోనా ప్రభావం వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతాయి? వాటిని ఏవిధంగా అధిగమించాలి? ప్రజల మానసిక స్థితి ఎలా ఉన్నది? లాక్‌డౌన్ వల్ల ప్రజలు ఇంట్లో ఏవిధంగా జీవనం గడుపుతున్నారు? ఫలితంగా ఎదురయ్యే సమస్యలు ఏమిటి? వంటి అంశాలపై పరిశోధనలు చేపట్టనున్నారు. పరిశోధనలపై ఇప్పటికే తాము దృష్టి సారించామని ఉస్మానియా వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి తెలిపారు. సామాజిక, ప్రజల జీవన, ఆర్థిక, విద్యారంగాలపై కరోనా వైరస్ ఎలాంటి ప్రభావం చూపుతుందోనన్న అంశాలపై పరిశోధనలు చేస్తామని వివరించారు. డిపార్టుమెంట్లవారీగా డీన్లు, సీనియర్ ప్రొఫెసర్లతో కమిటీ ఏర్పాటుచేసి చర్చిస్తున్నారు. ఐఐటీ హైదరాబాద్, వర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లు మాస్కులు, వ్యాక్సిన్, వెంటిలేటర్లు రూపొందిస్తున్నాయి. తమ వర్సిటీలో కరోనా వ్యాక్సిన్, వెంటిలేటర్లు, మాస్కుల తయారీకి కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖకు ప్రతిపాదనలు పంపుతున్నామని ఎన్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ రమణరావు చెప్పారు. కరోనాపై పరిశోధనలకు కేంద్రం రూ.200 కోట్లు మంజూరు చేసిందన్నారు. రెండువారాల్లో 500పైగా ప్రతిపాదనలు వచ్చాయని సైన్స్ అండ్ టెక్నాలజీ సెక్రటరీ అశ్‌తోష్‌శర్మ ప్రకటించారు. కొత్త ప్రతిపాదనలతో వస్తే మరిన్ని నిధులు కేటాయించడానికి కేంద్రం సిద్ధంగా ఉన్నదని ప్రకటించారు.

కొవిడ్‌పై 'నిట్' అధ్యయనం

- ఇద్దరు అధ్యాపకుల ఎంపిక

డాక్టర్ సౌమ్యా లిప్సా రధ్

డాక్టర్ కిషంత్‌కుమార్

నిట్‌క్యాంపస్ (వరంగల్): కొవిడ్-19పై అంతర్జాతీయ స్థాయి పరిశోధనల్లో పాల్గొనే అరుదైన అవకాశం వరంగల్ నిట్ అధ్యాపకులకు లభించింది. బయోటెక్నాలజీ విభాగానికి చెందిన అధ్యాపకులు డాక్టర్ సౌమ్యా లిప్సారధ్, డాక్టర్ కిషంత్‌కుమార్ ఇందుకు ఎంపికయ్యారు. అంతర్జాతీయ స్థాయి సంస్థలైన నాసా, ఐబీయం, గూగుల్‌క్లౌడ్, మైక్రోసాఫ్ట్, పిట్స్‌బర్గ్, ఇల్లినాయిస్‌వర్సిటీలు ఒకే వేదికగా ఏర్పడి ఈ అధ్యయనానికి పూనుకొన్నాయి. అధిక ఉష్ణోగ్రతలో వైరస్‌ను చంపగలమా? అనే అంశంపై నిట్ అధ్యాపకులు పంపిన ఐడియాను నిర్వాహకులు స్వీకరించినట్టు నిట్ అధికారులు తెలిపారు. తమ పరిశోధనలను నిట్ ల్యాబ్‌లో శనివారం నుంచే మొదలుపెట్టినట్లు డాక్టర్ సౌమ్యా లిప్సారధ్, డాక్టర్ కిషంత్‌కుమార్ తెలిపారు.

8 దవాఖానల్లో కొవిడ్-19 చికిత్స

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా పాజిటివ్, అనుమానిత లక్షణాలున్నవారికి రాష్ట్రంలోని 8 దవాఖానల్లో చికిత్స అందించనున్నట్టు వైద్య, ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఏ శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీచేశారు. గాంధీ, కింగ్‌కోఠి, గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్, నేచర్‌క్యూర్ (బేగంపేట), నిజామియా (చార్మినార్), ఎర్రగడ్డ ఆయుర్వేద దవాఖానతోపాటు వరంగల్‌లోని ప్రభుత్వ ఆయుర్వేద బోధన దవాఖాన, రామాంతాపూర్ హోమియో దవాఖానల్లో చికిత్స అందించనున్నారు.

నియంత్రిత ప్రాంతాల్లో నిఘా

కరోనా పాజిటివ్ కేసులు ఎక్కువగా నమోదైన రాష్ట్రంలోని 123 నియంత్రిత ప్రాంతాల్లో పోలీసు నిఘాను మరింత పటిష్టంచేశారు. ఇందుకోసం డ్రోన్లను సైతం వినియోగిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో కంచెలు ఏర్పాటుచేశారు. నియంత్రిత ప్రాంతంలో ఒక్క ద్వారం మాత్రమే ఉంచి, మిగిలిన మూడు దిక్కులను మూసివేసి, కఠినంగా లాక్‌డౌన్ అమలుచేస్తున్నట్టు ఓ పోలీస్ అధికారి తెలిపారు.

ఆన్‌లైన్‌లో పాఠాలు

- వినియోగించుకుంటున్న కేజీ టు పీజీ విద్యార్థులు
- యూనివర్సిటీల ప్రణాళికలు



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: లాక్‌డౌన్ కారణంగా ఇంటికే పరిమితమైన కేజీ టు పీజీ విద్యార్థులు ఆన్‌లైన్ పాఠాల వైపు మొగ్గుచూపుతున్నారు. పలు ప్రైవేటు విద్యాసంస్థలు తీసుకొచ్చిన ప్రాక్టీస్ విధానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకుంటున్నారు. టెన్త్ విద్యార్థులతోపాటు బీఏ, బీఎస్సీ, బీకాం, ఇంజినీరింగ్, ఫార్మసీ విద్యార్థులకు కొన్ని సాఫ్ట్‌వేర్ సంస్థలు ఆన్‌లైన్ ప్రాక్టీస్ విధానాన్ని తీసుకొచ్చాయి. ఎంసెట్, జేఈఈ మెయిన్, నీట్ వంటి ప్రవేశ పరీక్షలకు సంబంధించిన వీడియో పాఠాలను టీవీలు, యూట్యూబ్ ద్వారా టీసాట్ అందుబాటులోకి తీసుకొచ్చింది. విశ్వవిద్యాలయాలు సైతం సిలబస్‌ను ఆన్‌లైన్‌లో అందుబాటులో పెట్టేందుకు సిద్ధమవుతున్నాయి.

డీడీ యాదగిరిలో టెన్త్ పాఠాలు

పదో తరగతి విద్యార్థులకు పునఃశ్చరణ తరగతులను దూరదర్శన్ యాదగిరి చానల్ ద్వారా ఆదివారం నుంచి అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రకటించారు. ఈ నెల 23 వరకు ఉదయం 10-11 గంటల మధ్య, సాయంత్రం 4-5 గంటల మధ్య ఇంగ్లిష్, గణితం, భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రాల పాఠాలు ప్రసారమవుతాయన్నారు.

టీసీఎస్ అయాన్‌తో అగ్రివర్సిటీ లింక్

టీసీఎస్ అయాన్ లింక్ ద్వారా విద్యార్థులకు ఆన్‌లైన్‌లో తరగతులను నిర్వహించడానికి టీసీఎస్ యాజమాన్యంతో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఒప్పందం కుదుర్చుకొన్నది. సోమవారం నుంచి షెడ్యూలు ప్రకారం బీఎస్సీ అగ్రికల్చర్, బీటెక్ అగ్రికల్చర్, ఫుడ్ టెక్నాలజీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహిస్తామని వీసీ వీ ప్రవీణ్‌రావు తెలిపారు.

జేఎన్టీయూహెచ్ రేడియో పాఠాలు

జేఎన్టీయూహెచ్ అఫిలియేటెడ్ కాలేజీల్లో రేడియో

3 జోన్లుగా దేశం

- కరోనా వైరస్ తీవ్రతను బట్టి రెడ్, ఆరెంజ్, గ్రీన్ జోన్లు
- దేశవ్యాప్త లాక్‌డౌన్ పొడిగింపు నేపథ్యంలో కేంద్రం ఆలోచన
- వ్యవసాయం, పరిశ్రమలకు వెసులుబాటుకు అవకాశం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: దేశవ్యాప్తంగా విధించిన లాక్‌డౌన్‌ను మరికొంతకాలం పొడిగించనున్న నేపథ్యంలో దేశాన్ని మూడు జోన్లుగా విభజించాలని కేంద్రం భావిస్తున్నట్టు అధికార వర్గాలు శనివారం తెలిపాయి. కరోనా కేసులను బట్టి రెడ్ (వైరస్ తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతం), ఆరెంజ్ (తీవ్రత మధ్యస్థంగా ఉన్న ప్రాంతం) , గ్రీన్ (తీవ్రత తక్కువగా ఉన్న ప్రాంతం) జోన్లుగా వీటిని విభజించనున్నట్టు పేర్కొన్నాయి. దీంతోపాటు ఆర్థిక వ్యవస్థను పరిపుష్టం చేసే క్రమంలో ఆరెంజ్, గ్రీన్ జోన్లలోని కొన్ని పరిశ్రమలు తమ కార్యకలాపాల్ని కొనసాగించుకోవడానికి కొంత వెసులుబాటును కూడా కల్పించనున్నట్టు తెలిపాయి. అలాగే, వైరస్ తీవ్రత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో వ్యవసాయం, దాని అనుబంధ కార్యకలాపాల్ని అనుమతించే యోచనలో ఉన్నట్టు వివరించాయి. ఇదే సమయంలో నిర్ణీత దూరం వంటి నిబంధనల్ని అందరూ పాటించాలని సూచించాయి. దేశంలో కరోనా పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రధానంగా రెండు అంశాలపై కేంద్రం దృష్టి సారించినట్టు అధికారి ఒకరు పేర్కొన్నారు. వైరస్ వ్యాప్తిని కట్టడి చేసేందుకు హాట్‌స్పాట్లను గుర్తించడం ఒకటైతే, లాక్‌డౌన్ ఎత్తివేసిన అనంతరం ఆర్థిక వ్యవస్థ పుంజుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలు రెండోదని ఆ అధికారి పేర్కొన్నారు. దీంట్లో భాగంగా లాక్‌డౌన్‌తో కుదేలైన ఆర్థిక రంగాన్ని గాడిలో పెట్టేందుకు తీసుకోవాల్సిన కార్యాచరణపై సోమవారం నుంచి దృష్టి సారించాలని కేంద్ర మంత్రులకు ప్రభుత్వం సూచించిందని అధికార వర్గాలు తెలిపాయి.

సీఎంలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

30దాకా లాక్‌డౌన్

దేశవ్యాప్త లాక్‌డౌన్‌ను మరో రెండు వారాలు పొడిగించే అవకాశం ఉన్నది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాలు ఏకాభిప్రాయానికి వచ్చినట్టు తెలుస్తున్నది. దీనిపై అధికారిక ప్రకటన వెలువడటమే తరువాయి. ప్రస్తుతం కొనసాగుతున్న 21 రోజుల లాక్‌డౌన్ ఈ నెల 14వ తేదీతో ముగియనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ శనివారం అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సీఎంలు మాట్లాడుతూ లాక్‌డౌన్‌ను ఈ నెల 30 వరకు కొనసాగించాలని సూచించారు. ప్రధాని మోదీ సైతం 'లాక్‌డౌన్ పొడింపు ఆలోచన ఆహ్వానించదగినదే. మరో 15 రోజుల లాక్‌డౌన్‌కు సంబంధించిన మార్గదర్శకాలను రెండు మూడు రోజుల్లో విడుదల చేస్తాం' అని వారితో పేర్కొన్నట్టు తెలిసింది. ఈసారి సంపూర్ణ లాక్‌డౌన్ ఉండకపోవచ్చని, ఆర్థిక కార్యకలాపాలకు పునర్జీవం కల్పించేలా కొన్ని మినహాయింపులు ఉండొచ్చని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. 'ప్రజల జీవితాలు, ఆర్థిక వ్యవస్థ రెండూ ముఖ్యమే (జాన్ బీ.. జహాన్ బీ) ' అని సీఎంలకు మోదీ సూచించారు. దీనిని బట్టి వైరస్ ప్రభావం లేని ప్రాంతాల్లో ఆంక్షలు కొంతమేర సడలించవచ్చని అంచనావేస్తున్నారు. కొన్ని వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలను పునఃప్రారంభించే అవకాశం ఉన్నది.

రాష్ట్రాలకు సాయం చేయండి

వీడియో కాన్ఫరెన్స్ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, కర్ణాటక సీఎం యెడియూరప్ప, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, పంజాబ్ సీఎం అమరీందర్ సింగ్, పశ్చిమ బెంగాల్ సీఎం మమతాబెనర్జీ తదితరులు లాక్‌డౌన్‌ను కనీసం మరో రెండువారాలు పొడిగించాలని కోరారు. రాష్ట్రాలకు ఉద్దీపన ప్యాకేజీలు ప్రకటించాలని పలువురు సీఎంలు కోరారు. దీనిపై మోదీ స్పందిస్తూ ముఖ్యమంత్రుల అభిప్రాయాలను ఆహ్వానిస్తున్నామని, లాక్‌డౌన్ పొడిగింపుపై తుది నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

కేసులు 8.2 లక్షలకు చేరేవి

లాక్‌డౌన్, వ్యాప్తి నియంత్రణ చర్యలతో వైరస్ కట్టడి: కేంద్రం

న్యూఢిల్లీ: లాక్‌డౌన్ వంటి నియంత్రణ చర్యలతో కరోనాను కట్టడి చేయగలిగామని కేంద్ర ఆరోగ్యశాఖ తెలిపింది. లేనిపక్షంలో ఏప్రిల్ 15 నాటికి దేశంలో కరోనా కేసుల సంఖ్య 41 శాతం పెరిగి 8.2 లక్షలకు చేరి ఉండేదని ఆ శాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ చెప్పారు. గణాంకాల విశ్లేషణ మేరకు దీన్ని అంచనా వేశామన్నారు. ప్రభుత్వం ఎప్పటికప్పుడు స్పందించి వైరస్ వ్యాప్తి కేంద్రాలను గుర్తించడంతోపాటు ముందస్తు నిరోధక చర్యలు చేపట్టిందన్నారు. శుక్రవారం నుంచి శనివారం వరకు 24 గంటల్లో 1,035 కొత్త కేసులు, 40 మరణాలు నమోదయ్యాయని చెప్పారు. దీంతో దేశంలో మొత్తం వైరస్ కేసుల సంఖ్య 7,447కు, మరణాల సంఖ్య 239కి చేరిందన్నారు. దేశవ్యాప్తంగా 586 కరోనా ప్రత్యేక దవాఖానలు సిద్ధంగా ఉన్నాయన్నారు. వీటిలో లక్షకుపైగా ఐసోలేషన్ పడకలు, 11,500 ఐసీయూపడకలు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు.

బరిలోకి గూగుల్, యాపిల్!

- కరోనాపై పోరుకు చేతులు కలిపిన దిగ్గజ కంపెనీలు
- బాధితులను గుర్తించేందుకు ప్రభుత్వాలకు సహకారం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా మహమ్మారిని నిలువరించేందుకు టెక్ దిగ్గజ కంపెనీలు రంగంలోకి దిగాయి. వైరస్‌కు అడ్డుకట్ట వేసేందుకు గూగుల్, యాపిల్ సంస్థలు చేయిచేయి కలిపాయి. మహమ్మారిపై ఉమ్మడిగా పోరాటం సాగించాలని నిర్ణయించాయి. కరోనా వ్యాప్తిని అడ్డుకోవడానికి బాధితులను గుర్తించడం (కాంటాక్ట్ ట్రేసింగ్) అత్యంత ముఖ్యం. ఈ నేపథ్యంలో బ్లూటూత్ సాంకేతికత ద్వారా బాధితులను గుర్తించేందుకు ఈ రెండు సంస్థలు ముందుకొచ్చాయి. ప్రజల గోప్యతకు, భద్రతకు ముప్పు వాటిల్లకుండా, వైరస్ వ్యాప్తిని నిరోధించడంలో ప్రభుత్వాలకు, ప్రజారోగ్య సంస్థలకు రెండు కంపెనీలూ సహకారం అందించనున్నాయి. ప్రపంచంలోని మొత్తం స్మార్ట్‌ఫోన్‌లలో దాదాపు 99 శాతం ఈ రెండు కంపెనీల ఆపరేటింగ్ సిస్టమ్‌లపైనే నడుస్తున్నాయి. రెండు కంపెనీలు మొదట మే నెలలో అప్లికేషన్ ప్రోగ్రామ్ ఇంటర్‌ఫేస్(ఏపీఐ)ను విడుదల చేయనున్నాయి. తద్వారా యాప్‌లను ఆండ్రాయిడ్, ఐవోస్ డివైజ్‌లలో పరస్పరం ఆపరేట్ చేసేందుకు అవకాశం ఉంటుంది. బ్లూటూత్ ఆధారంగా బాధితులను గుర్తించేందుకు రెండు సంస్థలు ఒక ప్లాట్‌ఫామ్‌ను అభివృద్ధి చేయనున్నాయి.

మూడుముళ్ల బంధం.. ఐదుగురే సాక్ష్యం

జీవితాంతం గుర్తుండిపోయే పెండ్లి.. కరోనా పుణ్యమా అని తూతూ మంత్రంగా చేసుకోవాల్సి వస్తున్నది. ఏపీలోని విశాఖ జిల్లా అనకాపల్లిలో శుక్రవారం జరిగిన ఓ పెండ్లిలో వరుడు, వధువు వారి తల్లిదండ్రులు, పురోహితుడే ఉన్నారు. మూడుముళ్ల బంధానికి ఐదుగురే సాక్ష్యంగా నిలిచారు.

కార్మికులకు 12 గంటల షిఫ్ట్!

న్యూఢిల్లీ: లాక్‌డౌన్ కొనసాగనున్న నేపథ్యంలో.. ఆహారం, ఔషధాలు వంటి నిత్యావసరాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఫ్యాక్టరీల్లో 8 గంటల షిఫ్ట్ విధానాన్ని 12 గంటలకు మార్చాలని కేంద్రం భావిస్తున్నట్లు సమాచారం. ఆ మేరకు కార్మికులకు మరికొంత వేతనం చెల్లించాలన్న ప్రతిపాదన కూడా ఉన్నట్లు తెలుస్తున్నది. ప్రస్తుత నిబంధనల ప్రకారం సగటున రోజుకు 8 గంటలకు మించి పనిచేయించుకోరాదు.

మద్యంను అనుమతించండి

న్యూఢిల్లీ: దశలవారీగా మద్యం పరిశ్రమను ప్రారంభించాలని, ఆన్‌లైన్ విక్రయాలకు అనుమతించాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌ను భారత మద్యం తయారీ కంపెనీల సమాఖ్య (సీఐఏబీసీ) కోరింది. లాక్‌డౌన్ వల్ల కార్మికులు ఉపాధి కోల్పోగా, పరిశ్రమ ఆర్థిక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నదంటూ లేఖ రాసింది.

పింఛను తగ్గింపు వార్తల్లో నిజం లేదు

న్యూఢిల్లీ: కరోనా నేపథ్యంలో 80 ఏండ్లు దాటిన వృద్ధులకు పెన్షన్‌ను 30 శాతానికి తగ్గించడంగానీ, పూర్తిగా రద్దు చేయడంగానీ చేస్తారన్న వదంతులను కేంద్రం తోసిపుచ్చింది. సోషల్ మీడియాలో జోరుగా సాగుతున్న వదంతుల్లో వాస్తవం లేదని స్పష్టం చేసింది.

బిడ్డకు జన్మనిచ్చిన కరోనా రోగి

కన్నూర్ : కేరళలోని కన్నూర్‌లో కరోనా సోకిన ఓ నిండు గర్భిణి పండంటి పాపకు జన్మనిచ్చారు. పురుటి నొప్పులతో బాధపడుతున్న ఆమెకు ప్రభుత్వ దవాఖానలో శస్త్రచికిత్స ద్వారా కాన్పు చేశారు. తల్లికి కరోనా ఉండటంతో బిడ్డకు సోకిందా? అన్నది తెలుసుకునేందుకు శాంపిల్స్‌ను పరీక్షల కోసం పంపారు.

ఇటలీలో మే 3 వరకు లాక్‌డౌన్!

రోమ్: కరోనా మహమ్మారిని నిరోధించడానికి వచ్చేనెల మూడో తేదీ వరకు దేశవ్యాప్త లాక్‌డౌన్ కొనసాగిస్తున్నట్లు ఇటలీ ప్రధాని గౌసెప్పె కాంటే ప్రకటించారు. లాక్‌డౌన్ కొనసాగించవద్దని పలు వ్యాపార, వాణిజ్య వర్గాల నుంచి వచ్చిన ఒత్తిళ్లను ఆయన లెక్కచేయలేదు.

వారి ఆచూకీ తెలిపితే 5000 బహుమతి

ఆజంగఢ్: తబ్లిగీ జమాత్ సమావేశాలకు హాజరైన వారు తమ ఆచూకీ తెలియకుండా ఇంకా తలదాచుకుంటున్నారని ఉత్తరప్రదేశ్ పోలీసులు చెప్పారు. వారి ఆచూకీ తెలిపిన వారికి రూ.5000 బహుమతిగా అందజేస్తామన్నారు. వారి వివరాలను వెల్లడించమని హామీ ఇచ్చారు.

బ్రిటన్‌కు 30 లక్షల ట్యాబ్లెట్లు

లండన్: భారత్ నుంచి బ్రిటన్ ఆదివారం 30 లక్షల పారాసెటమాల్ ట్యాబ్లెట్ ప్యాకెట్లను అందుకోనున్నది. పారాసెటమాల్ ట్యాబ్లెట్లతోపాటు, దేశంలో చిక్కుకుపోయిన బ్రిటన్ వాసులను ఒక విమానంలో భారత్ పంపించింది. కరోనాపై పోరులో భాగంగా భారత్ సహాయానికి బ్రిటన్ కృతజ్ఞతలు తెలిపింది.

సీఎంల మీటింగ్‌లో 'గంచా' ధరించిన మోదీ

న్యూఢిల్లీ: దేశంలో కరోనా మహమ్మారి వ్యాప్తి, వైరస్‌పై పోరాటానికి రూపొందించాల్సిన కార్యాచరణపై వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో మోదీ తన ముఖానికి తెల్లని కాటన్ వస్త్రంతో ఇంట్లో తయారు చేసిన గంచా(తువాలు లాంటి దానిని)ను ధరించారు. దేశంలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రధాని తొలిసారిగా మాస్కు ధరించి సమావేశంలో పాల్గొనడం విశేషం. వైరస్ నుంచి రక్షణ కొరకు ప్రజలు గంచా లేదా ఇంట్లో తయారు చేసిన మాస్కులను ధరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కరోనాపై విస్తృత పరిశోధనలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనాపై దేశవ్యాప్తంగా మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ (ఎంహెచ్చార్డీ) నేతృత్వంలో ఐఐటీల్లో పరిశోధనలు ప్రారంభమయ్యాయి. ఏడు రంగాల్లో దాదాపు 190 ప్రాజెక్టులకు అనుమతులు మంజూరుచేసినట్టు ఐఐటీ కౌన్సిల్ ప్రకటించింది. ఈ పరిశోధనలకు అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. సాధ్యమైనంత త్వరలో పరిశోధనలు పూర్తిచేసేలా కృషి జరుగుతున్నదని తెలిపింది. రంగాలవారీగా పరిశోధన జరుగుతున్న ప్రాజెక్టుల సంఖ్యను ప్రకటించింది. పర్సనల్ ప్రొటెక్టివ్ కేర్ ఎక్విప్‌మెంట్ అంశంపై 42 ప్రాజెక్టులు, టెస్టింగ్ కిట్స్‌పై 21, శానిటైజేషన్‌పై 26, మెడికల్ ఎక్విప్‌మెంట్/రొబోలపై 34, సర్వైలెన్స్‌పై 13, ట్రీట్‌మెంట్ విభాగంలోని ఫార్మాకాలాజికల్, నాన్ ఫార్మాకాలాజికల్ అంశాల్లో 30, డాట్ ఎనలిటిక్స్, ఏఐ టు మోడల్ ఎపిడమిక్ ప్యాటర్న్ అండ్ డిసీజెస్ డైనమిక్స్‌పై 24 పరిశోధన ప్రాజెక్టులకు అనుమతిచ్చినట్టు తెలిపింది.

లాక్‌డౌన్ ప్రజలదే..
స్వీడన్ విధమిదే

- కరోనా విజృంభిస్తున్నా ఊసేలేని లాక్‌డౌన్
- ప్రజలే బాధ్యతగా ప్రవర్తించాలంటున్న ప్రభుత్వం
- ఇప్పటికీ స్వేచ్ఛగా తిరుగుతున్న స్వీడన్‌వాసులు
- 10వేలు దాటిన కేసులు.. 887 మరణాలు

కరోనా ధాటికి దాదాపు ప్రపంచమంతా దిగ్బంధంలోకి వెళ్తే.. అక్కడ మాత్రం ఇప్పటికీ ప్రజలు స్వేచ్ఛగా తిరుగుతున్నారు. స్కూళ్లు మొదలు వర్సిటీల వరకు విద్యాసంస్థలు కొనసాగుతున్నాయి. ప్రజా రవాణా వ్యవస్థ నడుస్తున్నది. హోటళ్లు, కాఫీ షాప్‌లు జనాలతో కళకళలాడుతున్నాయి. దుకాణాలన్నీ తెరిచే ఉంటున్నాయి. 'మాస్కులు ధరించండి.. బయటికొస్తే ఫైన్ వేస్తాం, జైల్లో పెడుతాం' వంటి నిబంధనలేమీ లేవు. ఆ దేశమే స్వీడన్. పొరుగునున్న ఫ్రాన్స్, జర్మనీ కరోనాతో అతలాకుతలం అవుతున్నా, పక్కనే ఉన్న ఇంగ్లాండ్‌లో ప్రధాని బోరిస్ జాన్సన్ చావు అంచులదాకా వెళ్లివచ్చినా.. స్వీడన్‌లో మాత్రం ప్రజలపై పెద్దగా ఆంక్షలు విధించలేదు. అలాగని కరోనా కేసుల సంఖ్య తక్కువేం లేదు. 10వేల కేసులు, 900 మరణాలు నమోదయ్యాయి.

స్వీడన్ రాజధాని స్టాక్‌హోమ్‌లో గుంపులుగా తిరుగుతున్న ప్రజలు

బాధ్యతగా మెలుగుతున్నారు

'మేము ఆంక్షలు విధించేకన్నా.. ప్రజలే బాధ్యతగా వ్యవహరించాలి' అనేది స్వీడన్ ప్రభుత్వ సూత్రం. కరోనా ప్రభావిత దేశాల్లో మాదిరిగానే నిర్ణీత దూరం, స్వీయ నిర్బంధం, క్వారంటైన్, మాస్కులు ధరించడం, వర్క్ ఫ్రమ్ హోమ్ వంటి సూచనలు చేసింది. అంతేతప్ప కచ్చితంగా పాటించాలంటూ ఆంక్షలు పెట్టలేదు. 'స్వీడన్‌వాసులపై మాకు అపారమైన నమ్మకం ఉన్నది. వారు తమ బాధ్యతలను తూచా తప్పకుండా నెరవేరుస్తున్నారు' అని స్వీడన్ జాతీయ ఆరోగ్య సలహాదారు టెగ్నెల్ తెలిపారు. లాక్‌డౌన్ విధించిన దేశాలతో పోల్చితే తమ దేశంలో కరోనా కేసుల్లో పెరుగుదల శాతం తక్కువగానే ఉన్నదన్నారు. జనవరి 31న స్వీడన్‌లో మొదటికేసు నమోదైంది. ప్రజలు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తుండటంతో కేసుల సంఖ్య నెమ్మదించింది. సగటు పెరుగుదల 8-10 శాతం మధ్యే ఉండటం గమనార్హం. ప్రభుత్వ నిర్ణయాన్ని అత్యధిక శాతం ప్రజలు సమర్థిస్తుండగా ఆర్థిక వ్యవస్థ దెబ్బతినొద్దనే లక్ష్యంతో ప్రజల ప్రాణాలను పణంగా పెడుతున్నదని నిపుణులు ఆరోపిస్తున్నారు.

విపత్తు వేళ.. రికార్డుల హేళ

కరోనా మహమ్మారి ప్రపంచ దేశాలను వణికించడమే కాదు.. ఆయా దేశాల శక్తిసామర్థ్యాలను సైతం ప్రపంచానికి చాటుతున్నది. విపత్తు వేళ ఆయా దేశాలు వాయువేగంతో అధునాతన దవాఖానలను నిర్మిస్తున్నాయి. చైనా కేవలం పదిరోజుల్లోనే వెయ్యి పడకల దవాఖానను నిర్మించి ఔరా అనిపించగా.. బ్రిటన్ సైతం తొమ్మిది రోజుల్లోనే దవాఖానను నిర్మించి అబ్బురపరిచింది. లండన్‌లోని డాక్లాండ్స్‌లో ఉన్న ఎక్సెస్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో దీన్ని నిర్మించారు. ఇందులో సుమారు 4 వేల మందికి చికిత్స అందించవచ్చని అక్కడి అధికారులు చెప్తున్నారు. మరోవైపు, రష్యా కూడా కరోనా బాధితుల కోసం భారీ దవాఖానను యుద్ధప్రాతిపదికన నిర్మిస్తున్నది. దాదాపు రూ.872 కోట్ల వ్యయంతో 106 ఎకరాల విస్తీర్ణంలో దీన్ని నిర్మిస్తున్నారు.

లండన్‌లో తొమ్మిది రోజుల్లోనే సిద్ధంచేసిన ఎన్‌హెచ్ఎస్ నైటింగేల్ హాస్పిటల్

ఇతరుల కోసం ఏదో ఒకటి వదులుకోండి..

జైపూర్: 'చాక్లెట్ లేదా ఐస్‌క్రీమ్ తిన లేకుండా ఉండలేక పోతున్నారా? ఈ కష్టకాలంలో మీ అలవాట్లను కాస్త తగ్గించుకోండి. ఉన్నవాటితోనే సరిపెట్టుకోండి. ఇతరుల కోసం ఏదో ఒకటి వదులుకోండి' అని రాజస్థాన్‌లోని చురు జిల్లా కలెక్టర్ సందేశ్‌నాయక్ పిలుపునిచ్చారు. తన వంతుగా మధ్యాహ్న భోజనాన్ని మానేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత పరిస్థితులను ప్రజలు అర్థం చేసుకోవాలని, ఉన్నవాటితోనే సర్దుకోవాలన్నారు. కొంత త్యాగం చేయాలని, ఇతరులను ఇలా ప్రోత్సహించాలని సూచించారు. స్పందించిన కొందరు అధికారులతోపాటు జిల్లావాసులు అల్పాహారం, ఓ పూట భోజనం, ఇష్టమైన కూర, తినుబండారాలు వంటివి మానేస్తున్నట్లు చెప్పారు. అంటార్కిటికా యాత్ర చేసిన రాజీవ్ బిర్డా తనకు వచ్చిన బహుమతులను వేలం వేసి ఆ నిధులను ప్రభుత్వానికి ఇస్తానన్నారు.

రాష్ట్రాల్లో ఇదీ పరిస్థితి

మీ పద్ధతేమీ బాగాలేదు

బెంగాల్‌లో లాక్‌డౌన్ సరిగా అమలు కావడం లేదు: కేంద్రం

న్యూఢిల్లీ: లాక్‌డౌన్ నిబంధనలను అమలు చేయడంలో పశ్చిమబెంగాల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కేంద్రం తెలిపింది. లాక్‌డౌన్ సమయంలో మతపరమైన కార్యక్రమాలకు అనుమతించవద్దని సూచించినా పట్టించుకోకుండా అనుమతులు మంజూరు చేస్తున్నారని ఆక్షేపించింది. అలాగే కూరగాయలు, మాంసం మార్కెట్లలో ప్రజలు నిర్ణీత దూరం పాటించేలా చూడటం లేదని పేర్కొంది. అత్యవసరం కాని వస్తువులను విక్రయించే దుకాణాలను తెరువడానికి అనుమతినిస్తున్నారని పేర్కొంది. ఇలాంటి పద్ధతులను అవలంబించడం వల్ల కరోనా కేసులు పెరిగే అవకాశముందని హెచ్చరించింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరింది.

కశ్మీర్: లాక్‌డౌన్ వల్ల ఉపాధి కోల్పోయి పూటగడవని వారిని ఆదుకోవడానికి రోజూ ఒకపూట భోజనం చేయకుండా దాన్ని వారికి అందించాలని కశ్మీర్‌లోని ఓ పంచాయతీ నిర్ణయించింది.

పుదుచ్చేరి: కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో తొలి కరోనా మరణం సంభవించింది. వైరస్ సోకిన 71 ఏండ్ల వృద్ధుడు కన్నూర్‌లో చికిత్స పొందుతూ మరణించారు.

కేరళ: లాక్‌డౌన్ సమయంలో గృహహింస పెరుగుతున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో కేరళ స్పందించింది. సమస్యలను తమ దృష్టికి తీసుకురావడానికి వాట్సాప్ నంబర్‌ను ప్రారంభించింది.

ఢిల్లీ: ఢిల్లీ రాష్ట్ర క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన సిబ్బందిలో 21 మందికి కరోనా పాజిటివ్‌గా తేలింది. దీంతో ఆ ఇన్‌స్టిట్యూట్ సేవలను నిలిపివేశారు.

మహారాష్ట్రలోని సతారా జిల్లా కరాడాలో కరోనా రోగి మృతదేహానికి అత్యంత జాగ్రత్తగా అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

పలు రాష్ట్రాల్లో లాక్‌డౌన్ పొడిగింపు

ముంబై: కరోనా కట్టడికి లాక్‌డౌనే ఉత్తమమార్గమని కేంద్రంతోపాటు రాష్ట్రాలు కూడా భావిస్తున్నాయి. మే 1వ తేదీ వరకూ లాక్‌డౌన్‌ను పొడిగిస్తూ ఇప్పటికే ఒడిశా, పంజాబ్ రాష్ట్రప్రభుత్వాలు నిర్ణయించగా.. మరో మూడు రాష్ట్రాలు అదే బాటపట్టాయి. ఏప్రిల్ 30 వరకూ లాక్‌డౌన్‌ను పొడిగిస్తున్నట్లుగా తెలంగాణతో పాటు పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర ప్రకటించాయి. ఢిల్లీ, రాజస్థాన్‌కూడా లాక్‌డౌన్‌ను పొడిగించనున్నట్లు సమాచారం.

ఆక్స్‌ఫర్డ్‌లో కొవిడ్-19, సెల్ఫ్ క్వారంటైన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా కారణంగా కొవిడ్-19, సెల్ఫ్-క్వారంటైన్, షెల్టర్ ఇన్ ప్లేస్, సోషల్ ఐసోలేషన్ వంటి కొత్త పదాలు ఆక్స్‌ఫర్డ్ నిఘంటువులోకి చేరాయి. కరోనా వైరస్‌ను 1968లో గుర్తించగా, 2008లో ఆక్స్‌ఫర్డ్‌లోకి చేర్చారు. పలు దేశాలు వేరు కావడం అనే అర్థంలో సెల్ఫ్ ఐసోలేషన్ పదాన్ని వాడగా, ఇప్పుడు వైరస్ సోకకుండా స్వీయ నిర్బంధాన్ని విధించుకోవడంగా పేర్కొంటున్నారు. ఉద్దేశపూర్వకంగా ఒకరిని సామాజికంగా దూరంగా ఉంచడానికి గతంలో సోషల్ డిస్టెన్సింగ్ అనే ఈ పదాన్ని వాడగా, ఇప్పుడు వైరస్ ఒకరి నుంచి మరొకరికి సోకకుండా ఉండేందుకు దీన్ని ఉపయోగిస్తున్నాము.

ఎన్‌సీసీ సేవలు

కరోనాపై పోరులో ఎన్‌సీసీ క్యాడెట్లు కదంతొక్కారు. పలు రాష్ట్రాల్లో 2 వేలమంది సహాయం అందిస్తున్నట్లు కేంద్ర రక్షణ శాఖ పేర్కొంది.

కరోనా క్లాక్
11-4-2020

ప్రపంచవ్యాప్తంగా ప్రభావిత కేసులు	17.61 లక్షలు
కోలుకున్నవారు	3,95,665
మరణాలు	1,07,665

దేశం	కేసులు	మరణాలు
అమెరికా	5,21,816	20,069
స్పెయిన్	1,61,852	16,353
ఇటలీ	1,52,271	19,648
ఫ్రాన్స్	1,29,654	13,832
జర్మనీ	1,23,878	2,736
చైనా	81,953	3,339
యూకే	78,991	9,875
ఇరాన్	70,029	4,357
టర్కీ	52,167	1,101
బెల్జియం	28,018	3,346

దేశవ్యాప్తంగా ప్రభావిత కేసులు	7,529
కోలుకున్నవారు	652
మరణాలు	242

దేశంలో కరోనా కేసులు

మహారాష్ట్ర 1,761	ఢిల్లీ 1,069	తమిళనాడు 969
రాజస్థాన్ 700	మధ్యప్రదేశ్ 532	తెలంగాణ 503
ఉత్తరప్రదేశ్ 452	ఏపీ 402	గుజరాత్ 468
కేరళ 373	కశ్మీర్ 224	కర్ణాటక 215
హర్యానా 177	పంజాబ్ 151	ప. బెంగాల్ 126

మన యాది 1975
మొదటి ప్రపంచ తెలుగు మహాసభలు హైదరాబాద్‌లో ప్రారంభం.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలు, సాహితీ రచనలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నెం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@nt.news.com

మన కోసం ఓ జీవ ప్రపంచం

భారతీయ సమాజాన్ని కరోనా వణికిస్తున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రత్యేకించి ఆరోగ్య, పోలీసు, పౌర సరఫరాల శాఖలు, ఇతర విభాగాలు ప్రజల ప్రాణాలు కాపాడటానికి అహోరాత్రులు కష్టపడుతున్నాయి. వాతావరణ మార్పు, జీవవైవిధ్యం దెబ్బతినడం వల్ల వైపరీత్యాలు సంభవించి భవిష్యత్తులో మరిన్ని కరోనా తరహా పరిస్థితులు ఏర్పడవచ్చు. జంతువులు, మానవులు, బ్యాక్టీరియా, వైరస్‌ల మధ్య ఉండే సంక్లిష్ట సంబంధం, ప్రకృతితో వీటి సంబంధాలు మార్పునకు గురవుతున్నాయి. అందువల్ల ఇటువంటి ప్రకృతి వైపరీత్యాలు తప్పకపోవచ్చు. భవిష్యత్తులో కూడా ఇటువంటి వైపరీత్యాలు సంభవించే అవకాశం ఉన్నది. కనుక పౌరులు, ప్రత్యేకించి వృద్ధులు ఒత్తిడి లేని స్వతంత్ర జీవనం సాగించే విధానమొక్కటి సూచించదలుచుకున్నాను.

సి.అచలేందర్ రెడ్డి, ఐఎఫ్ఎస్

ప్రజలు జీవితం గడిచేకొద్దీ భూమి, ఇల్లు, వ్యాపారంలో పెట్టుబడులు, బాండ్స్, బీమా, బ్యాంకులో డిపాజిట్లు, బంగారం మొదలైన రూపాల్లో సంపదను కూడబెట్టుకుంటారు. ఈ క్రమంలో జీవవైవిధ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడటానికి ప్రయత్నించరు. ప్రకృతితో సామరస్య జీవనం సాగించడానికి పథకం రూపొందించుకోరు. సాధారణ పరిస్థితుల్లో జీవితం సాఫీగానే సాగుతుంది. కానీ ఇప్పుడున్నటువంటి క్లిష్ట పరిస్థితులు ఏర్పడినప్పుడు బయటపడే మార్గం ఉండదు. ప్రజల మానసిక, శారీరక ఆరోగ్యం పైన, రోగనిరోధకత స్థాయిపై ఈ విపత్తుల ప్రభావం ఉంటుంది. అందువల్ల భూమి ఉన్నవారు లేదా ఐదెకరాల మేర భూమిని కొనుగోలు చేసే స్థోమత ఉన్నవారు భిన్నజాతులతో పచ్చదనాన్ని వృద్ధి చేయవచ్చు. ఈ నమూనాలో లాభం ప్రధానం కాదు. లాభానికి అనుబంధ ప్రాధాన్యం మాత్రమే ఉంటుంది. జీవవైవిధ్యాన్ని కాపాడటం, గ్రామీణ ప్రజలకు (భూమిలేని అవ్యవస్థీకృత కూలీలు) ఉపాధి కల్పించడం, నగర ప్రాంతాలకు వలసను నివారించడం, సుస్థిర, శాంతియుత, స్వతంత్ర జీవనం గడపడం ఈ నమూనా ప్రధాన లక్ష్యాలు.

ఇక ఇందుకు ఆర్థికపరమైన సాధ్యాసాధ్యాలను ఆలోచిద్దాం. ఒక వ్యక్తి పిల్లలతో జీవితంలో స్థిరపడిన తర్వాత భూమిని సేకరించి, అందులో సంప్రదాయ, స్థానిక జాతుల వృక్షాలను పెంచడం మొదలుపెట్టాడు. ఈ విధంగా వృద్ధిచేసిన భూమి మూలంగా శరీరానికి కొంత వ్యాయామం లభిస్తుంది. పచ్చదనం నరాలకు నిమిరినట్టు చేయడం వల్ల వృద్ధాప్య సమస్యలను తగ్గిస్తుంది. ఆక్సిజన్ పుష్కలంగా ఉన్న ఆ ప్రశాంత వాతావరణంలో యోగా, ధ్యానం కనుక చేస్తే.. ఇక ఆనందకర జీవితానికి హద్దుండదు.

ఈ భూమిలో భిన్నరకాల వృక్షజాతులుండాలి. వ్యవసాయం, పచ్చదనంతో పాటు ఉద్యాన, ఔషధ, అటవీ వృక్షాలుండాలి. దీని వల్ల పక్షులు, తేనెటీగలు, కీటకాలు, సూక్ష్మజీవులతో పాటు జంతువులు కూడా ఉంటే పూర్తి స్థాయి పర్యావరణ వ్యవస్థ ఏర్పడుతుంది. పండ్లు, పూలు, గడ్డి ఆహారం మొదలైనవన్నీ ఇందులో లభిస్తాయి. ఈ తరహా ఫామ్ ఏకరూప పండ్ల తోటలకు భిన్నమైనదై ఉండాలి. ఈ కాలంలో పెంచుతున్న పండ్ల తోటలు వాణిజ్యపరమైనవై ఉంటాయి తప్ప దీర్ఘకాలికంగా సుస్థిర జీవనాన్ని అందించేవి కావు. వృద్ధాప్యంలో ఇటువంటి సంక్షోభాలు ఎదురైనప్పుడు రక్త సంబంధీకుల మీద, పిల్లల మీద ఆధారపడకుండా ఉండటానికే ఈ ఏర్పాటు. చెట్లు, మొక్కలు, పొదలు, కూరగాయలు, ఓషధులు మొదలైనవన్నీ సేంద్రియ పద్ధతిలో పెంచినప్పుడు చుట్టూరా పర్యావరణ వ్యవస్థ మెరుగుపడుతుంది.

> జీవితకాలం కూడబెట్టిన సొమ్ము ఒక్కటే లాక్‌డౌన్ వంటి సమయాల్లో కాపాడలేదు. ఆహారం, మందులు అందించలేదు. శిశువు లు, కౌమార వయస్కులు, పెద్దలు, వృద్ధులు ఇలా వివిధ దశలవారంతా, రసాయన ఎరువులు, కాలుష్యం సృష్టించే సమస్యలు లేకుండా మనుగడ సాగించాలంటే వివిధరకాల చెట్లు, మొక్కలు పెంచుకోవాలి.

జీవితకాలం కూడబెట్టిన సొమ్ము ఒక్కటే లాక్‌డౌన్ వంటి సమయాల్లో కాపాడలేదు. ఆహారం, మందులు అందించలేదు. శిశువులు, కౌమార వయస్కులు, పెద్దలు, వృద్ధులు ఇలా వివిధ దశలవారంతా, రసాయన ఎరువులు, కాలుష్యం సృష్టించే సమస్యలు లేకుండా మనుగడ సాగించాలంటే వివిధరకాల చెట్లు, మొక్కలు పెంచుకోవాలి.

సంప్రదాయ ఫలాలు: మామిడి, పనస, కొబ్బరి, జామ, సపోటా, దానిమ్మ, ఉసిరి, కాజు, మల్బరీ, సీతాఫలం మొదలైనవి.

ఇతర ఫలాలు: అరటి, ద్రాక్ష, అనాస, పొప్పడి మొదలైనవి.

పరిమళాల పూలు: మల్లె, పారిజాత, సంపెంగ, మొగలిపొట్ట మొదలైనవి.

సంప్రదాయేతరం: చందనం, టేకు, జీలుగు, తాటి, ఈతచెట్లు మొదలైనవి.

పవిత్రమైనవి: మారేడు, జమ్మి, పొన్నచెట్టు, వేప, సీతా అశోక, తమలపాకు, రుద్రాక్ష, ధర్భ, నాగలింగ పుష్పం మొదలైనవి.

ఇతరం: చింత, తుమ్మ, రేల, మోదుగు మొదలైనవి.

కూరగాయలు: పాలకూర, పుదీనా, మెంతి, గంగవాయిలి, గోంగూర, కొత్తిమీర మొదలైనవాటితో పాటు అన్నిరకాల ఆకుకూరలు, కూరగాయలు.

ఓషధులు: అన్నిరకాల సుగంధ ద్రవ్యాలు. ఉల్లి, వెల్లుల్లి, అల్లం, పసుపు, తిప్పతీగ, బ్రహ్మి, నిమ్మగడ్డి, తులసి, కరివేపాకు, అపరాజిత, కలబంద, ఇన్సులిన్ ప్లాంట్, ఆముదం, చెన్నంగి, పాషాణ భేది, భూచక్ర గడ్డ, గురివింద, మొదలైనవి.

అటవీ ఆహారం: కలివి పండు, ఆదొండ, ఊడుగు, నక్రే చెట్టు, తునికి, బంక పండ్లు, వెలక్కాయ, పునర్నవ మొదలైనవి.

వెదురు: నీటి లభ్యతకు అనుగుణమైన స్థానిక వెదురు జాతులను ఎంచుకోవాలి.

వ్యవసాయ పంటలు: అన్నిరకాల చిరుధాన్యాలు, పచ్చజొన్నలు, వరి, గోధుమ, పప్పులు, చిక్కుళ్లు (స్థానిక జాతులు) ప్రత్యేకించి పాదులు (తీగజాతులు).

ఒక ప్లాట్‌ను దేశీ ఆవుల గడ్డి కోసం ఉపయోగించాలి.

జంతువులు: దేశీ ఆవులు, స్థానిక జాతి కోళ్ళు (ఉదా-కడక్‌నాథ్), సీమకోళ్లు, టర్కీ కోళ్ళు, బాతులు.

తేనెను తయారుచేయడానికి తేనెటీగల పెట్టులు నెలకొల్పాలి.

ఇతర చర్యలు: చుట్టూరా ప్రహరీ గోడకు లోపలిభాగంలో కాలిబాట కోసం స్థలం వదలాలి. ఇది నడకకు లేదా సైక్లింగ్‌కు ఉపయోగపడుతుంది.

ధాన్యం నిలువ: ధాన్యం నిలువకు తగిన గాదెను ఏర్పాటుచేసుకోవాలె.

నీటి నిలువ, బోరుబావి: నీరు చేరే పల్లం ప్రాంతంలో రెండు వాననీటి కుంటలు ఏర్పాటు చేసుకోవాలి. సమీపంలో నీటి కాలువ కానీ, బోరు బావి కానీ నెలకొల్పాలె.

ఇంధన సరఫరా: సంప్రదాయ విద్యుత్ కనెక్షన్‌తో పాటు, స్వతంత్ర సౌర విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. కూరగాయలు ఎక్కువకాలం నిలువ ఉంచేందుకు మినీ సోలార్ డ్రైయర్‌ను ఉపయోగించుకోవాలి.

కూలీల కుటుంబం ఉండటానికి ఒక గది, కిచెన్, టాయిలెట్ గల ఒక చిన్న ఇంటిని నిర్మించాలి. భద్రత కోసం స్వదేశీ జాతి కుక్క (ఉదా: రామ్‌పూర్ గ్రేహౌండ్, రాజపాలయం, పంది కోన)

ఇటువంటి జీవవైవిధ్యం గల వ్యవసాయ క్షేత్రం వల్ల అనూహ్యమైన పరిస్థితుల్లో కూడా బయటివారి సాయం లేకుండా జీవించవచ్చు. ఈ మధ్య కొందరు సేంద్రియ వ్యవసాయదారులు బహుళ పొరల, నిలువు తరహా సాగు చేస్తున్నారు. మరికొందరు మూడేండ్లలో మియవాకి తరహా తక్షణ అడవీ పెంపకం చేపడుతున్నారు. మనకున్న భూమి స్వరూపం, స్వభావాన్ని బట్టి చెట్లు, జంతువుల సంఖ్యను పెంచవచ్చు, తగ్గించవచ్చు. ఇటువంటి ఫామ్‌లకు రాష్ట్ర ప్రభుత్వం పోత్రాహకాలు ఇస్తే, నగర ప్రాంతాల నివాస సాంద్రత తగ్గుతుంది. భవిష్యత్ తరాలకు జీవవైవిధ్య వ్యవసాయక్షేత్రాన్ని మించిన వారసత్వాన్ని మనం అందించలేం.

(వ్యాసకర్త: పీసీసీఎఫ్, (ఓజీఎంయుటి కేడర్) జాతీయ జీవ వైవిధ్య అథారిటీ మాజీ కార్యదర్శి సీఐపీఎస్, ఏఎస్‌సీఐ మాజీ డైరెక్టర్)

డాక్టర్ డైరీ

అర్ధరాత్రి 12 గంటలు..
ఇంతకుముందు పొద్దున్నే 7 గంటలకు
అలారం మోగినా చిరాకొచ్చేది.
ఇప్పుడు మాత్రం.. 5.28 గంటలకే
మెలుకువ వొస్తున్నది..!
ఆ తర్వాత రెండు నిమిషాలకు వచ్చే
అలారం.. నా బాధ్యతను గుర్తుచేస్తున్నది.

కంటినిండా నిద్రపోయి..
నా పిల్లలను, భార్యను
అమ్మానాన్నలను కండ్లారా చూసి
కడుపునిండా తిని
కరోనా వైరస్ ఐసొలేటెడ్ వార్డ్‌లో
డ్యూటీ పడినప్పటి నుంచీ
నా ప్రపంచం మారిపోయింది!

ఇప్పుడు నేనొక యుద్ధయోధున్ని
తుపాకీ పట్టుకోకున్నా..
యుద్ధం చేసే అవకాశం వొచ్చింది
నిజానికి.. సైనికులను చూసినప్పుడు
నాలో ఎక్కడో ఒక మూలన నిద్రలేచే
జెలసీ ఇప్పుడు కొంత తగ్గింది..
నేనిప్పుడు కనిపించని శత్రువుతో
యుద్ధం చేస్తున్నా..
ఇదెప్పుడు ముగుస్తుందో తెలియదు
శత్రువు బలంగా ఉన్నాడు
ఒక్కటి మాత్రం నిజం..
అంతిమ విజయం నాదే
కాస్త ఆలస్యం కావొచ్చంతే ...

నాకు బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ లేదు
కానీ ప్రొటెక్షన్ సూట్లు తొడుక్కున్నా
ఒక్కసారి సూట్ వేసుకుంటే..
తిండి, నీళ్లు, నిద్ర పక్కనపెట్టాల్సిందే..

నేనూ మనుషినే..
నాకూ వైరస్ సోకే అవకాశం ఉంటది
కానీ.. కోట్ల మందిని కాపాడాలన్న
బాధ్యత ముందుకు నడిపిస్తున్నది
ఒక పేషెంట్ కోలుకొని
ఇంటికి వెళ్తుంటే..
విలువైన ప్రాణాన్ని నిలుపానన్న తృప్తి
దానిముందు మా శ్రమంతా
దూదిపింజలా ఎగిరిపోతుంది..

అప్పుడే.. నా ఇల్లు గుర్తొస్తున్నది
ఎట్లున్నరో అన్న రంది
వీడియోకాల్‌లో మాట్లాడుతున్న
కానీ.. పక్కన కుర్చోబెట్టుకొని
ముచ్చట పెట్టినట్టు ఉండదికదా
వాళ్లు దవాఖానకు వచ్చినా
దూరం నుంచే చూస్తున్న
మొన్న నా నాలుగేండ్ల బిడ్డ..
'నన్ను ఎత్తుకోవా నాన్నా..' అంటూ..
చేతులు చాపింది.. ..!

ఇంతకుముందే టీవీలో చూసిన
లాక్‌డౌన్ ఉన్నా..
జనాలు రోడ్ల మీద తిరుగుతున్నరని..!

కుటుంబాన్ని నేనూ,
నా తోటి ఇంటినొదిలి
కొవ్వత్తై కరుగుతుంటే..
మీ కోసం మా ప్రాణాలను
పణంగా పెడుతుంటే..
మీకెందుకంత నిర్లక్ష్యం?
నువ్వంటే.. నీ ఒక్కని జీవితమే కాదు..
నీతో.. నీ కుటుంబం, పిల్లలూ ఉన్నారు
నీ నిర్లక్ష్యం..
మరొకరి కన్నీరుకు కారణం కారాదు..

నేను ఇంటికాడ ఉన్నప్పుడు
పిల్లలకు రోజూ ముద్దిచ్చి
గుడ్‌నైట్ చెప్పేది
ఇప్పుడు ఫొటోలకు చెప్పుకుంటున్న
గుడ్‌నైట్ అమ్ములూ..
గుడ్‌నైట్ కన్నయ్యా.. ...

కాసాని మహేందర్‌రెడ్డి
94923 06808

ఈ సంక్షోభం.. సావకాశం

కరోనా రోజురోజుకు విజృంభిస్తుండటం మనం చూస్తున్నాం. ఇప్పటిదాకా ప్రపంచంలో 17 లక్షల కేసులు దాటాయి. లక్ష మందికి పైగా చనిపోయారు. చైనా తర్వాత ప్రధానంగా ఇరాన్, ఇటలీ, స్పెయిన్, అమెరికా, బ్రిటన్‌లలో కరోనా కరాళ నృత్యం చేస్తున్నది. చైనాలో వూహాన్‌లో మొదలైన కరోనా వూహాన్‌లోనే అంతమైంది. చైనాలోని ఇతర రాష్ట్రాలకు అది దాదాపు పాక లేదు. వూహాన్‌లో ఉన్న హుబెయ్ రాష్ట్రం తప్ప ఇతర రాష్ట్రాలలో వ్యాపారం యథావిధిగా కొనసాగింది.

మన దేశంలో కరోనా కట్టడికి మార్చి 23 నుంచి లాక్‌డౌన్ పెట్టిన రెండు వారాలు మంచి ఫలితం కనిపించింది. మొదటి సైకిల్ కర్వ్‌ను మనం కంట్రోల్ చేయగలిగాం. కానీ ఢిల్లీలో జరిగిన ఒక సమావేశం వల్ల అసలు కరోనా లేని తమిళనాడు, ఏపీ లాంటి రాష్ట్రాల్లో కూడా ఒక్కసారిగా విజృంభించింది. దాంతో రెండో సైకిల్ ప్రారంభమైంది. ఇంగ్లిష్‌లో ఒక సామెత ఉంది. 'చతురులు ఇతరుల తప్పుల నుంచి నేర్చుకుంటారు. మేధావులు తమ తప్పుల నుంచి నేర్చుకుంటారు' అని. మనకు చైనా ఒక మంచి మోడల్‌గా ఉన్నది. దాన్ని మన భారత పరిస్థితులకు అనుకూలంగా అన్వయించుకోవాలి.

చైనాలో కరోనా వ్యాప్తి జనవరిలో మొదలై మార్చి వరకు అంటే మూడు నెలల్లో నియంత్రణకు వచ్చింది. ఎందుకంటే అక్కడ మొత్తం సిటీని, రాష్ట్రాన్ని లాక్‌డౌన్ చేశారు. అన్నింటినీ క్వారంటైన్ చేశారు. మందులు, ఆహార కొరత లేకుండా జాగ్రత్తపడ్డారు. వైద్య సదుపాయాలకు కొదువ లేకుండా చర్యలు చేపట్టారు. మాస్ శానిటైజేషన్, పరిశుభ్రత, కఠినమైన నియమాలు అమలుచేశారు. దీంతో ఇప్పుడు కరోనా నిర్మూలన దశకు చేరుకుంటున్నది.

మనమేం చేయాలి? మన దేశంలో నిర్ణయాలు తీసుకునే ముందు మన బలం, బలహీనతలు తెలుసుకోవాలి. చైనాతో పోలిస్తే మన దేశం ఆర్థికంగా చాలా వెనుకబడి ఉన్నది. భారత్‌లో విభిన్న వర్గాలు, దృక్పథాలున్న ప్రజలున్నారు. అందుకోసం మొదటగా ఒక రాజకీయ ఏకాభిప్రాయం, ఐక్యత అవసరం. 30 కోట్ల జనాభా ఉన్న అమెరికా ఆర్థికవ్యవస్థ 21 ట్రిలియన్ డాలర్లు. 143 కోట్ల జనాభా కలిగిన చైనా ఆర్థిక వ్యవస్థ 11 ట్రిలియన్ డాలర్ల మేర ఉంది. భారత్‌ది 2.9 ట్రిలియన్ డాలర్ల (138 కోట్ల జనాభా) ఆర్థికవ్యవస్థ. 'పిండి కొద్దీ రొట్టె' అన్నట్లు మనకున్న పరిమితుల్లో పనిచేయాలి.

డాక్టర్ బూర నర్సయ్య గౌడ్

కరోనా 0.05 -0.2 మైక్రాన్ల సైజు ఉంటుంది. గాలిలో కనీసం 1.5 మీటర్లు ప్రయాణం చేస్తుంది. వస్తువుల మీద 3 గంటల నుంచి 3 రోజులు జీవిస్తుంది. సబ్బు, స్పిరిట్ ద్రావణాలు, హైపోక్లోరైట్ ద్రావణాల వల్ల చనిపోతుంది. దేశంలో కరోనా పూర్తిగా నిర్మూలించడానికి కనీసం 6 నెలలు, ఒక్కోటి రెండు నెలల సైకిల్ పడుతుంది.

స్పెయిన్, ఇటలీ, బ్రిటన్, ఫ్రాన్స్, అమెరికాలలో లక్షల కేసులు రావటానికి ప్రధాన కారణం నాయకత్వ వైఫల్యం. అవగాహనారాహిత్యం. ప్రజలను చైతన్యపరచటంలో లోపం, అహం, రాజకీయ లబ్ధిగా మలచుకోవటానికి ప్రయత్నం చేయటం. అందుకే సమష్టి, శాస్త్రీయ సలహాలతో తక్షణ, మాధ్యమిక, దీర్ఘకాల నిర్ణయాలు అవసరం.

కరోనా సైకిల్ కట్టడికి నివారణ, నియంత్రణ, నిర్మూలన అనేవి మూడు దశలు. ప్రస్తుతం మనం రెండో దశలో ఉన్నాం. విదేశాల నుంచి వచ్చే కేసుల వల్ల వ్యాధి ప్రబలకుండా నివారణ చర్యలలో సఫలమైనా, జమాత్ లాంటి సమావేశాన్ని నివారణ చేయలేకపోవడం వల్ల ఫలితం చూస్తున్నాం. అందువల్ల లాక్‌డౌన్ కొనసాగించడం, హాట్‌స్పాట్స్ అయిన క్లస్టర్స్ గుర్తించడం, అక్కడ కర్ఫ్యూ అమలు చేయడం జరగాలి. పట్టణ ప్రాంతాలలోని హాట్‌స్పాట్స్‌లో ఉన్న ప్రజలను అవసరమైతే ప్రత్యేక ప్రదేశాల్లో కరోనా కేర్ సెంటర్లలో పెట్టాలి. గ్రామీణ ప్రాంతాల్లో నమోదైన ఊళ్లని ఒక కరోనా కేర్ సెంటర్‌గా మార్చి నిర్బంధం పాటించడం మంచిది. రాజస్థాన్ భిల్వారా మోడల్‌ను మనం అమలుచేయవచ్చు. ప్రతి 50 ఇండ్లకు కరోనా హోమ్‌గార్డ్ అనే స్వచ్ఛంద కార్యక్రమం నిర్వహించవచ్చు.

అత్యవసర సేవలు అవసరమైన, ఆదాయ మార్గాలకు అవకాశం ఉన్న పరిశ్రమల్లో అంచెలంచెలుగా ఆంక్షల సడలింపు చేయాలి. ఒక సుదీర్ఘ కరోనా పద్మవ్యూహం ప్లాన్ అమలుచేయాలి. మొత్తం దేశంలో నిర్మూలన దశ వచ్చేవరకు కేవలం గూడ్స్ తప్ప మిగతా అంతర్రాష్ట్ర రవాణా బందును పొడిగించాలి. రాజకీయ నాయకులు, విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది, ఇతర సంస్థలు కరోనా నియమాలను పాటించాలి.

దేశంలో కరోనా సోకినవారిలో కేవలం 2.99 శాతం చనిపోయారు. అందులో ప్రధానంగా ఇతర జబ్బులున్న వృద్ధులు చనిపోతున్నారు. 98 శాతం మంది వైద్యుల సలహాలు పాటిస్తే ప్రాణహాని ఉండదు. ఎబోలా, సార్స్, హెచ్ ఐవీ, హెపటైటిస్, ఆంథ్రాక్స్, డెంగ్యూ కంటే కరోనా తక్కువ ప్రమాదకరమైనది. ఆరోగ్య కేంద్రాల వికేంద్రీకరణ జరుగాలి. ప్రైమరీ, సెకండరీ, టెర్షియరీ అనే మూడంచెల విధానం కొనసాగించాలి. ప్రతి జిల్లాలో ఒక ప్రాథమిక కరోనా కేర్ సెంటర్, మాధ్యమిక సెకండరీ సెంటర్లు ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లో అందించే అత్యవసర సేవలకు ప్రొటోకాల్ అమలుచేయాలె. లేకుంటే ఇవి మున్ముందు కరోనా హాట్‌స్పాట్స్‌గా మారే అవకాశం ఉన్నది. డాక్టర్లు, వైద్య సిబ్బంది ప్రొటెక్టివ్ ప్రొటోకాల్స్ తప్పక పాటించాలి. లేదంటే ఒక డాక్టర్ వందల మందికి రిస్క్ కాగలడు. అత్యవసర చికిత్స అందించే దవాఖానలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉన్నది.

> జీవితకాలం కూడబెట్టిన సొమ్ము ఒక్కటే లాక్‌డౌన్ వంటి సమయాల్లో కాపాడలేదు. ఆహారం, మందులు అందించలేదు. శిశువు లు, కౌమార వయస్కులు, పెద్దలు, వృద్ధులు ఇలా వివిధ దశలవారంతా, రసాయన ఎరువులు, కాలుష్యం సృష్టించే సమస్యలు లేకుండా మనుగడ సాగించాలంటే వివిధరకాల చెట్లు, మొక్కలు పెంచుకోవాలి.

ఆహార సైకిల్ ప్రగతి: సుదీర్ఘ పోరాటానికి ఇది అత్యవసరం. గ్రామీణ వ్యవసాయ పనులు, కూరగాయలు, పాలు, పౌల్ట్రీ, మాంసం, పండ్లు తదితరాల ఉత్పత్తి, ఉపాధిహామీ పనులు, కులవృత్తులకు ఆటంకం కలుగకూడదు గనుక సేఫ్‌జోన్‌లో ఉన్న గ్రామాల్లో, పట్టణంలో సామాజిక దూరం పాటిస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుంటుపడదు. ఫుడ్ సైకిల్ సంబంధిత తుది కస్టమర్ వరకు ఒక ప్రణాళిక నిర్వహించాలి. ఆహార నిల్వల జాగ్రత్త వహిస్తూ, ఎగుమతులను ప్రోత్సహిస్తే దేశానికి ఆర్థిక వెసులుబాటు కలుగుతుంది.

నిత్యావసర వస్తువుల అందుబాటు: రాష్ట్రంలో నీళ్లు, కరెంటుకు కష్టాల్లేవు. అత్యవసరమైనవారికి బ్యాంకు సేవలు అందుబాటులో ఉండాలి. బ్యాంకులు రుణ సదుపాయాన్ని సులభతరం చేసి, చిన్న, మధ్య తరగతి పరిశ్రమలకు అందుబాటులోకి తేవాలి.

ప్రతి అవరోధం ఒక అవకాశాన్ని ఇస్తుంది. భారత దేశం ఈ అవకాశాన్ని అందుకోవాలి. మందులు, వైద్య పరికరాలు, ఎగుమతికి అనువైన పరిశ్రమలను అభివృద్ధి చేయాలి. ఆన్‌లైన్ వినోదం, ఆన్‌లైన్ మీడియా, ఈ రిటైల్.. ఇలా నూతన జీవన విధానానికి కావలసిన ప్రణాళికలు ఇప్పుడే తయారుచేసుకోవాలి.

కరోనా నిర్మూలన జరిగేవరకు సినిమాహాళ్లు, సమావేశాలు మొదలైన వాటికి వెసులుబాటు కల్పించకపోవడం అవసరం.

ఒకవిధంగా చెప్పాలంటే కరోనా మీద పోరు ఒక డైనమిక్ పాలసీ. అవసరాలను బట్టి మార్పుచేర్పులు చేసుకుంటూ వెళ్లాలి. ప్రభుత్వం, ప్రజలు సమష్టి పోరు సల్పి గెలవాలి. ప్రకృతిబద్ధంగా జీవించే నూతన జీవనవిధాన ఆవశ్యకతను గుర్తించాలి.

(వ్యాసకర్త: పార్లమెంట్ మాజీ సభ్యులు, భువనగిరి)

మనిషిని నేలకు దించెను..

నాకిప్పుడు అమెరికాకు కాదు, అమ్మ కడుపులోకి వెళ్లాలనిపిస్తున్నది. కరోనా ఈ కాలానికి దారిచూపిస్తున్నది. నా కళ్లను తెరిపించి, నా కుళ్లును హైపో క్లోరైట్ ద్రావణంతో పిచికారీ చేసుకొని, నా అపవిత్ర చేతులను, చేతలను శానిటైజ్ చేసుకొమ్మని కరోనా హెచ్చరిస్తున్నది. అణ్వాయుధ సంపత్తికి, ఆధిపత్యానికి తానే చిహ్నమని, తానే ఛీశాలినని విర్రవీగిన అగ్రరాజ్య శ్వేతసౌధం ఇప్పుడు తెల్లమొహం వేసింది.

నూర శ్రీనివాస్

మధ్యధరా సముద్రంలోకి తోకలా చొచ్చుకొని వచ్చినట్టున్న ఇటలీ కరోనా బిగి కౌగిలికి ఊపిరాడక స్వచ్ఛమైన గాలి కోసం ఎదురుచూస్తున్నది. చరిత్ర మళ్లీ పుట్టింది. రోమ్ తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడెల్ వాయించినట్టు అప్పుడే కాదు, ఇప్పుడు కూడా. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాధి నేతల వంశాలిప్పుడు రాజ సౌధాలు వీడి క్వారెంటైన్ సౌధాల్లోకి వెళ్లిపోయాయి. స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ తన నెత్తిన వాలిన కరోనా కిరీటాన్ని మోయలేకపోతున్నది. ఈఫిల్ టవర్ కాళ్లసందుల్లో కరోనా చేరి ప్యారిస్‌ను పారాహుషార్ అంటున్నది. మేడిన్ చైనా.. మేడిన్ కరోనా. కాదట కాదూ కాదట. అది అమెరికా అదృశ్యశక్తట. కరోనాకు లెఫ్ట్ లేదు రైట్ లేదు. ఈస్ట్ లేదు వెస్ట్ లేదు. అంతా రోస్ట్. కమురు వాసన. శవాలను మాస్కులేసుకొనైనా కడచూపునకు నోచుకోని దైన్యం ధరిత్రిని పట్టిపీడిస్తున్నది. శవాల దిబ్బలకు జాగ లేనితనంతో మనిషిని మనిషి ముట్ట లేని మాస్కాసుర లోకంగా మారిపోయింది తండ్రీ..!

> గుర్రాల అనురాధ తనకు వచ్చిన దానాన్ని దానం చేయడం.. పైగా ఆమె చెప్పిన మాట 'నాకిక్కడ కేసీఆర్ ఇచ్చిండు. నాకున్న దాంట్లో కొద్దిగా దానం చేస్తే దూరాన ఉన్న నా కొడుకుకు ఏ తల్లి అయినా ఆకలి తీరుస్తది..!

కరోనా ఒకానొక సూక్ష్మాతిసూక్ష్మ హీనపు రూపం. రేఖామాత్రపు రూపం కూడా పొదగని శాపం. కోవిడ్-19 మానవ మనుగడపై శకలాలు శకలాలుగా అదృశ్య విస్ఫోటనం చేస్తున్నది. గ్లోబును చాపలా చుట్టేసింది. అలెగ్జాండర్ వలె విశ్వవిజేత కావాలని తలపోస్తున్నది. బలిచక్రవర్తి కన్నా పరాక్రమవంతమై పరివ్యాప్తమై పరిహసిస్తున్నది. ఇప్పుడు లోకమంతా వామనావతారం కోసం కరోనా నిండిన కళ్లతో ఎదురుచూస్తున్నది.

ఉన్నకాడుండొచ్చు. కలో గంజో చేసుకొని బతుకొచ్చు. జెండాలను మార్చుకుంటూ ఎజెండాలను లిఖించుకుంటూ అక్షాంశ రేఖాంశాల సరిహద్దులను చెరిపేసి కరోనా గీతగీసి వాతపెట్టి మరీ చూపుతుంది. సకల ప్రపంచాన్ని నడిబజారులో నిలబెట్టి శవాల గుట్టల అంకెలను హర్రాజుపాడి బకాసురుడి లెక్క ఎత్తుకెళ్లిపోతున్నది. నమస్కరోనా..! కరుణించు కరుణించూయనీ.. ప్రాధేయపడుతున్న శరణ్య గీతం గ్లోబంతా ఆలపిస్తున్నది.

'ఏ దేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీ తల్లీ భూమి భారతినీ..' ఇటలీలో ఉన్న కొడుకుని.. అమెరికాలో ఉన్న బిడ్డను, ఆస్ట్రేలియాలో ఉన్న మనవడిని.. లండన్‌లో ఉన్న అల్లుడిని, స్వీడెన్‌లో ఉన్న కోడల్ని ఎట్లున్నవని అడగగలం? ఒక్కసారి మా పాపపు కండ్లకు వాట్సాప్ వీడియో కాల్స్‌లో నీ రూపం చూపించమని జీరగొంతుతో ప్రాధేయపడుతున్నవారెందరో? గుండెల్లో దాచుకున్న దుఃఖాన్ని ఏ డాలర్ కరెన్సీకి మార్చుకొని లెక్కగట్టగలం? దేశం విడిచి వెళ్లిన మనుషులు అక్కడెక్కడో పారాడుతున్నరు. ఇక్కడ గుండెలు మెలిపెడుతున్నవి. ముద్ద దిగడం లేదు. నాయినా పైలం. సావుదలకు వచ్చిన్నోళ్లం నువు మా సావుకు రాకపోయినా మంచిదే నువు సల్లగా ఉంటే అదే పదివేలు. కోడలు పైలం. మన వంశాంకురం పైలం. కాలుతీసి కాలు కదపలేని తల్లి తన కొడుక్కు ధైర్యం చెబుతున్నది. గుండె చెదరకు అంటూ పైనుంచి వచ్చే పిలుపు కోసం ఎదురుచూస్తున్న తండ్రి కొడుక్కి భరోసా ఇస్తున్నడు.

నువు టాటావో.. బిర్లావో.. రిలయెన్స్‌వో.. ఆదానీవో... మరెవ్వరో నాకు అక్కరలేదు. పోగేసుకున్న సంపదను పదిమందికి దానం చేసిన వారందరూ మరో ఉత్పత్తి కారకానికి మూలధన వాటా జమ చేయడం కోసం చేసే ప్రయత్నం కాకపోయి ఉండవచ్చు. వారి కార్పొరేట్ బాధ్యతకు సాక్ష్యం కూడా కావచ్చు. కానీ, గుర్రాల అనురాధ తనకు వచ్చిన దానాన్ని దానం చేయడం.. పైగా ఆమె చెప్పిన మాట 'నాకిక్కడ కేసీఆర్ ఇచ్చిండు. నాకున్న దాంట్లో కొద్దిగా దానం చేస్తే దూరాన ఉన్న నా కొడుకుకు ఏ తల్లి అయినా ఆకలి తీరుస్తది..! అదీ తాను ఆపదలో ఉన్నా పరుల ఆదపను తీర్చేందుకు వెనుకడుగేయని మానవీయం. కరోనా వేళ ఇప్పుడు అనురాధమ్మల అనురాగమే కావాలి. జారిపోతున్న స్వప్నానికి, పారిపోతున్న శత్రువుకు నడుమ ఒక్క చిన్న నమ్మిక మొలకెత్తుతున్న వేళ ప్రార్థన మాస్కేసుకోకుండా బయటికొచ్చింది. ఇటువంటి సందర్భంలో మనం సంభాషించుకోవలసి ఉన్నది. కరోనా ఎవరికి? కరుణ ఎవరిదని..?

అంతర్గత శత్రువులు

నమస్తే.. నమస్తే.. నమః

ఆచార్య మసన చె

లాక్‌డౌన్ సమస్యలపై టోల్‌ఫ్రీ నంబర్లు	పౌరసరఫరాలశాఖ ఉ.10 నుంచి సా.5 వరకు	హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్	సైబరాబాద్ కమిషనరేట్	రాచకొండ కమిషనరేట్	కొవిడ్-19 కాల్‌సెంటర్
	1967	100 24/7	9490617440	9490617234	040-23434343

ప్రగతిభవన్‌లో పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రులు మల్లారెడ్డి, అజయ్, జగదీశ్‌రెడ్డి, రైతుబంధు సమితి చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

పూలే అడుగుజాడల్లో పాలన

మహాత్మా జ్యోతిబాపూలేకు మంత్రుల నివాళి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మహాత్మా జ్యోతిబాపూలే అడుగుజాడల్లో సీఎం కేసీఆర్ పాలన సాగిస్తున్నారని పలువురు మంత్రులు పేర్కొన్నారు. వెనుకబడిన తరగతుల సంక్షేమానికి, అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని చెప్పారు. లాక్‌డౌన్ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పూలే 194వ జయంతిని ఇండ్లు, కార్యాలయాల్లోనే నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ క్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, బీసీ సంఘాల నాయకులు, ప్రతినిధులు ప్రభుత్వ సూచనను పాటించారు. శనివారం ప్రగతిభవన్‌లో పూలే చిత్రపటానికి మంత్రి కేటీఆర్ పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మంత్రులు జగదీశ్‌రెడ్డి, మల్లారెడ్డి, పువ్వాడ అజయ్, రైతుబంధు సమితి చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద తదితరులున్నారు. మంత్రి గంగుల కమలాకర్ హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్.. తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులతో కలిసి పూలే జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు.

పూలే విధానాలు ఆదర్శం: సీఎం కేసీఆర్

సామాజిక తత్వవేత్త, సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా శనివారం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ఆయన సేవలను స్మరించుకున్నారు. సమసమాజ స్థాపన కోసం అహర్నిశలు కృషిచేసిన పూలే మహనీయుడని కీర్తించారు. కుల, లింగ వివక్షకు వ్యతిరేకంగా పోరాడారని, అందరికీ విద్యనందించాలని ఉద్యమం చేపట్టి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. రాష్ట్రం అనుసరిస్తున్న విధానాలే పూలేకు నిజమైన నివాళి అని సీఎం పేర్కొన్నారు.

ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని మేడిగూడ గ్రామం

ఇగురం నేర్చిన మేడిగూడ..

గంగారాం మహరాజ్ (ఫైల్)

మహరాజ్ చూపిన మార్గంలో గ్రామస్థులు

- మాంసం తినరు.. మందు ముట్టరు
- పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యం
- ఆపదలో ఉన్నవారికి ఆర్థిక సాయం
- సర్కారు బడిలోనే పిల్లల చదువులు

ఆదివాసీగూడేలు అంటేనే అపరిశుభ్రతకు, సీజనల్ వ్యాధులకు, మత్తు పానీయాలకు నిలయాలుగా అందరూ భావిస్తుంటారు. కానీ ఆ ఆలోచనలకు ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా మేటిగా నిలిచిందో గిరిజనగూడెం. అక్కడి వారెవరూ పెద్దగా చదువుకోలేదు.. వ్యవసాయమే వారి జీవనాధారం.. కానీ ఆధ్యాత్మిక చింతనను అలవరుచుకొని, చెడు వ్యసనాలకు, మాంసానికి దూరంగా ఉంటూ.. పచ్చదనం, పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఓ మహరాజ్ చూపిన మార్గాన్ని అనుసరిస్తూ.. గ్రామంలో ఎవరికి ఆపదవచ్చినా మేమున్నామంటూ అంతా ఏకమై సాయమందిస్తూ ఒకరికొకరు తోడుగా నిలుస్తున్నారు. తమ పిల్లలను సర్కారు బడికే పంపుతూ మార్గదర్శకులయ్యారు ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం మేడిగూడవాసులు.

ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని మేడిగూడ అన్ని ఆదివాసీగూడేల మాదిరిగానే అపరిశుభ్రంగా, మత్తు పానీయాలకు నిలయంగా ఉండేది. నిత్యం గొడవలతో గిరిజనులు సతమతమవుతుండేవారు. ఇది 15 ఏండ్ల కిందటి మాట. కానీ ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. మేడిగూడలో 50 కుటుంబాలు ఉండగా, 300 జనాభా ఉన్నది. అందరూ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పదిహేనేండ్ల కిందట బోథ్ మండలం బాబేర గ్రామానికి చెందిన గంగారాం అనే మహరాజ్ మేడిగూడకు వచ్చారు. స్థానికులను ఆధ్యాత్మిక బాటలో నడిచేలా బోధనలు, సంకీర్తనలు, ప్రవచనలు చేశారు. గిరిజనులు తమ సమస్యలను చర్చించి పరిష్కరించుకునేలా రాయి సెంటర్ షెడ్డును ఏర్పాటు చేసిన మహరాజ్.. అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చారు. దీంతో గ్రామస్థులంతా మహరాజ్ ఆధ్యాత్మిక బోధనలు ఒంటపట్టించుకొని ఆయన చూపిన బాటలో నడువాలని నిర్ణయించుకున్నారు. తమ ఆచార వ్యవహారాలను పాటిస్తూ చెడు వ్యసనాలకు దూరంగా ఉంటున్నారు. పదిహేనేండ్లుగా మేడిగూడ గిరిజనులు మాంసం తినడం, సారా తాగడాన్ని నిషేధించారు. ఎవరైనా మద్యం తాగినా, మాంసం తిన్నా వారి ని ఊరి నుంచి బహిష్కరించాలని నిర్ణయించారు. గ్రామంలో పాటించాల్సిన నియమాలను తెలియజేసేలా 'రాయి సెంటర్' భవనం ఎదుట బోర్డును కూడా ఏర్పాటుచేశారు.

పరిశుభ్రతకు పెద్దపీట..

గూడెంలో పరిశుభ్రతతోపాటు పచ్చదనం నెలకొనేలా గ్రామస్థులు ఎనలేని కృషిచేస్తున్నారు. గ్రామ పటేల్‌తోపాటు స్థానికులు రోజూ పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపడుతున్నారు. మురుగు కాల్వలు శుభ్రం చేయడం, చెత్తాచెదారాన్ని తొలగించడం వంటి పనులు చేస్తుంటారు. గ్రామంలో మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటా మొక్కలునాటి పెంచుతున్నారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకే పంపించాలనే నిబంధన విధించుకొని ఆచరిస్తున్నారు. గ్రామంలో ఎవరికైనా ఆపద వస్తే అందరూ ఏకమై అండగా నిలుస్తున్నారు. ఊరిలో ఎలాంటి సమస్య వచ్చినా అందరూ కూర్చొని చర్చించి పరిష్కరించుకుంటున్నారు. ఎవరికైనా ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురైనా, ఎవరైనా చనిపోయినా ఆర్థికసాయం చేస్తున్నారు. గ్రామ పటేల్‌తో చర్చించి ఎంత మొత్తంలో సాయం చేయాలో నిర్ణయిస్తారు. ఇందుకోసం పదేండ్లుగా డబ్బులు కూడబెడుతున్నారు.

ఊరిని బాగుచేసుకున్నం..

గంగారాం మహరాజ్ చూపిన మార్గంలో నడిచి ఊరిని బాగు చేసుకున్నాం. 15ఏండ్ల కింద గ్రామంలో కొందరికి మద్యం అలవాటు ఉండేది. దీంతో గొడవలు జరిగేవి. మహరాజ్ ఆధ్యాత్మిక బోధనలతో మద్యం తాగడం మానేశారు. ప్రతి ఒక్కరూ ఆత్మవిమర్శ చేసుకుంటూ ఆయన చూపిన మార్గాన్ని అనుసరిస్తున్నారు. ప్రతి సోమవారం ఆలయంలో భజనలు, ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహిస్తుంటాం.

– కుమ్రం జీవన్

పిల్లలంతా సర్కారు బడికే..

గంగారాం మహరాజ్ చెప్పినట్టే నడుచుకుంటున్నం. ఇంటితోపాటు బయట కూడా చెత్తాచెదారం లేకుండా చూస్తున్నం. మొక్కలను పెంచుతున్నం. భక్తిమార్గంలో నడుస్తున్నం. మేము పెద్దగా చదువుకోలే. మా పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చదివిస్తూ వారి బంగారు భవిష్యత్‌పై ఆశలు పెట్టుకున్నాం.

– మెస్రం సీతాబాయి

వ్యసనాలకు దూరం..

ఊరోళ్లంతా చెడు వ్యసనాలకు దూరంగా ఉంటున్నారు. జీవహింస చేయరాదు, సారా తాగకూడదు, మాంసం తినకూడదన్న మహరాజ్ బోధనలను అనుసరిస్తున్నారు. అందరం కలిసి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకుంటున్నాం. పచ్చదనం కోసం మొక్కలు పెంచుతున్నాం. గ్రామంలో కట్టుబాట్లు పాటించని వారిపై చర్యలు తీసుకుంటున్నాం. ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు ఆర్థికసాయాన్ని అందిస్తున్నాం.

– మడావి భీంరావ్, గ్రామ పటేల్

ప్రత్యామ్నాయం లేకనే లాక్‌డౌన్

- ప్రజలు ఇప్పటిలాగే సహకరించాలి
- ట్విట్టర్‌లో మంత్రి కేటీఆర్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఇప్పటివరకు చేసినట్టే ఇకపై కూడా లాక్‌డౌన్ అమలుకు అందరూ సహకరించాలని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ కోరారు. కరోనాను అరికట్టడానికి ఇంతకంటే వేరే మార్గంలేదని శనివారం మంత్రివర్గ సమావేశం అనంతరం ట్విట్టర్ ద్వారా పేర్కొన్నారు. ఇలాంటి సందర్భాలు జీవితంలో ఒకసారే వస్తాయని, సవాళ్లను అందరం కలిసి ఎదుర్కొందామని పిలుపునిచ్చారు.

పోలీస్ సేవలకు సెల్యూట్

- రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ ట్వీట్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా వ్యాప్తిని నిరోధించడానికి కృషిచేస్తున్నవారిని కలిసే అవకాశం దక్కడం సంతోషంగా ఉన్నదని రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. 'శనివారం రాత్రి ఇంటికి వెళ్తుండగా పోలీసులను కలిశాను. అక్కడున్న ఓ పోలీసు అధికారిది జన్మదినం కావడంతో శుభాకాంక్షలు తెలిపాను. వారి సర్వీసుకు సెల్యూట్' అని ట్వీట్ చేశారు.

ఎల్లుండి నుంచి ఎండలే!

- నేడు, రేపు వర్షసూచన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ నెల 14, 15 తేదీల నుంచి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు, మూడు డిగ్రీలు పెరిగే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ నాగరత్న తెలిపారు. ఉపరితల ద్రోణి ప్రభావంతో రాగల 48 గంటల్లో రాష్ట్రంలో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశం ఉన్నదన్నారు.

మంత్రం సాంకేతికాధీనం

- లాక్‌డౌన్‌తో గడపదాటని పురోహితులు
- తప్పనిసరి పరిస్థితిలో ఆన్‌లైన్‌లోనే పూజలు
- ఏప్రిల్ తర్వాత కూడా ముహూర్తాలు అరకొరే..
- పేద బ్రాహ్మణులకు కష్టాలు

మానికం పెట్టిస్తున్న బ్రాహ్మణులు (ఫైల్)

హైదర్‌నగర్: జగత్సర్వం దైవాధీనం, తత్ దైవమ్ మంత్రాధీనం; తన్మంత్రం బ్రాహ్మణాధీనమ్, బ్రాహ్మణో మమ పరదేవతాః.. ఇది పురాణవాక్యం. జగత్తంతా దైవాధీనమైతే.. ఆ దైవం మంత్రానికి ఆధీనుడై ఉంటాడట. ఆ మంత్రం బ్రాహ్మణుడి ఆధీనంలో ఉంటుంది. కాబట్టి బ్రాహ్మణుడు పరదేవతాస్వరూపమని అర్థం.

కానీ.. ఇప్పుడు కరోనా పుణ్యమా అని మంత్రం బ్రాహ్మణుడి ఆధీనంలో కూడా లేకుండాపోయింది. సాంకేతిక పరిజ్ఞానం ఆధీనంలోకి వెళ్లిపోయింది. రాష్ట్రంలో లాక్‌డౌన్ అమలు కారణంగా వివాహాది శుభకార్యాలు వాయిదాపడ్డాయి. ఆకస్మికంగా చేపట్టాల్సిన కొన్ని కార్యాలు, అపరకర్మలను చేయించడానికి పురోహితులు వెళ్లలేని పరిస్థితి నెలకొన్నది. పురోహితులు తాముంటున్న ప్రాంతాల నుంచి కిలోమీటర్ దాటిపోవడంలేదు. తప్పనిసరిగా వెళ్లాల్సిన పరిస్థితుల్లో.. కార్యక్రమం నిర్వహించాల్సిన కర్త కోరిక మేరకు స్మార్ట్‌ఫోన్లలోనే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వాట్సాప్‌లు, జూమ్ వంటి వీడియో యాప్‌ల ద్వారాకానీ.. ఫోన్ ఆడియో ద్వారా కానీ సంకల్పంచెప్పి క్రియా విధానాన్ని వివరిస్తూ కార్యక్రమం పూర్తిచేయిస్తున్నారు. ప్రత్యక్షంగా కార్యక్రమాలను నిర్వహించలేకపోవడంవల్ల పురోహితుల ఆదాయం గణనీయంగా పడిపోయింది. అయిన ప్పటికీ ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ, సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్నారు. లాక్‌డౌన్‌ను పొడిగిస్తే.. ఆన్‌లైన్‌లో పూజలు పెరుగవచ్చు. కానీ.. ప్రత్యక్షంగా చేయాల్సిన శుభాశుభ కార్యక్రమాలు ఆగిపోవడం వల్ల తమకు ఆర్థిక కష్టాలు ఎదురుకావొచ్చని పురోహితులు ఆందోళన చెందుతున్నారు.

ఈ నెలలోనే ఎక్కువ ముహూర్తాలు

సాధారణంగా పురోహితులకు ముహూర్తాలు ఎక్కువగా ఉన్నప్పుడే ఆదాయం వస్తుంది. ఈ ఏడాది వివాహాలకోసం ముహూర్తాలు ఏప్రిల్‌లోనే ఉన్నాయి. లాక్‌డౌన్ కారణంగా ఏప్రిల్ నెలంతా ఒక్క పెండ్లి కూడా జరుగని పరిస్థితి. శంకుస్థాపనలు, భూమిపూజలకు కూడా ఈ నెలలోనే అవకాశమున్నది. ఏప్రిల్ 30 దాకా లాక్‌డౌన్ పొడిగింపుతో అన్ని కార్యక్రమాలు వాయిదా పడక తప్పదు. ఒకవేళ మే 1 లాక్‌డౌన్ ఎత్తేసినా పురోహితులకు మాత్రం కలిసొచ్చేది ఏమీలేదు. మే 3 నుంచి వాస్తు కర్తరి, మే చివరలో శుక్రమౌఢ్యం మొదలవుతుంది. దీంతో నిర్మాణాలు, ప్రారంభాలకు బ్రేక్ పడుతుంది. జూన్ మొదటివారం దాకా ముహూర్తాలు కరువే. జ్యేష్ఠ మాసంలో వివాహ ముహూర్తాలు ఉన్నప్పటికీ కొన్ని మాత్రమే ఉన్నాయి. జూలైమాసం అంతా ముహూర్తాలు లేవు. శ్రావణమాసం ఒక్క నెల పురోహితులకు కలిసొచ్చేకాలం. భాద్రపదం లోనూ ముహూర్తాలు ఉండవు. ఇక ఆశ్వయుజ మాసంలో మహాలయ పక్షాల్లో పితృతర్పణాలు తప్ప ఇతరత్రా చేసేందుకు లేదు. అధికమాసంలో కార్యక్రమాలు చేయరు. నిజమాసంలో మాత్రమే శుభకార్యాలు చేయాల్సి ఉంటుంది. నవంబర్ తర్వాత కానీ పరిస్థితి చక్కబడదు. దీంతో లాక్‌డౌన్ ఎత్తివేసినా పేద బ్రాహ్మణులు మాత్రం ఆర్థిక సమస్యలు ఎదుర్కోవలసి ఉంటుందని తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు.

కష్టమైనా తప్పడం లేదు

ఇప్పటివరకూ ఏ కార్యక్రమమైనా వెళ్లి నిర్వహించే వాళ్లం. ఆన్‌లైన్‌లో చేయించే సంప్రదాయం ఇప్పుడే మొదలైంది. అలా చేయించటం కష్టమే అయినా తప్పడంలేదు.

– సాగి సుబ్రహ్మణ్యశర్మ, వేద పండితుడు, నాగోల్

ఆన్‌లైన్‌లో సంకల్పం

ఇటీవల తెలిసిన వాళ్ల ఇంట్లో మాసికానికి ఆన్‌లైన్ సంకల్పం చెప్పాను. కార్యాలన్నీ రద్దు కావటం వల్ల వందలాది బ్రాహ్మణ కుటుంబాలు రోజు గడవక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి.

– కాటేపల్లి అనంతరామశర్మ, పురోహితుడు, మల్కాజ్‌గిరి

సాంకేతికత గురించి చెప్తున్నా

సాంకేతికతతో పూజలు చేసుకునే విధానంపై అవగాహన కల్పిస్తున్నా. గత్యంతరంలేని పరిస్థితుల్లోనే వినియోగించుకోవాలని చెప్తున్నా. తప్పదంటే జాగ్రత్తలు తీసుకుంటే వెళ్లి వస్తున్నా.

– పురాణం దినేశ్ శర్మ, పురోహితుడు, మన బ్రాహ్మణసమాజం నేత

'ఇండియా వర్సెస్ కరోనా' అని రాసివున్న అక్షరాలపై దీపాలను వెలిగిస్తున్న సీఎం కేసీఆర్ మనుమడు హిమాన్షు, కేటీఆర్ సతీమణి శైలిమ, కుమార్తె అలేఖ్య

కరోనా అంతానికి హిమాన్షు దీప ప్రజ్వలన

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రధాని మోదీ ఇచ్చిన స్ఫూర్తితో కరోనా అంతం కావాలని ఆకాంక్షిస్తూ ముఖ్య మంత్రి కేసీఆర్ మనమడు, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ కుమారుడు హిమాన్షు నిత్యం దీప ప్రజ్వలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. లాక్‌డౌన్ పూర్తయ్యే వరకు ప్రతిరోజు ఏదో ఒక పేరుతో దీపాలు వెలిగించనున్నట్టు ఇప్పటికే ప్రకటించారు. ఇందులోభాగంగా ఐదోరోజు శుక్రవారం డై కరోనా అని, ఆరోరోజు శనివారం ఇండియా వర్సెస్ కరోనా అని రాసి ఉన్న అక్షరాలపై హిమాన్షు దీపాలను వెలిగించారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మరో 330 కొనుగోలు కేంద్రాలు

- రైతుబంధు సమితి చైర్మన్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం, మక్కజొన్నల కొనుగోళ్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రైతుల నుంచి కంట్రోల్‌రూంకు అందిన విజ్ఞప్తుల మేరకు కొత్తగా 320 ధాన్యం, 10 మక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల్లో శనివారం ఒక్కరోజే 32,911 టన్నుల వరి ధాన్యం, 3,400 టన్నుల మక్కజొన్న కొనుగోళ్లు జరిగాయి. వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూంను శనివారం రైతుబంధు సమితి చైర్మన్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి సందర్శించి, రైతుల విజ్ఞప్తులు, ఫిర్యాదులను ఆరాతీశారు. కొనుగోలు కేంద్రాలు సరిపోవడంలేదని, గన్నీ బ్యాగులు కావాలని, కందుల కొనుగోలు డబ్బు అందలేదని, అదనంగా ఐకేపీ కేంద్రాలను ఏర్పాటుచేయాలని.. వంటి 19 ఫిర్యాదులపై పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్పందించి కొత్తగా మరో 330 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. శనివారం నాటికల్లా రాష్ట్రవ్యాప్తంగా 85,309 టన్నుల వరి ధాన్యం, 33,224 టన్నుల మక్కజొన్నలను పౌరసరఫరాలశాఖ సేకరించినట్టు పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు.

దివ్యాంగురాలి ఔదార్యం

- దాచుకొన్న డబ్బుతో అన్నదానం

ఇబ్రహీంపట్నం, నమస్తే తెలంగాణ: ఆమె మాట్లాడలేదు. వినలేదు. పుట్టుకతోనే చెవుడు, మూగ. అయితేనేం.. లాక్‌డౌన్ కష్టాల్లో చిక్కుకొన్నవారికి అండగా నిలుస్తున్నది. ఆమే రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంకు చెందిన పసునూరి స్నేహ. ఇంటర్ వరకు చదివిన స్నేహ.. తాను దాచుకొన్న రూ.లక్షతో అన్నదానం చేస్తున్నది. ఆమె తండ్రి పసునూరి శ్రీనివాస్ మరో రూ. లక్ష జోడించి, ప్రోత్సహిస్తుండటం విశేషం. ఇబ్రహీంపట్నంలోని పేదలతోపాటు కూరగాయల మార్కెట్‌కు వచ్చే రైతులు, బాటసారులు, పోలీసులు, మున్సిపల్ సిబ్బందికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం పెడుతున్నారు. తెల్లవారుజామున 4 గంటల నుంచే స్నేహ కుటుంబసభ్యులంతా అన్నదానం పనుల్లో నిమగ్నమవుతున్నారు.

మార్కెట్‌కు వచ్చిన మహిళా రైతుకు భోజనం అందజేస్తున్న పసునూరి స్నేహ

హైదరాబాద్‌కు చేరిన మెడికల్ కిట్లు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా బాధితులకు చికిత్సకు ఉపయోగించే మందులు, ఇతర వస్తువులు హైదరాబాద్ చేరుకున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరపున కొనుగోలు చేస్తున్న వైద్యపరికరాలు, మందులు ఒక్కొక్కటిగా రాష్ట్రానికి చేరుతున్నాయి. శనివారం ప్రత్యేక కంటైనర్ల ద్వారా మందులు, ఇతర మెడికల్ కిట్లు అహ్మదాబాద్ నుంచి హైదరాబాద్‌కు పంపారు. వాటిని వైద్యవిభాగాలు కోఠిలోని కరోనా కమాండ్ కంట్రోల్ రూంకు తరలించాయి.

epaper.ntnews.com

నమస్తే తెలంగాణ
కరీంనగర్
ఆదివారం 12 ఏప్రిల్ 2020
www.ntnews.com

జిందగీ

మహేశ్‌కు నచ్చిన పుస్తకం

మహేశ్ బాబు ఏం చేస్తున్నారో తెలుసా? లాక్‌డౌన్ సమయంలో మహేశ్ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటున్నారు. పిల్లలు గౌతమ్, సితారతో గడుపుతున్నారు. వాళ్లతో కలిసి యానిమేషన్ సినిమాలు చూస్తున్నారు. మహేశ్ బాబు మంచి రీడర్ కూడా. సమయం దొరికితే పుస్తకాలు చదువుతుంటారు. తాజాగా తాను చదివిన ఒక పుస్తకాన్ని 'పిక్ ఆఫ్ ది వీక్' అంటూ పోస్ట్ చేశారు. అది యువాల్ నోహ్ హరారీ రాసిన 'సేపియన్స్' అనే పుస్తకం. దీన్ని చదువుతుంటే ఎంతో ఉత్తేజం కలిగిందని, తనను ఎంతో ఎడ్యుకేట్ చేయడమే కాకుండా, కళ్లు తెరిపించిందని ట్వీట్ చేశారు.

కాలికి చక్రాలేసుకుని తిరిగే మనకు కాలం కరోనా రూపంలో తాళం వేసింది. అది తానా అంటే మీరు తందానా అని బయటికెళ్లారనుకోండి.. 'నేను రానా' అని అడగకుండానే మీ మీదికి వచ్చేస్తది కరోనా. అందుకే గమ్మునుండండి.. ఇంట్లోనే. మరి రోజంతా ఏం చేయాలి? అంటారా. మనసుండాలేగానీ మార్గాలు అనేకం. చదవొచ్చు. రాయొచ్చు. చూడొచ్చు. ఒకరకంగా చెప్పాలంటే ఇది చాలా విలువైన సమయం. అందుకే వృథా చేయకండి. ఇదిగో ఈ ప్రముఖులు చూడండి.. కరోనా నియమాలు పాటిస్తూ ఇంట్లోనే ఉంటూ ఏం చేస్తున్నారో? ఏం చదువుతున్నారో.. ఏం రాస్తున్నారో.. ఏం చూస్తున్నారో? తెలుసుకుని మీరూ స్ఫూర్తి పొందండి. చదవండి. రాయండి. చూడండి.

ఏం చూస్తున్నారు రాస్తున్నారు చదువుతున్నారు?

జాషువా రచనలు చదువుతున్నా..

లాక్‌డౌన్‌తో దొరికిన విరామ సమయంలో పుస్తక పఠనం చేస్తున్నాను. గతంలో సినిమాలు చూసేవాణ్ని, ఇప్పుడు అలనాటి పౌరాణిక చిత్రాలను చూస్తూ ఆ భాషనూ సాహిత్యాన్నీ అధ్యయనం చేస్తున్నాను. జాషువ రచనలను పరిపుష్టంగా చదువుతూ.. శ్రీ కృష్ణదేవరాయ, ప్రాచీన కాల పద్యాలను కంఠస్థం చేస్తున్నాను. యావత్ భూగోళానికి వచ్చిన కష్టం ఇది. ప్రకృతి దయతో కరోనా విపత్తు నుంచి ఎలాగైనా బయటపడుతాం. కరోనా నేపథ్యంలో ప్రకటించిన లాక్‌డౌన్‌తో నా వద్ద పని చేస్తున్న వారు ఇబ్బందులు పడకూడదని జీతంతోపాటు నిత్యావసర సరుకులను ముందే ఇచ్చి, సినీ కార్మికుల సంక్షేమానికి టీసీసీ ట్రస్ట్‌కు నా వంతు సహాయం అందిస్తున్నాను.

-తనికెళ్ల భరణి, సినీ నటుడు, రచయిత

రచనా నైపుణ్యాన్ని పెంచుకుంటున్నా!

పనికి సెలవులొచ్చాయ్ గాని ఇంటి పనికి కాదు. అందుకే ఇంటిపనులు చేయడానికి కూడా ఓ మూడు గంటల సమయం వెచ్చిస్తున్నా. రాయడానికి నాలుగు గంటలు, చదవడానికి మూడు గంటలు కేటాయిస్తున్నా. మిగిలిన సమయం పిల్లలతో గడుపుతున్నా.

'హరివంశం' అనే పుస్తకం చదువుతున్నా. మహాభారతంలో స్వర్గారోహణ పర్వం తర్వాత... శ్రీకృష్ణుడి కథను పూర్తిగా చెప్పలేక పోయాననే అసంతృప్తితో వ్యాసుడు మరో మూడు పర్వాలు జోడించాడు. అదే, ఈ హరివంశం. ఇది 650 పేజీల పుస్తకం. అందులో 220 పేజీలు ఇప్పటివరకు చదివాను. నేను ఫాస్ట్ రీడర్‌ని కాను. ఎక్కువ సమయం తీసుకుంటాను. రాత్రిపూట మా బాబుకి చెప్పినట్టు ఉంటుంది... నేను మళ్లీ చదివినట్టు ఉంటుందని పంచతంత్ర కథలు చదువుతున్నా. దీన్ని 3 భాగాలు పూర్తి చేశాను. రాయడం విషయానికొస్తే సినిమా బాణీలో కాకుండా, దొరికిన ఈ ఖాళీని రచన లోతుల్ని పెంచుకోవడానికి ఉపయోగించుకుంటున్నా. ఆ దిశగా రచనలు చేస్తున్నా. సార్వజనీనం, సార్వకాలీనం అయిన వస్తువుల్ని తీసుకుంటున్నా. ఇవి కూడా పాటగానే రాస్తున్నా. త్వరలో ఫేస్‌బుక్‌లో పెడ్తాను. సినిమాలు చూడటంపై నాకు పెద్దగా ఆసక్తి లేదు.

- అనంత శ్రీరామ్, సినీ గేయ రచయిత

కరోనాపై పాట రాశా..

ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు అయిదు గంటల పాటు పుస్తక పఠనం. భోజనం తర్వాత 2 నుంచి సాయంత్రం 5 వరకు మ్యాట్నీ, రాత్రి 9 నుంచి 12 వరకు సెకండ్ షో.. ఇదీ నా రోజు వారీ షెడ్యూల్. లాక్‌డౌన్ సందర్భంగా పిల్లల విషయంలో ఓ కొత్త కాన్సెప్టు మొదలుపెట్టాను. ప్రతిరోజు ఒక అంశం ఇస్తాను. నా ఇద్దరు పిల్లలు, భార్య.. ముగ్గురూ ఆ అంశం మీద కవితాత్మకమైన పంక్తులతో సృజనాత్మక అభివ్యక్తీకరణతో రాయాలి. తర్వాత దానిపై విశ్లేషించుకోవడం.. ఇలా పిల్లలు రాసి, చర్చ చేయడంలో అంతర్గతంగా సాహిత్య మథనం జరుగుతున్నది.

పుస్తకాలు చదవడానికిది మంచి సమయం. గాలిబ్ గీతాలు చదివాను. 'రమణీయ భాగవత కథలు' పేరుతో ముళ్లపూడి రమణ రాసిన భాగవతం పుస్తకంలో దశావతారాలు పూర్తయింది. భగవంతుని గాథే కాకుండా ఎన్నో చమత్కారాలు, పద బంధాలు, పద ప్రయోగాలతో వినూత్న రచనా శైలి కనిపిస్తుంది. ఈ పుస్తకం చదవడం ఇది మూడోసారి. ఇంకోటి మాధవ్ రాసిన 'అభౌతిక స్వరం' అనేది కూడా చాలా గొప్ప పుస్తకం. ఈ మధ్య చదివిన 'అనగనగా ఒక చిత్రకారుడు', నాకు నచ్చిన కవి జీవితం 'ప్రవక్త' అనే పుస్తకం కూడా ఈ లాక్‌డౌన్ సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా చేశాయి. ఇక సినిమాల విషయానికొస్తే పాతసినిమాలన్నీ చూస్తూ ఎంజాయ్ చేస్తున్నా. మిస్సమ్మ, గుండమ్మ కథ, రాముడు-భీముడు, సిరివెన్నెల, శ్రుతిలయలు, శ్రీవారికి ప్రేమలేఖ, నాలుగు స్తంభాలాట, నాయకుడు, సితార, అన్వేషణ, ది సర్కస్, గ్రేట్ డిక్టేటర్.. ఇలా 28 సినిమాలు చూశాను. ఇంకా చూస్తున్నాను. లోకం గురించి, జీవితం గురించి ఎక్కువ ఆలోచిస్తున్నా.

- చంద్రబోస్, సినీ గేయ రచయిత

'నేను అడవిని మాట్లాడుతున్నాను'

2016లో 'శ్రమకావ్యం' రాశాను. ఇప్పుడు కరోనా మూలంగా వచ్చిన సమయాన్ని 'నేను అడవిని మాట్లాడుతున్నాను' అనే అరణ్యకావ్యం రాయడానికి ఉపయోగించుకుంటున్నాను. అడవులను, ఈ ఆకుపచ్చదనాన్ని నాశనం చేయడం వల్ల కలిగే నష్టాన్ని గురించి వివరిస్తూ అరణ్యచరిత్రను కావ్యంలా రాస్తున్నాను. 60 చాప్టర్లలో 25 వరకు రాశాను. కరోనా మూలంగా సినిమాలు లేవు కనుక ఈ సెలవుల్లో ఈ కావ్యాన్ని పూర్తిచేస్తే నేను దీన్ని సద్వినియోగం చేసుకున్నట్లే.

- సుద్దాల అశోక్‌తేజ, సినీ గేయ రచయిత

కేసీఆర్‌పై కవిత..

నేను నడిపే మయూఖ టాకీస్ ఫిల్మ్ యాక్టింగ్ స్కూల్‌తో నాకు అటాచ్‌మెంట్ ఎక్కువ. తెల్లకాగితాలు, చదవాల్సిన పుస్తకాలు, ల్యాప్‌టాప్ పట్టుకుని అక్కడికి వెళ్తాను. రాసుకోవడం, పుస్తకం చదవడం, సినిమా చూడటం.. ఇలా ఏది నచ్చితే అది కొద్దిసేపు చేస్తూ ఉంటాను.

నేను మొదటినుంచీ పుస్తకాల పురుగుని. ఈ లాక్‌డౌన్ అందుకు కావాల్సినంత సమయమిచ్చింది. గొల్లపూడి మారుతీరావు గారు రాసిన ఆత్మకథ 'అమ్మకడుపు చల్లగా', ఈశ్వర్ సినిమా జ్ఞాపకాలకు సంబంధించిన పుస్తకం చదివేశాను. గొల్లపూడి వారు ఆచార్య ఆత్రేయ గురించి రాసిన 'ఆత్రేయ- ఒక పరిశీలన' పుస్తకం చదువుతున్నాను. ఒక ఆరేడు వరకు ఇంగ్లీషు సినిమాలు చూశాను. నెట్‌ఫ్లిక్స్‌లో వెబ్‌సిరీస్‌లు చూస్తున్నా. నాకు సీనియర్ ఎన్టీఆర్, సావిత్రి, అక్కినేని వారి సినిమాలు, పాటలు చాలా ఇష్టం. అర్ధరాత్రి వరకూ ఆ పాటలు వింటూనే ఉంటాను. సినిమా పనులేవీ వర్క్ ఫ్రమ్ హోమ్ చేయలేం. షూటింగ్ చేయాలన్నా, డబ్బింగ్ అయినా, డిస్ట్రిబ్యూషన్, ప్రివ్యూ.. దేనికైనా జనాలు కావాలి. సినిమా విడుదల చేయాలన్నా థియేటర్‌కి ప్రేక్షకులు రావాలి. ఇలా ఇది పూర్తిగా జనానికి సంబంధించింది. ఇప్పటి పరిస్థితుల వల్ల సినిమా పరిశ్రమ అంతా నాలుగైదేళ్లు వెనక్కి వెళ్లిపోతున్నది. అందుకే సినిమా వాళ్ల గురించి 'సిని'మా' వాళ్లం' అనే కవిత రాశాను. 'ఎక్కడెక్కడో పుట్టాం – మరెక్కడో పెరిగాం, సినీ వట వృక్ష ఛాయన ఒక్కగూటి పక్షులం.. సినీతల్లి బిడ్డలం.. ఊహలకే ప్రాణమిచ్చు చిత్రేంద్ర జాలికులం... సూర్యుడినే నిద్రలేపి పరిగెత్తే పరుగులం.. ప్రకృతినే ప్రశ్నిస్తూ పనిచేసే దేహాలం.. లొకేషన్లే ఆలయాలు, కెమెరాలే దేవుళ్లు..' అంటూ సాగుతుంది.

ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడిన తరువాత చాలా ధైర్యంగా అనిపించింది. ఇంట్లో తండ్రి మాట్లాడిన ఫీలింగ్ కలిగింది. అందుకే 'మొన్న టీవీల నిన్ను జూశినంక, నీ మాటలిన్నంక, నీ చెయ్యితోని మా కండ్ల నీళ్లు తుడ్శినట్టు, భుజం మీద చెయ్యేసి ధైర్యం జెప్పినట్టు గొట్టింది, తెలంగాణ యెన్నుపూసగ నిల్చినవ్, గుండె దమ్ముజై నడుస్తున్నవ్.., నువ్వు మానవ మందిరం, మానవీయ పతాకం, ఈ దేశం జెండ గూడ నీకు సలాం జేస్తుంది' అంటూ రాసిన.

- ఉత్తేజ్,
సినీ రచయిత, నటుడు

'మనుషులు మారాలి' చూశా..

ప్రస్తుతం పూర్తిగా ఇంట్లోనే ఉంటున్నాను. ఉదయం ఎక్సర్‌సైజ్, ప్రాణాయామం చేస్తున్నాను. కరోనా మూలంగా లభించిన కాలాన్ని పెండింగ్‌లో ఉన్న పుస్తకాలు చదవడానికి వినియోగిస్తున్నాను. ఈమధ్య జలజం సత్యనారాయణ తెలుగులోకి అనువదించిన 'ఫైజ్ అహ్మద్ ఫైజ్ కవిత్వం', ఘంటశాల నిర్మల ఎడిట్ చేసిన 'నాన్నపదం', బి.వి.ఎన్.స్వామి రాసిన 'పల్లేరుకాయలు' చదివాను. మొదటి వారం రోజులు కొన్ని పుస్తకాలకు ముందుమాటలు రాశాను. కరోనా మీద రెండు పాటలు, రెండు, మూడు కవితలు కూడా రాశాను. ఈ మధ్య చిన్నపుడు చూసిన 'మనుషులు మారాలి' సినిమా మళ్లీ చూశాను. అలాగే ఈ ఏడాది ఆస్కార్ అవార్డు సాధించిన 'పారాసైట్' సినిమా కూడా చూశాను.

-నందిని సిధారెడ్డి, ఛైర్మన్, తెలంగాణ సాహిత్య అకాడమీ

సాహిత్యానికే నా ఓటు..

లాక్‌డౌన్‌ని కొంత సేవ కోసం వినియోగిస్తున్నా. సాహిత్యానికి సంబంధించిన పుస్తకాలను, పేపర్లలో వచ్చే ఆర్టికల్స్‌ని చదువడం రోజువారి పనిగా పెట్టుకున్నా. ఈ సమయంలో కరోనాకి సంబంధించిన వ్యాసాలే కాకుండా.. కరోనా తర్వాత ఎకానమీ ఎలా ఉండబోతుందన్న వ్యాసాలు వచ్చాయి. వాటన్నింటినీ ముందు వేసుకుంటున్నా. ఇన్‌ఫ్లుయన్జా అనే ఆన్‌లైన్ పుస్తకాన్ని నా స్నేహితుడు పంపించాడు. ప్రస్తుతం ఆ పుస్తకం చదువుతున్నా. వంద సంవత్సరాల క్రితం స్పానిష్ ఫ్లూ వస్తే ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది చనిపోయారు. భారతదేశంలో కోటిమంది మరణించారు. ప్రస్తుత సంక్షోభ సమయాన్ని గుర్తుచేసేలా ఉంటుందీ రచన. ఇదికాకుండా హాట్‌స్టార్‌లో మహాభారతం 198 ఎపిసోడ్లను రెండు రోజులు.. ఏడు గంటల పాటు కుటుంబమంతా కలిసి చూశాం.

- వినోద్ కుమార్,
ప్లానింగ్ కమిషన్,
వైస్ – చైర్మన్

ఫిక్షన్ నచ్చదు..

చాలామంది సహాయానికి వస్తుంటారు. వారికి గంట, రెండు గంటల పాటు సమయం కేటాయిస్తున్నా. ఎర్లీ ఇండియన్స్ అని టోనీ జోసెఫ్ రాసిన పుస్తకాన్ని చదువుతున్నా. డీఎన్‌ఏతో మనిషి జీవిత స్థితిగతులను తెలిపే ఈ పుస్తకం చాలా ఆసక్తికరంగా ఉంది. నాకు ఫిక్షన్ నచ్చదు. అందుకే సీరియస్ పుస్తకాలు ఎక్కువగా చదువుతా. ఆర్థికం, చరిత్ర.. ఇలా ఏ పుస్తకం కనిపిస్తే అది చదివేస్తుంటా. ఒక సారి మొదలుపెడితే అది అయిపోయే వరకు కదలను. చాలా సీరియస్ రీడర్‌ని అని చెప్పొచ్చు. అప్పుడప్పుడు రాస్తుంటా. సాహిత్యం, ఆర్థికం.. ఇలా నా మూడ్‌ని బట్టి రాస్తుంటా. నెట్‌ఫ్లిక్స్‌లో వచ్చిన బుద్ధ అనే వెబ్‌సిరీస్ చూశా. అది కూడా హిస్టారికల్ కదాని చూశా. పెద్దగా సినిమాలు చూసేవాడిని కాను. ఎక్కువగా న్యూస్ చూస్తాను. ఇంట్లో కూడా నేను లైబ్రెరీ, టీవీ, ఒక నోట్‌బుక్ ఇదే ప్రపంచంగా బతుకుతున్నా. ఉదయం ప్రాణాయామం చేస్తా. దానివల్ల ఒత్తిడి తగ్గుతుంది. కానీ ఈ ఆపద సమయంలో దూరాన్ని పాటించండని అందరినీ కోరుతున్నా.

- కె. కేశవరావు, ఎంపీ

చదివినవే మళ్లీ చదువుతున్నా..

రోజూ వర్కవుట్స్ చేస్తున్నా. వంట చేయడం కూడా నేర్చుకుంటున్నా. అక్కకి ఫోన్ చేసి వీడియో కాల్ ద్వారా బిర్యానీ ఎలా చేయాలో నేర్చుకున్నా. కేక్ చేయాలని అనుకున్నా. కానీ దానికి సంబంధించిన పదార్థాలు నా దగ్గర లేవు. ఉన్నవాటితో ప్రయోగాలు చేస్తున్నా. ఇన్ని రోజులూ మిస్సయిన సినిమాలను నెట్‌ఫ్లిక్స్, అమెజాన్‌లలో కవర్ చేస్తున్నా. వెబ్‌సిరీస్‌లు చూస్తున్నా. ఒకసారి వెబ్‌సిరీస్ మొదలుపెడితే అయ్యేవరకు లేవను. అందుకే ఇప్పటికైతే ఒకటి చూశా. రోజూ ఒకేలా చేయడం నాకసలు ఇష్టం ఉండదు. ఎక్కువ సమయాన్ని పుస్తకాలు చదువుతూ గడుపుతా. అందులో ఆల్కెమిస్ట్, సీక్రెట్ మళ్లీ మళ్లీ చదువుతుంటా. సిడ్నీషెల్డన్ రాసిన ద స్టార్ షైన్ డౌన్ కూడా మళ్లీ చదువుతున్నా. నేను సినిమా కథలు ఫోన్‌లో వినను. అందుకే నన్ను అప్రోచ్ అయిన వాళ్లను సాఫ్ట్ కాపీ మెయిల్ చేయమని చెబుతున్నా. అలా చదివి ఫోన్‌లో చర్చిస్తాను. ఎక్కువ శాతం మ్యూజిక్ వినడానికి ఇష్టపడుతా.

- ఈషా రెబ్బా, నటి

'డార్క్' బాగా నచ్చింది..

నేను ఎక్కువగా ఆధ్యాత్మిక పుస్తకాలు చదువుతున్నా. వేన్ డయర్ రచించిన 'పవర్ ఆఫ్ ఇంటెన్షన్' అనే పుస్తకాన్ని అందరూ చదువాలని కోరుకుంటున్నా. ఎవరైనా ఈ పుస్తకాన్ని కొనలేకపోతే, ఆన్‌లైన్‌లో వినే సౌకర్యం కూడా ఉంది. అలా నలుగురైనా చదివితే బాగుంటుందని అనిపిస్తున్నది. ఇలాంటి సమయాల్లో మన చుట్టూ చాలా నెగెటివిటీ ఉంటుంది. వీలైతే పాజిటివిటీని పంచాలని నేను అనుకుంటున్నా. ఇప్పటివరకు నేను చూడని సినిమాలు చాలా ఉన్నాయి. తెలుగు, తమిళం, మలయాళం, స్పానిష్, ఇంగ్లిష్.. ఇలా అన్ని భాషల సినిమాలూ కవర్ చేస్తున్నా. జర్మన్ వెబ్‌సిరీస్ 'డార్క్' నాకు బాగా నచ్చింది. నా మూడ్‌ని బట్టి బుక్స్, సినిమా... ఇలా మారుతుంటుంది. వర్కవుట్ కంపల్సరీ. ఈ లాక్‌డౌన్ సమయంలో గంట గంటకు మెడిటేషన్ చేయడం కూడా అలవాటు చేసుకున్నా. ఎందుకంటే ఈ సమయంలో మనం సహనాన్ని కోల్పోతాం. చిరాకు ఉంటుంది. దాని నుంచి బయటపడాలంటే మెడిటేషన్ మినహా మరో దారి లేదని నా సలహా.

- రాశీఖన్నా, నటి

మనీ మేనేజ్‌మెంట్..

సినిమాలు చేస్తున్నప్పుడు కాస్త బ్రేక్ కావాలి అనుకునే దాన్ని. అనుకోకుండా పెద్ద బ్రేక్ వచ్చింది. కానీ ఈ సమయంలో నా సొంత ఊరు డెహ్రాడూన్‌కి వెళ్లలేకపోయా. ముందు వెళదామనే అనుకున్నా.. కానీ ఎయిర్‌పోర్ట్‌లో ఎవరికైనా కరోనా ఉంటే అది నేను క్యారీ చేసి, నా కుటుంబాన్ని బలి చేయడం ఎందుకు అనిపించి ఆగిపోయా. లాక్‌డౌన్ సమయంలో నేను మనీ మేనేజ్‌మెంట్‌కి సంబంధించిన పుస్తకాలు ఎక్కువగా చదువుతున్నా. ఎందుకంటే నాకు రానిది అదే! రిచ్‌డాడ్.. పూర్‌డాడ్ అంటే నాకు చాలా ఇష్టం. అలాగే సేపియన్స్ పుస్తకం చదువుతున్నా. మనుషుల మనస్తత్వాల గురించిన రచన ఇది. ఇక సినిమాలు, వెబ్‌సిరీస్‌లు మామూలే. నెట్‌ఫ్లిక్స్, అమెజాన్.. ఇలా అన్నీ కవర్ చేస్తున్నా.

- లావణ్య త్రిపాఠి, నటి

సమయం దొరకడం లేదు..

లాక్‌డౌన్ సమయంలో.. నాకు సమయం దొరకడం లేదు. ఒకప్పుడు బయట తిరిగి అన్ని పనులు చక్కబెట్టేవాడిని. ఇప్పుడు అన్నీ ఫోన్‌లో చేస్తున్నా. లాక్‌డౌన్ ఎలా జరుగుతున్నదో పర్యవేక్షణ చేస్తున్నా. కొందరితో మాట్లాడి కరోనా నుంచి ఎలా బయటపడాలో అవగాహన కార్యక్రమాలు చేయిస్తున్నా. జార్ఖండ్, బిహార్, బెంగాల్, మహారాష్ట్ర.. ఇలా అన్ని ప్రాంతాల వారు మన దగ్గర ఉన్నారు. వారి సహాయం కోసం కొన్ని ఎన్జీవోలతో మాట్లాడి ఆ పనులు పురమాయిస్తున్నా. ఎక్కువగా కో-ఆర్డినేషన్ పనులు చేస్తున్నాననే చెప్పొచ్చు. ఎక్కడ ఇబ్బంది ఉందన్నా స్పందించి సహాయం అందిస్తున్నాం. శానిటైజర్ల తయారీకి మెటీరియల్ తెప్పించి చేయిస్తున్నాం. నాకు పుస్తకాలు చదువడం ఇష్టం. ఇవికాకుండా నామా ట్రస్ట్ సేవలను కూడా చూసుకోవడంతో తక్కువ సమయమే దొరుకుతున్నది. ఆ దొరికిన సమయాన్ని కూడా పుస్తకాలు చదువడానికే ఉపయోగిస్తా. బిల్డ్ టు లాస్ట్ అనే పుస్తకం తీసి చదువుదామనుకున్నా. కానీ అంతకుముందు ఉజ్వల ప్రస్థానం.. మన చరిత్ర గురించి చెప్పే ఆ పుస్తకాన్ని చదువుతున్నా. ఇంకా మొదటి పేజీల్లోనే ఉన్నా. సమయం దొరక్క కాస్త పుస్తకాలను పట్టించుకోలేదు. ప్రతీరోజూ న్యూస్ అయితే ఫాలో అవుతా. సినిమాలు పెద్దగా చూసే అలవాటు లేదు.

- నామా నాగేశ్వరరావు, ఎంపీ లోక్‌సభ

మహామృత్యుంజయ మంత్రం, శ్రీ ధన్వంతరి ప్రార్థన, శ్రీహరి శ్లోకం, శ్రీ వైద్యనాథ స్తోత్రం, సూర్య శ్లోకం, లలితా సహస్రనామాలలోని రోగనివారణ నామం, అక్షీభ్యాం తే సూక్తం వంటి ప్రామాణికమైన వేదమంత్రాలకు ఉన్న అద్భుత శక్తి సామాన్యులకు అర్థం కాదు. నమ్మకం లేని నాస్తికులకు అసలు బోధపడుదు. నియమానుసారం, స్వరయుక్తంగా వీటిని ఉచ్ఛరిస్తూ, అదే పనిగా జపించడం వల్ల ప్రస్తుత 'కరోనా' భూతం వంటి వైరస్‌ను ప్రతిఘటించగల ఇమ్యునిటీని మనస్సు సంతరించుకుంటుందని ఆధ్యాత్మికవేత్తలు అంటున్నారు. భారతీయ సనాతన ధర్మం దీనినే 'ప్రార్థన' అంటున్నది. మంత్రాలను ఉచ్ఛరించలేని వాళ్లు మనస్ఫూర్తిగా, భక్తిశ్రద్ధలతో దేవతారాధన, ధ్యానోపాసనలు చేసినా ఆ మేరకు ఫలితాలు ఉంటాయని కూడా వారంటారు. కరోనా వైరస్‌ను తరిమి కొట్టడానికి మనకున్న పలు మార్గాలలో మంత్రోపాసన ఒకటి. ఈ విషక్రిమి బారిన పడకుండా, మరణ భయం లేకుండా మన జీవనం సాగాలి. అందుకే, ఈ మంత్రాల ఉపాసన.

మనోబలానికి మంత్రం

'మననాత్ త్రాయతే ఇతి మంత్రః' మననం చేసిన వారిని రక్షించేది మంత్రం. మంత్రాలను నిర్ణీతాంతరాలలో ఉచ్ఛరించడం వల్ల ఉన్నత స్థితికి చేరుతాం. మంత్రానికి స్వరం ఉంటుంది. నిర్ణీత అంతరాలలో మంత్రరూపంలో మనసుకు ఇచ్చుకునే స్వయం సూచనల వల్ల అవి మన అంతర్మనస్సుపై ముద్రితమై ఆ సూచనలకు అనుగుణంగా మనస్సు పనిచేసేందుకు సన్నద్ధమవుతుంది. సుప్తచేతనాత్మకమైన అంతర్మనస్సుకు అంతులేని తెలివితేటలు, శక్తి సామర్థ్యాలు, మనం కోరినదేదైనా సమకూర్చగలిగిన నైపుణ్యాలు అనంతంగా ఉంటాయన్నది వేద వేదోత్తముల విశ్వాసం. మంత్రసాధన లేదా జపం చేయడమంటే మనలోని అంతర్మనస్సుద్వారా మనకు మనం తగిన సూచనలను ఇచ్చుకోవడమే.

మన ఆలోచనలే మన జీవితాన్ని శాసిస్తాయి. మనసును బలోపేతం చేయడం వల్ల క్యాన్సర్ రోగికూడా ఆరోగ్యవంతుడౌతాడనడానికి అనేక నిదర్శనాలు కనిపిస్తాయి. మనోబలాన్ని ఇనుమడింపచేసుకునేందుకే మృత్యుంజయ, దేవతాశక్తి మంత్రాలు గొప్పగా ఉపకరిస్తాయని వేదవిజ్ఞానులు అంటారు. 'మంత్రాలకు చింతకాయలు రాలకపోవచ్చు' కానీ, మనసు ఎంతో గొప్పగా ప్రేరేపితమవుతుంది. మనల్ని దుష్టశక్తికి దూరమయ్యే దిశగా నడిపిస్తుంది. 'మంత్రోపాసనలతో కరోనా లాంటి విధ్వంసకర వైరస్‌లు నశిస్తాయా?' అంటే, 'నశిస్తాయన్నదే' భారతీయుల ప్రగాఢ నమ్మకం.

ముందుగా మనం దానిని విశ్వసించాలి. అందులోని శాస్త్రీయతను, సాంకేతికతను అర్థం చేసుకోవాలి. దానిని నియమానుసారం అనుష్ఠించాలి. అప్పుడు తప్పక ఫలిస్తుంది. 'మృత్యుంజయ మంత్రం' అంటే 'మృత్యువును జయించడానికి అనువైన మంత్రరూప సాధనం'. అక్షరాలను క్రమపద్ధతిలో పెట్టి నిర్ణీతాంతరాలలో ఉచ్ఛరించినప్పుడు అవి మన కండరాలపై, నాడీ వ్యవస్థపై, రక్తప్రసరణపై, గుండె పనితీరుపై గణనీయమైన ప్రభావం చూపుతాయి. ఈ సాధన మన శారీరక మానసిక సామాజిక స్థితులై మనం కోరుకొనే దిశగా మనల్ని నడిపిస్తుంది. నిజానికి, ఎప్పటికైనా మనమంతా మృత్యువుకు దగ్గర కావలసిన వారమే. అలాగని, అకాల మరణం క్షంతవ్యం కాదు. ఆధ్యాత్మిక పరంగా చెప్పాలంటే, 'మృత్యువును జయించడం' అంటే మృత్యువును గురించి సమగ్రంగా తెలుసుకోవడం లేదా శాశ్వత ఆనంద స్వరూపమైన శివతత్వంలో లయం కావడం.

'ఓం త్రయంబకం యజామహే సుగంధం పుష్టి వర్ధనం/ ఉర్వారికమివ బంధనాత్ మృత్యోర్ముక్షీయ మా మృతామ్!'. ఇందులో రెండు భాగాలున్నాయి. మొదటిది: మూడు కన్నులు కలవాడు, సత్వ రజస్తమో గుణాలకు అతీతుడు, భూతభవిష్యత్ వర్తమానాలలో ప్రకాశించేవాడు, స్థూల సూక్ష్మ కారణ శరీరాలకు ఆధారభూతమైన వాడయిన ఆ శివుని లక్షణాలు. రెండవది: మనకు కావలసిన దానిని ఆయననుంచి అర్థించడం. 'దోసతీగ కాడనుండి దోసకాయ విడివడే విధంగా నాకీ దేహం నుండి విముక్తిని ప్రసాదించమని' ఆ ఆనంద స్వరూపుడైన శివుని అనుగ్రహానికై ప్రార్థించడమే ఇది. నిజానికి మనమంతా అనంతమైన, అఖండమైన పరిపూర్ణత్వం నుండి ఆవిష్కృతమైన వారమే. ఆ అఖండశక్తి లక్షణాలన్నీ మనలోనూ అంతర్నిహితమై ఉన్నాయి. కానీ, అహంకారమనే మాయ ఆవరించిన మనం, భగవత్ స్వరూపాన్ని గుర్తించలేక అజ్ఞానంలో మ్రగ్గిపోతున్నాం. 'పుష్టివర్ధనం' అనడం ద్వారా మనలో అంతర్గతంగా నిక్షిప్తమైఉన్న శక్తియుక్తులను వెలికితీసి అమృతస్థితిని చేరేందుకు సహకరించవలసిందిగా ఆ రుద్రుడిని ప్రార్థించడమే.

భారతీయ వేద సాహిత్యంలో 'శక్తిమంత్రం' అని ఒకటున్నది. దానిని సాధన చేయడం ద్వారా శరీరానికి, మనసుకున్న అన్ని క్లేశాలు, బలహీనతలు దూరమవుతాయని వేదపండితులు అంటారు. 'బలమే జీవనం, బలహీనతయే మరణం' అన్నారు స్వామి వివేకానంద. ఈ ప్రార్థనలలో భగవంతుడిని ఆత్మశక్తిగా, సంయమన శక్తిగా, శారీరక మానసిక శక్తులుగా, దివ్యశక్తిగా, ధైర్యశక్తిగా, సహనశక్తిగా భావిస్తూ ఆయా శక్తులను ప్రసాదించమని వేడుకొంటాం. ఫలితంగా ఒత్తిడులను సంభాళించుకునే శక్తిని పొందుతాం. ఐతే, ఈ విపత్కర పరిస్థితిలో కేవలం మంత్రాలను మాత్రమే నమ్ముకోకుండా, ప్రభుత్వ సూచనలను కూడా తు.చ. తప్పకుండా పాటించాలి. 'దుష్టులకు దూరముండాలి' అన్న మన ధార్మిక సిద్ధాంతానికి అనుకూలంగా 'సామాజిక దూరం' పాటిస్తూ, స్వీయ నియంత్రణలతో సురక్షిత జీవితం గడుపుదాం. సర్వేజనా సుఖినోభవంతు.

- పాలకుర్తి రామమూర్తి
సెల్: 94416 66943

శ్రీ ధన్వంతరి మంత్రం

ఓ నమో భగవతే మహాసుదర్శనాయ
వాసుదేవాయ ధన్వంతరయే
అమృత కలశ హస్తాయ సర్వభయ వినాశాయ
సర్వరోగ నివారణాయ త్రైలోక్యపతయే
త్రైలోక్యనిధయే శ్రీమహావిష్ణు స్వరూప
శ్రీధన్వంతరీ స్వరూప శ్రీశ్రీశ్రీ ఔషధ చక్ర
నారాయణాయ స్వాహా!

మృత్యుంజయ మంత్రం

ఓం త్రయంబకం యజామహే
సుగంధం పుష్టి వర్ధనం।
ఉర్వారికమివ బంధనాత్
మృత్యోర్ముక్షీయ మా మృతమ్॥

శక్తి మంత్రం

ఓం తేజోసి తేజోమయి దేహి।
వీర్యంసి వీర్యమ్ మయి దేహి।
బలమసి బలం మయి దేహి।
ఓజోసి ఓజోమయి దేహి।
మన్యురసి మన్యుం మయి దేహి।
సహోసి సహోమయి దేహి ఓం॥

సూర్య శ్లోకం

వాతాశ్మరీ గదార్శః త్వద్రోష మహోదర
గ్రహిణీ భగందరాఖ్యా
మహారుజోపిత్వ మేవహంసి॥

శ్రీ వైద్యనాథ స్తోత్రం

వాక్స్థోత నేత్రాంఘ్రి విహీన జంతోః
వాక్స్థోత నేత్రాంఘ్రి సుఖప్రదాయ
కుష్ఠాధి సర్వోన్నత రోగహంత్రే
శ్రీ వైద్యనాథాయ నమ:శివాయ॥

శ్రీ లలితాసహస్ర నామ నివారణ నామం

సర్వరోగ ప్రశమని।
సర్వవ్యాధి నివారిణి॥

శ్రీహరి శ్లోకం

అచ్యుతానంద గోవిందా
నామోచ్చారణ భేషజాత్
నశ్యంతి సకల రోగాః
సత్యం సత్యం వదామ్యహం॥

'అమృతత్వం' అంటే?

అశాశ్వతమైన శరీరం నుండి శాశ్వతమైన ఆత్మ విడిపోయి మరొక ఉపాధిని పొందడం మరణం. అలాగే, శాశ్వతమైన ఆత్మ ఈ జననమరణ చక్రబంధనాల నుండి శాశ్వతంగా విముక్తం కావడమే అమృతత్వం. ఈ సత్యాన్ని గుర్తించి ఆస్వాదించడమే అమృతత్వ సాధన. అందుకే 'అభ్యారోహ' మంత్రంలో 'అ సతోమా సద్గమయ, తమసో మా జ్యోతి ర్గమయ, మృత్యోర్మా అమృతం గమయ' అంటూ ప్రార్థిస్తాం. 'అవాస్తవిక స్థితినుండి వాస్తవిక స్థితికి చేర్చెదవుగాక. అజ్ఞాన చీకట్లనుండి జ్ఞానకాంతి వైపు నడిపించెదవుగాక. మరణం నుండి మరణం లేని స్థితికి చేర్చెదవుగాక'.

చిత్రం

పోలీసులే నిజమైన హీరోలు

విజయ్ దేవరకొండ

అగ్ర హీరో విజయ్ దేవరకొండ శనివారం రాష్ట్ర డీజీపీ కార్యాలయాన్ని సందర్శించారు. తెలుగు సినీ పరిశ్రమ తరపున రాష్ట్ర పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు. యావత్ తెలుగు చిత్ర పరిశ్రమ పోలీసుల పక్షాన ఉంటుందని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ మాత్రమే కాకుండా ప్రజలకు అవసరమయ్యే అత్యవసర సేవల్ని అందించడంలో..కరోనా చైన్‌ను బ్రేక్ చేయడంలో పోలీసుల కృషి అద్భుతమని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన ఓ వీడియో సందేశాన్ని అందించారు. 'ప్రస్తుతం నేను కోవిడ్ కంట్రోల్ రూమ్ నుంచి మాట్లాడుతున్నా. మేము స్క్రీన్ మీద మాత్రమే హీరోలం. కానీ మీరు (పోలీసులు) నిజమైన హీరోలు. లాక్‌డౌన్ ఇంకా పొడిగిస్తారో లేదో నాకు తెలియదు. కానీ మీరెప్పుడూ అలసిపోవద్దు. పోలీసులు మరింత స్ట్రాంగ్‌గా ఉంటూ సమాజాన్ని, మన రాష్ట్రాన్ని కాపాడాలి' అన్నారు.

కరోనాపై యుద్ధంలో గెలుస్తాం

కరోనా నియంత్రణ కోసం తెలంగాణ పోలీసులు నిరంతరం శ్రమిస్తున్నారని, లాక్‌డౌన్ నిర్ణయాన్ని సరైన సమయంలో తీసుకోవడం వల్ల దేశంలో కరోనా వ్యాప్తిని చాలా వరకు కట్టడి చేయగలిగామని చెప్పారు విజయ్ దేవరకొండ. తెలంగాణ డాక్టర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ సిటీ పోలీసులకు కరోనా ప్రొటెక్టివ్ మాస్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ పోలీస్ కమీషనర్ అంజనీ కుమార్, విజయ్ దేవరకొండ, దర్శకుడు శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ చేతుల మీదుగా పోలీసులకు మాస్కుల్ని అందజేశారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ 'లాక్‌డౌన్ అమలులో పోలీసుల హార్డ్‌వర్క్ లేకుంటే పరిస్థితులు అదుపుతప్పేవి. మన జనాభాతో పోల్చితే డాక్టర్లు, పోలీసుల నిష్పత్తి చాలా తక్కువ. అందుకే ప్రజలు వారిపై ఎక్కువగా ఒత్తిడి పెంచకూడదు. ఇంటికే పరిమితమై మన బాధ్యతను నెరవేర్చాలి. అప్పుడే పోలీసు, డాక్టర్లకు పనిభారం తగ్గుతుంది. కోట్లాదిమంది ప్రజలు ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా ఇంట్లోనే ఉంటూ కరోనా మహమ్మారిపై పోరాటం సాగిస్తున్నారు. వారందరికి ధన్యవాదాలు. అయితే కొందరు లాక్‌డౌన్‌ను బ్రేక్ చేస్తూ ఇబ్బంది కలిగిస్తున్నారు. కరోనా ప్రభావంతో ఎంతో మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు. వందల కిలోమీటర్లు నడిచి సొంత ఊర్లకు వెళ్లారు. వారి కష్టాలతో పోల్చుకుంటే మనం ఇంట్లో ఉండటం ఎంత సుఖమో ఆలోచించుకోండి. మన మంతా కలిసి కరోనాపై జరిగే యుద్ధంలో గెలుస్తామనే నమ్మకం ఉంది' అన్నారు.

'పుష్ప' చిత్రంలో అల్లు అర్జున్

రకుల్‌ప్రీత్‌సింగ్

నిస్వార్థ సేవకు సలామ్

వెంకటేష్

కరోనా నియంత్రణలో భాగంగా ప్రజలకు నిస్వార్థంగా సేవలందిస్తున్న డాక్టర్లు, పోలీసులకు సీనియర్ నటుడు వెంకటేష్ ట్విట్టర్ ద్వారా కృతజ్ఞతలు తెలిపారు. సంక్షుభిత పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలు కాపాడటానికి వారు చేస్తున్న సేవలు అసమానమైనవని ఆయన కొనియాడారు. 'కరోనాపై యుద్ధం చేస్తున్న డాక్టర్లు, పోలీసులే నేడు సమాజంలో సిసలైన హీరోలు. వారందరి నిస్వార్థ సేవకు సలామ్. ప్రజల ప్రాణాలను కాపాడటానికి మొక్కవోని అంకితభావంతో వారు చేస్తున్న కృషికి సదా కృతజ్ఞులుగా ఉందాం' అని అన్నారు.

రోజు 45వేల మందికి భోజనం

సోనూసూద్

కరోనాపై పోరులో ప్రభుత్వాలకు వివిధ రూపాల్లో మద్దతుగా నిలుస్తూ ప్రజల్లో స్ఫూర్తిని నింపుతున్నారు సినీ తారలు. కేవలం విరాళాల అందజేతకే పరిమితమైపోకుండా ఇతరత్రా మార్గాల ద్వారా తమ సహృదయతను చాటుకుంటున్నారు. బాలీవుడ్ నటుడు సోనూసూద్ ఇటీవలే ముంబయిలోని తన హోటల్‌ను కరోనా వ్యాధిగ్రస్తులకు సేవలందిస్తున్న వైద్యులకు వసతి గృహంగా కేటాయించిన విషయం తెలిసిందే. తాజాగా ఆయన మరో గొప్ప నిర్ణయంతో ఔదార్యాన్ని ప్రదర్శించారు. ముంబయిలోని అంధేరి, జోగేశ్వరి, జుహూ, బాంద్రాతో పాటు కొన్ని మురికివాడల్లో ప్రతిరోజు 45 వేల మందికి భోజనాన్ని అందించబోతున్నట్లు ప్రకటించారు. 'శక్తి అన్నదానం' పేరుతో ఈ బృహత్ కార్యక్రమాన్ని చేపట్టబోతున్నట్లు సోనూసూద్ ప్రకటించారు. 'ముంబయిలో అనేక మంది పేదలకు ప్రస్తుత పరిస్థితుల్లో ఉపాధి కరువైంది. దాంతో వారు ఆకలితో అలమటిస్తున్నారు. అలాంటి వారికి సహాయం చేసే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం చేపట్టాను. లాక్‌డౌన్ పూర్తయ్యే వరకు ఈ అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తాను' అని సోనూసూద్ పేర్కొన్నారు. ముంబయి మున్సిపల్ కార్పొరేషన్‌తో కలిసి ఆయన ఈ కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నారు.

సాయిధరమ్‌తేజ్, సాయిధరమ్‌తేజ్

పుకార్లను నమ్మొద్దు

సాయిధరమ్‌తేజ్ కథానాయకుడిగా దేవా కట్ట దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందనున్న విషయం తెలిసిందే. జె.బి.ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై జె.భగవాన్, జె.పుల్లారావు నిర్మిస్తున్నారు. ఇటీవలే లాంఛనంగా ప్రారంభించారు. ఈ సినిమాపై సోషల్ మీడియాలో వస్తోన్న పుకార్లపై నిర్మాతలు స్పందిస్తూ 'ఈ చిత్ర రెగ్యులర్ షూటింగ్ ఈ నెల 20 నుంచి మొదలుకావాల్సింది. కరోనా ప్రభావంతో షూటింగ్‌ను రద్దు చేసుకున్నాం. లాక్‌డౌన్ పూర్తయ్యాక సినిమా రెగ్యులర్ షూటింగ్ వివరాలు తెలియజేస్తాం. ఈ సినిమా తాలూకు తారాగణం , వారి పాత్రల గురించి సోషల్‌మీడియాలో పలు రకాలైన వార్తలు వినిపిస్తున్నాయి. ఆ పుకార్లను నమ్మొద్దు. సినిమా అధికారిక వివరాల్ని మేమే స్వయంగా ప్రకటిస్తాం' అన్నారు.

తమన్

జీవితాంతం గుర్తుంచుకుంటా!

అల్లు అర్జున్ కథానాయకుడిగా నటించిన 'అల వైకుంఠపురములో' సినీ గీతాలు సంగీత ప్రియుల్ని విశేషంగా అలరించిన విషయం తెలిసిందే. ముఖ్యంగా 'సామజవరగమన' 'రాములో రాములా' పాటలు యువతరంలో తిరుగులేని ప్రాచుర్యం పొందాయి. ప్రస్తుతం ఈ పాటల ఆల్బమ్ యూ ట్యూబ్‌లో 1.13 బిలియన్ వీక్షణలతో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా చిత్ర సంగీత దర్శకుడు తమన్‌కు ట్విట్టర్ ద్వారా కృతజ్ఞతలు తెలిపారు అల్లు అర్జున్. 'షూటింగ్‌కు ముందే బిలియన్ వ్యూస్ వచ్చే పాటలివ్వాలని అడిగా. తప్పకుండా అందిస్తానని ప్రామిస్ చేశారు. మీరు మాట నిలబెట్టుకున్నందుకు ఆనందంగా ఉంది' అని బన్నీ ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌ను ఓ మధుర జ్ఞాపకంగా జీవితాంతం గుర్తుంచుకుంటానని థమన్ రీట్వీట్‌లో ఆనందం వ్యక్తం చేశారు.

చిన్న సహాయమైనా చాలు..

సహాయం ఏ స్థాయిలో చేసినా అది సమాజంలో సానుకూల మార్పుకు దోహదం చేస్తుందని చెప్పింది పంజాబీ సొగసరి రకుల్‌ప్రీత్‌సింగ్. తన తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చిన్నతనం నుంచే సేవా భావాన్ని అలవర్చుకున్నానని, పద్దెనిమిదేళ్ల వయసులో తన తొలి సంపాదనను గురుద్వారాకు విరాళంగా ప్రకటించానని గుర్తుచేసింది. కరోనా ప్రభావంతో ఇబ్బందులు పడుతున్న పేదవారికి భోజన సౌకర్యం కల్పిస్తోంది రకుల్‌ప్రీత్‌సింగ్. ఢిల్లీ సమీపంలోని గురుగ్రామ్ మురికివాడలో ఉంటున్న 200 మందికి నెలరోజుల పాటు ఆహారాన్ని అందజేస్తున్నట్లు ఆమె పేర్కొంది. 'ప్రతి రోజు ఉదయంలోగా మా సొసైటీలో భోజనం సిద్ధమైపోతుంది. కొంతమంది స్వచ్ఛంద సేవకులతో కలిసి మా నాన్న ఆహారాన్ని పంచే బాధ్యతను తీసుకున్నారు. ఉదయం, సాయంత్రం రెండు పూటలా పేదలకు భోజనం అందేలా చూసుకుంటున్నాం. ఈ సమాజం నుంచే మనం డబ్బుని ఆర్జిస్తాం. కాబట్టి అదే సమాజానికి ఎంతో కొంత తిరిగి ఇవ్వాలన్నదే నా సిద్ధాంతం. చిన్నతనం నుంచే ఆ స్ఫూర్తిని అలవర్చుకున్నా. ఈరోజు నేను అనుభవిస్తున్న సౌకర్యాలకు దేవుడికి ఎప్పుడు కృతజ్ఞతగా ఉంటాను. చిన్న సహాయం చేసినా చాలు అది సమాజం పట్ల మన బాధ్యతను ప్రతిఫలిస్తుంది. ఈ లాక్‌డౌన్ సమయంలో ఫ్రెంచ్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ కోర్సులు నేర్చుకుంటున్నా' అని చెప్పింది రకుల్‌ప్రీత్‌సింగ్.

నా పేరు అమృతవర్షిణి. బీటెక్, ఎంబీఏ పూర్తి చేశా. అమెరికాలో సెటిల్ అయ్యాను. నేను కొద్ది రోజుల క్రితం కరీంనగర్‌లోని మా మమ్మీ దగ్గరికి వచ్చా. విదేశాలకు వెళ్లే విమానాలను రద్దు చేసిన విషయం తెలిసిందే. కొవిడ్-19 కట్టడిలో స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని పోలీసులు ఇచ్చిన పిలుపు మేరకు.. ఎనిమిది రోజులుగా నా సోదరి అమూల్యతో కలిసి కార్యకర్తగా పని చేస్తున్నా. పోలీసు అధికారులు కేటాయించిన ప్రాంతాలు కూరగాయల మార్కెట్లు, సూపర్ మార్కెట్ల వద్ద ప్రజలు సామాజిక దూరం పాటించేలా చైతన్యవంతుల్ని చేస్తున్నా. చేతులు శుభ్రం చేసుకోవడం గురించి వివరిస్తున్నా. ఒక విద్యావంతురాలిగా.. ఈ సేవలో నావంతు బాధ్యత నిర్వహిస్తున్న తీరు సంతృప్తినిస్తున్నది. పోలీసుల బాధ్యతల్లో భాగస్వామిని అయినందుకు గర్వంగా ఉన్నది.

కరీంనగర్ బస్‌స్టేషన్‌లో వాహనాల పార్కింగ్ వద్ద వలంటీర్లు

ఒకరు లెక్చరర్.. మరొకరు ఫిజియోథెరపిస్ట్.. ఇంకొకరు అడ్వొకేట్.. ఇలా ఎవరెవరికీ సంబంధం లేదు. కానీ, వీరందరిలో ఒక సామాజిక బాధ్యత ఉన్నది. కరోనా పేరు వింటేనే బయటకు రావడానికి జంకుతున్న ప్రస్తుత తరుణంలో ప్రజలకు అవగాహన కల్పించాలన్న తపన ఉన్నది. అందుకే పోలీసులు ఇచ్చిన అవకాశంతో వలంటీర్లుగా అవతారమెత్తారు. నిత్యం ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు విధులు నిర్వర్తిస్తూ, ప్రజలను చైతన్యం చేస్తున్నారు. వైరస్ నియంత్రణలో తమ వంతు సేవలందిస్తూ అలుపెరగకుండా శ్రమిస్తున్న పోలీస్‌శాఖ కాస్త భారం తగ్గిస్తున్నారు. **-కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ**

పోలీస్ వలంటీర్స్

నా పేరు సాయి మౌనిక. నేను ఫిజియోథెరపిస్టును. పది మందికి సేవచేయాలనే భావన నాది. కరీంనగర్‌లో కరోనా అలజడి సృష్టించిన సమయంలో.. ఎలాగైనా ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించుకున్నా. ఇలా పోలీసు శాఖ అవకాశం కల్పించింది. నిత్యం వివిధ ప్రాంతాల్లో స్వచ్ఛంద కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్నా. పోలీసులు ఎంతగా కష్టపడుతున్నారో కళ్లారా చూస్తున్నా. అందుకే వారి బాధ్యతల్లో నేను పాలు పంచుకుంటూనే.. ప్రజలకు పూర్తి స్థాయి అవగాహన కల్పిస్తున్న తీరు సంతృప్తినిస్తున్నది. విపత్కర పరిస్థితుల్లో యువత సేవలదించాలన్న స్ఫూర్తి నా ద్వారా కొంత మందిలోనైనా వస్తుందని భావిస్తున్నా.

- పోలీస్‌శాఖ పిలుపుతో కరోనా కట్టడికి కదిలిన యువతీయువకులు
- కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో 252 మంది సేవలు
- ప్రజల్లో చైతన్యం పెంపు కోసం ప్రయత్నం
- బహుళ ప్రయోజనాలను ఇస్తున్న ప్రయోగం

యువతకు ఆహ్వానం

గత నెల 14న ఇండోనేషియాకు చెందిన పది మంది మత ప్రచారకులు.. కరీంనగర్ రావడం.. వారికి కరోనా సోకడం.. దీంతో కరీంనగర్‌లో రెడ్‌అలర్ట్ ప్రకటించడం తెలిసిందే. ఆ తదుపరి దేశంలో, రాష్ట్రంలో జనతా కర్ఫ్యూ, లాక్‌డౌన్ అమలు చేస్తున్నారు. ఇదే సమయంలో కరోనా పాజిటివ్ వచ్చిన ప్రాంతాల్లో ఇతరులను గుర్తించడం.. వారిని క్వారంటైన్‌కు పంపడం.. మళ్లీ లాక్‌డౌన్‌ను పకడ్బందీగా అమలు చేయడం వంటి కార్యక్రమాల వల్ల పోలీసులపై భారం పెరిగింది. ఈ పరిస్థితుల్లో కరీంనగర్ పోలీస్ కమిషనర్ వీబీ కమలాసన్‌రెడ్డి కొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టారు. లాక్‌డౌన్‌లో భాగంగా ఉదయం నడుస్తున్న కూరగాయల మార్కెట్లు, సూపర్ మార్కెట్లు, మెడికల్ దుకాణాలు, ఇతర ప్రాంతాల్లో రద్దీని నియంత్రించి సామాజిక దూరం పాటించే విధంగా ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు ఔత్సాహిక యువతీ యువకులను భాగస్వాములను చేయాలని భావించారు. ఆ మేరకు.. కొవిడ్-19 నిర్మూలన, కట్టడి కోసం స్వచ్ఛందంగా సేవలందించేందుకు ముందుకు రావాలని యువతకు పిలుపునిచ్చారు. ఇదే ప్రకటన నగరపాలక సంస్థ సైతం చేసింది. దీంతో 252 మందికి పైగా యువతీ యువకులు స్వచ్ఛందంగా సేవలందించడానికి ముందుకొచ్చారు.

ప్రణాళికాబద్ధంగా సేవలు..

స్వచ్ఛందంగా సేవలందించడానికి ముందుకొచ్చిన వలంటీర్లకు ముందుగా ఒకరోజు శిక్షణ ఇచ్చారు. కరోనా కట్టడికి అనుసరించాల్సిన నియమ నిబంధనలు ఏమిటి?, కూరగాయల మార్కెట్లు, సూపర్ మార్కెట్లు, మెడికల్ షాపులు, పార్కింగ్ స్థలాల వద్ద వాహనాల క్రమబద్ధీకరణ, ఇతర వ్యాపార ప్రాంతాల్లోకి వచ్చే ప్రజలను ఎలా కట్టడి చేయాలి?, వారికి ఇవ్వాల్సిన సూచనలు, సలహాలు ఏమిటి?, సామాజిక దూరం పాటించేందుకు తీసుకోవాల్సిన చర్యలు వంటి అంశాలపై దిశానిర్దేశం చేశారు. శిక్షణ పొందిన వలంటీర్లకు ఒక ఐడీ కార్డు, విజిల్, టీషర్టులను అందించారు. లాక్‌డౌన్ పూర్తయిన తదుపరి వారి సేవలకు గుర్తింపుగా ప్రశంసా పత్రాలను ఇస్తామని చెప్పారు. ఆ మేరకు నగరంలోని వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పోలీస్ స్టేషన్లకు వలంటీర్లను కేటాయించారు. సంబంధిత ఠాణా పోలీసులు ప్రతి రోజూ వలంటీర్లకు వేర్వేరు ప్రాంతాల్లో డ్యూటీలు కేటాయిస్తున్నారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు అంటే నాలుగు గంటల పాటు వలంటీర్లు విధులు నిర్వహించి వెళ్లిపోతారు. స్వచ్ఛందంగా విధులు నిర్వహించే వలంటీర్లకు అల్పాహారాన్ని పోలీసులు ఉదయం సమకూర్చుతున్నారు.

బహుళ ప్రయోజనాలు

ఈ నెల 2 నుంచి అమలవుతున్న వలంటీర్ల సేవలతో ఇటు ప్రజలకు, అటు పోలీసులకు బహుళ ప్రయోజనాలు చేకూరుతున్నాయి. సేవలందించాలన్న లక్ష్యంతో వచ్చిన వలంటీర్లు వారికి కేటాయించిన ప్రాంతాల్లో దాదాపు పోలీసులకు సరిసమానంగా సేవలందిస్తున్నారు. ఆయా ప్రాంతాలకు వచ్చే ప్రజలు.. సామాజిక దూరం పాటించడం. క్యూ పద్ధతిలో వచ్చే విధంగా చర్యలు తీసుకోవడం.. కచ్చితంగా మాస్కులు, ఖర్చీఫ్‌లు ధరించేలా చూడడం.. మార్కెట్‌కు వచ్చిన వాహనాలను ఒక క్రమపద్ధతిలో పార్కింగ్ చేయించడం, వీటికి మించి కరోనా కట్టడి కోసం ఇంటితో పాటు బయటకు వెళ్లినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించడం.. ద్విచక్రవాహనంపై ఇద్దరు ప్రయాణించడాన్ని నిరోధించడం వంటి కార్యక్రమాలను చేస్తున్నారు. ఎక్కడైనా వలంటీర్ల చేతులు దాటే పరిస్థితి వస్తే పోలీసులకు సమాచారం అందిస్తున్నారు. వీరి సేవల వల్ల పోలీసులకు కొంత భారం తగ్గుతున్నది. ఇతర పనులపై దృష్టి పెట్టే సమయం దొరకుతున్నది. ప్రస్తుతం అందుతున్న వలంటీర్ల సేవలను భవిష్యత్‌లో ఏదేని అవసరం ఉన్నప్పుడు వాడుకోవచ్చన్న భరోసా ఏర్పడింది.

నాపేరు మౌనిక.. నేను కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నా. ప్రస్తుతం సెలవులున్నాయి. పోలీసులు ఇచ్చిన పిలుపు మేరకు.. నావంతు బాధ్యతను పోషించాలని భావించా. స్వచ్ఛంద కార్యకర్తగా నిత్యం పోలీసులు అలాట్ చేసిన ప్రాంతాల్లో డ్యూటీ చేస్తున్నా. నాతోపాటు నా భర్త కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ప్రభుత్వం.. చాలా అంశాల మీద ప్రచారం చేస్తున్నా. కొంత మందికి ఇంకా సామాజిక దూరం అంటే అర్థం కావడం లేదు. కరోనా కట్టడి కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన లేదు. ఇటువంటి వారికి మార్కెట్, లేదా ఇతర ప్రాంతాల వద్ద అవగాహన కల్పిస్తున్నాం. దండం పెట్టి చెబుతున్నాం. ఇది ఒక సామాజిక బాధ్యతగా చేస్తున్నా. పోలీసుల కష్టాలను, కరోనా కట్టడికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రజలకు వివరిస్తున్నా.

సేవలు అద్భుతం

కరోనా కట్టడిలో ప్రజలను భాగస్వాములను చేయాలన్న ఆలోచనతో వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటుకు నిర్ణయించాం. మేం ఊహించిన దానికన్నా చాలా మంది ఔత్సాహిక యువతీ, యువకులు సేవలందించడానికి ముందుకొచ్చారు. అంటే.. విపత్కర పరిస్థితుల్లో మన యువత స్వచ్ఛందంగా ప్రభుత్వం, అధికారులతో కలిసి సేవలందించడానికి ముందుకొస్తారని చెప్పడానికి ప్రస్తుతం వలంటీర్ల పనితీరు ఒక నిదర్శనం. స్వచ్ఛందంగా ముందుకొచ్చిన ప్రతి వలంటీర్‌కు ప్రత్యేక అభినందనలు. నిజానికి మేం అనుకున్న దానికన్నా సేవలు బాగా చేస్తున్నారు. వలంటీర్ల అందిస్తున్న సేవలపై ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తున్నది.

- వీబీ కమలాసన్‌రెడ్డి, కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ సీపీ

గర్వంగా ఉంది

కొవిడ్-19 నిర్మూలన కోసం ప్రజలకు సేవలందించే అవకాశం రావడం గర్వంగా ఉంది. నిత్యం నాలుగు గంటల పాటు సేవలందిస్తున్న నేను ఎన్నో అనుభవాలు నేర్చుకుంటున్నా. ప్రభుత్వం అనేక రకాల చర్యలు తీసుకుంటున్నా చాలా మందికి సామజిక దూరం పాటించాలనే అవగాహన రాలేదు. ఇటువంటి వారిని గుర్తించి వారికి అవగాహన కల్పిస్తున్నాం. విషయాన్ని అర్థం చేసుకుంటున్న ప్రజలు మాకు పరిపూర్ణంగా సహకరిస్తున్నారు. **- కొత్తకొండ అనిల్‌కుమార్, అడ్వొకేట్**



కమలాకర్.. వెరీగుడ్

- కేబినెట్ సమావేశంలో గంగులను అభినందించిన సీఎం
- కరీంనగర్‌లో కరోనా కట్టడికి బాగా పనిచేశారని కితాబు
- కలెక్టర్, సీపీ, మేయర్, కమిషనర్, వైద్యాధికారులు, సిబ్బందికి అభినందలు

కరీంనగర్ ప్రధాన ప్రతినిధి,నమస్తే తెలంగాణ : కరీంనగర్‌లో కరోనాను కట్టడి చేయడంలో బాగా పనిచేశారని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ అభినందించారు. హైదరాబాద్‌లో శనివారం జరిగిన రాష్ట్ర కేబినెట్ మీటింగ్‌లో వివిధ అంశాలపై సమీక్షించడంతోపాటు కరోనాపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ నేపథ్యంలో కరీంనగర్‌లో కరోనా కట్టడి కోసం తీసుకున్న చర్యలపై ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. విషయం తెలిసిన వెంటనే.. యుద్ధప్రాతిపదికన కమలాకర్ స్పందించారని సభాముఖంగా కితాబు ఇచ్చారు. అంతేకాదు, కొంత మంది వైద్య పరీక్షలకు ముందుకు రాని సమయంలో... స్వయంగా మంత్రి సదరు కాలనీలకు వెళ్లి.. సముదాయించిన తీరు హర్షణీయమని పేర్కొన్నారు. పరిస్థితి సీరియస్‌గా ఉన్న సమయంలో ఎవరైనా వెళ్లడానికి సంశయిస్తారని, కానీ, అందరినీ మెప్పించి వైద్య పరీక్షలు చేయించుకునేలా చైతన్యం చేసే విషయంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ''కమలాకర్.. వెరీగుడ్.. చాలా కీలకంగా పని చేశారు. అధికారులతో పనులు చేయిస్తూనే ప్రజలనుంచి మంచి సహకారం తీసుకున్నారు. యుద్ధ ప్రాతిపదికన 150 వైద్య బృందాలను ఏర్పాటు చేసి రాపిడ్ ఫీవర్ సర్వే చేయడం వల్ల మంచి ఫలితాలు వచ్చాయి. తద్వారా కట్టడి చేయడం సాధ్యమైంది' అంటూ అభినందించారు. ఇదేసమయంలో కరోనా కట్టడి కోసం కలెక్టర్ శశాంక, సీపీ కమలాసన్‌రెడ్డి, మేయర్ సునీల్‌రావు, కమిషనర్, వైద్యాధికారులు, ఇతర విభాగాల అధికారులు సమష్టిగా కృషిచేశారని వారందరికీ అభినందనలు తెలిపారు.

రుణ పడి ఉంటాం : మంత్రి గంగుల కమలాకర్

కరోనాను కట్టడి చేసిన విషయంలో జిల్లా యంత్రాంగంతో పాటు.. తనను ముఖ్యమంత్రి సాక్షాత్తూ కేబినెట్ మీటింగ్‌లో ప్రత్యేకంగా అభినందించడం చాలా సంతోషంగా ఉందని మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. కట్టడి కోసం అనేక సూచనలు, సలహాలు ఇచ్చారని, వారి ఆదేశానుసారం అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేశామని, తద్వారా.. కంట్రోల్ చేయగలిగామని మంత్రి పేర్కొన్నారు. కరోనా నివారణ కోసం చేపట్టిన చర్యలకు ప్రజలు సంపూర్ణంగా సహకరించారని, అందుకు ప్రజలకు ప్రత్యేక అభినందలు తెలుపుతున్నట్లు ఫోన్‌ద్వారా 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. అంతేకాదు, పూర్తి స్థాయిలో నివారణ అయ్యేవరకు ప్రజల సహకారం ఇలాగే ఉండాలని కోరారు. కలెక్టర్, సీపీ, ఇతర అధికారులు నిర్విరామంగా కష్టపడుతున్నారని, వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్టీపీసీ భారీ సాయం

కరోనా నివారణ చర్యల కోసం రూ.99.12లక్షల విరాళం

కలెక్టర్‌కు నగదు బదిలీ పత్రాన్ని అందజేస్తున్న ఎన్టీపీసీ సీఎస్సార్ ఏజీఎం

జ్యోతినగర్: కరోనా కట్టడికి ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపడుతుండగా, వెలుగుల మణిహారం రామగుండం ఎన్టీపీసీ తన తనవంతు బాధ్యతగా భారీ విరాళాన్ని ప్రకటించింది. సంస్థ సీఎస్ఆర్ (సామాజిక బాధ్యత పథకం) నిధుల నుంచి ₹99లక్షల 12వేల 640ను ఆన్‌లైన్ ద్వారా రెండురోజుల కింద కలెక్టర్ అకౌంట్లో జమ చేసి గొప్ప మనసు చాటుకున్నది. శనివారం సంబంధిత నగదు బదిలీ పత్రాన్ని ఎన్టీపీసీ సీఎస్సార్ ఏజీఎం రఫీక్ ఉల్ ఇస్లాం జిల్లా కేంద్రంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు అందజేశారు. ఈ నిధులతో పీపీఈలు, మాస్క్‌లు, గ్లౌజులు, శానిటైజర్లు, ఇతర పరికరాలను కొనుగోలు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

కరోనా నివారణకు 'వివిన్' రూ.25లక్షలు

కలెక్టర్‌కు రూ.25లక్షల చెక్కును అందజేస్తున్న మున్సిపల్ అధ్యక్షురాలు జిందం కళ

సిరిసిల్ల టౌన్: టీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి స్నేహితుడు వివిన్ డ్రగ్స్, ఫార్మాసుటికల్ చైర్మన్ బొట్ట పార్వతయ్య కరోనా నివారణ చర్యల కోసం రూ.25 లక్షలు మంత్రి కేటీఆర్‌కు అందజేశారు. కాగా, మంత్రి సూచనతో మున్సిపల్ అధ్యక్షురాలు జిందం కళతో కలిసి చక్రపాణి శనివారం కలెక్టర్‌కు చెక్కును అందించారు. పార్వతయ్య స్వచ్ఛందంగా సహకారం అందించడం అభినందనీయమని కలెక్టర్ కొనియాడారు.

నూతన వధూవరులు

అతిథుల్లేని పెళ్లి

- హాజరైంది ఇరువురి తల్లిదండ్రులు, పూజారే
- మంచి ముహూర్తం కావడంతో ఒక్కటైన జంట
- కరోనా జాగ్రత్తలు పాటిస్తూ మల్లారెడ్డిపేట ఆలయంలో వివాహ తంతు

గంభీరావుపేట : వందలాది మంది బంధువులు, అతిథుల నడుమ ఒక్కటి కావాల్సిన ఓ జంట, కరోనా కారణంగా ఇరువురి తల్లిదండ్రుల సమక్షంలోనే ఏడడుగులు వేసింది. ఎలాంటి హంగులు, ఆర్భాటాలు లేకుండానే ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ ఒక్కటైంది. వివరాల ప్రకారం.. రెండు నెలల క్రితమే మల్లారెడ్డిపేటకు చెందిన కందకూల అంజవ్వ, అంజయ్య దంపతుల కూతురు రమ్యకు కొత్తపల్లికి చెందిన శ్రీశైలంకు పెద్దలు పెళ్లి నిశ్చయించారు. ఏప్రిల్ 11న వివాహం జరిపించాలని అనుకున్నారు. చుట్టాలందరికీ చెప్పుకొని సంబురపడ్డారు. కానీ, అనుకోని పిడుగులా కరోనా కారణంగా లాక్‌డౌన్ అమల్లోకి రావడంతో నిరాశ చెందారు. 11న మంచి ముహూర్తం కావడంతో పెళ్లిని వాయిదా వేయలేకపోయారు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ శనివారం మల్లారెడ్డిపేట శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో పెళ్లి జరిపించారు. వధూవరులు, వారి తల్లిదండ్రులు, పూజారి మాస్కులు ధరించారు.

వలస కూలీల కోసం మంత్రి ఈశ్వర్‌కు డబ్బులు అందజేస్తున్న నాయకులు

మంత్రి కొప్పుల ఔదార్యం

- ముంబైలోని వలస కార్మికులకు ఆర్థిక భరోసా
- ఇప్పటివరకు ₹6,24,500 అందజేత
- లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్, ఆపద్బంధు చెక్కుల పంపిణీ

ధర్మపురి, నమస్తేతెలంగాణ/ధర్మపురి రూరల్/గొల్లపల్లి: ఉపాధి కోసం ముంబైకి వెళ్లి లాక్‌డౌన్‌తో అక్కడే చిక్కుకొని తీవ్ర ఇబ్బందులు పడుతున్న ధర్మపురి నియోజకవర్గానికి చెందిన వలస కార్మికులకు మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆపన్నహస్తం అందించారు. లాక్‌డౌన్ ఎత్తివేసే వరకూ నిత్యావసరాలు, బియ్యం కొనుగోలుకు అవసరమైన డబ్బులను మంత్రి ఫోన్ పే, గూగుల్ పే ద్వారా పంపిస్తున్నారు. ఇప్పటివరకు ₹6,24,500ను అందించారు. మంత్రి స్వయంగా ₹2.34లక్షలు పంపించగా, నాయకులు, అభిమానులు ₹2,60,500 అందజేశారు. శనివారం ధర్మపురి మండల నాయకులు మరో ₹లక్షా 30వేలను సేకరించి కరీంనగర్‌లో మంత్రికి అందించగా, ఆయన గుగూల్‌పే ద్వారా వలస కార్మికులకు పంపారు. ధర్మపురి మండలానికి చెందిన 15మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన ₹4.12లక్షల విలువైన చెక్కులను కరీంనగర్‌లోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి అందజేశారు. గొల్లపల్లి మండలం దట్నూరుకు చెందిన జక్కుల శ్రీనివాస్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందగా ఆపద్బంధు కింద మంజూరైన ₹5లక్షల చెక్కును బాధిత కుటుంబీకులకు మంత్రి అందించారు. ఆయా కార్యక్రమాల్లో డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీలు చిట్టిబాబు, నక్క శంకరయ్య, ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌కుమార్, వైస్ చైర్మన్ అక్కనపల్లి సునీల్‌కుమార్, వైస్ ఎంపీపీ గడ్డం మహిపాల్ రెడ్డి, తాసిల్దార్ నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

❖ స్టే హోం.. సేవ్ లైఫ్..

కరోనా చిత్రం వద్ద కళాకారుల బృందం

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి, ఐబీ చౌరస్తాల్లో కరోనా నమూనా చిత్రాన్ని 25 మంది కళాకారులు వేశారు. 'ఇంట్లోనే ఉండండి.. కరోనాను తరిమికొట్టండి' లాక్‌డౌన్ పాటిద్దాం. పోలీసులకు సహకరిద్దాం' అనే క్యాప్షన్లు పొందుపరిచారు. పోలీసుల సహకారంతో మంచిర్యాల చిత్రకళ ఆర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వేసిన ఈ చిత్రం అందరినీ ఆలోచింపజేస్తున్నది.

-మంచిర్యాల స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నమస్తే తెలంగాణ

ప్రతి గింజనూ కొంటాం..

■ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
■ గంగాధర, బోయినపల్లి మండలాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

బోయినపల్లి: కొదురుపాకలో ధాన్యం బస్తా తూకం వేస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

గంగాధర/బోయినపల్లి/ఇల్లంతకుంట: రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. గంగాధర మండలంలోని కాసారం, వెంకంపల్లి, గోపాల్‌రావుపల్లి, కొండన్నపల్లి, హిమ్మత్‌నగర్, ఆచంపల్లి, గర్శకుర్తి, ఉప్పరమల్యాల, మధురానగర్, నాగిరెడ్డిపూర్, బూరుగుపల్లి, బోయినపల్లి మండలం కొదురుపాక, రత్నంపేట, బోయినపల్లి, మర్లపేట, తడగొండ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయాచోట్ల ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలో దాదాపు 40 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారని పేర్కొన్నారు. కరోనా నేపథ్యంలో గ్రామానికో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి, రైతులు ఇబ్బంది పడకుండా కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. వల్లంపట్ల, వెల్జీపూర్, ఓగులాపూర్, గుడె ప్పల్లిలో కొనుగోలు కేంద్రాలను జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు ప్రారంభించారు. ఎంపీపీలు శ్రీరాం మధుకర్, పర్లపల్లి వేణుగోపాల్, వెంకటరమణారెడ్డి, గంగాధర జడ్పీటీసీ పుల్కం అనురాధ నర్సయ్య, ఏఎంసీ చైర్మన్ సాగి మహిపాల్‌రావు, సింగిల్ విండో చైర్మన్లు వెలిచాల తిర్మల్‌రావు, దూలం బాలగౌడ్, బోయినపల్లి ఎంపీడీవో నల్ల రాజేందర్‌రెడ్డి, ఏపీఎం నర్సయ్య పాల్గొన్నారు.

ఎంపీ స్వగ్రామంలో నాలుగో రోజూ అన్నదానం

కొదురుపాకలో అన్నం వడ్డిస్తున్న ఎంపీపీ వేణుగోపాల్, టీఆర్ఎస్ నాయకులు

బోయినపల్లి: వలస కూలీలకు భరోసా ఇవ్వాలని సీఎం కేసీఆర్ పిలుపు మేరకు ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ ముందుకు వచ్చారు. తన స్వగ్రామమైన కొదురుపాకలో వలస కూలీలకు అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. నిత్యం 200 మందికి అన్నదానం చేస్తున్నారు. శనివారం నాలుగో రోజూ అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, ఎంపీడీవో నల్ల రాజేందర్‌రెడ్డి, ఎస్ఐ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ కొనుకటి నాగయ్య,టీఆర్ఎస్ సీనియర్ నాయకులు కత్తెరపాక కొండయ్య, మాజీ ఎంపీటీసీ బొల్లవేణి భానుశ్రీ, టీఆర్ఎస్ నాయకులు బొల్లవేని తిరుపతి యాదవ్, అనుముల భాస్కర్, తదితరులు ఉన్నారు.

ఇంటింటికీ నిత్యావసరాలు

హాట్ స్పాట్ ప్రాంతాల్లో ఇంటింటికీ పంపిణీ చేసేందుకు కూరగాయల ప్యాకెట్ల తయారీని పరిశీలిస్తున్న ఆర్డీవో, మున్సిపల్ చైర్‌పర్సన్, పాలకవర్గ సభ్యులు

హుజూరాబాద్‌టౌన్: పట్టణంలోని కరోనా హాట్‌స్పాట్ కేంద్రాలైన కాకతీయకాలనీ, గాంధీనగర్, మామిండ్లవాడ, విద్యానగర్, సిద్ధార్థనగర్‌లో ఇంటింటికీ మున్సిపల్ అధికారులు, సిబ్బంది వెళ్లి వారానికి సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. ఆర్డీవో బెన్‌షాలోం, బల్దియా చైర్‌పర్సన్ గందె రాధిక, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, కమిషనర్ జోన, తాసిల్దార్ బావుసింగ్ పర్యవేక్షించారు. అనుమానితుల రక్తనమూనాలను డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌రెడ్డి, ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ రవిప్రవీణ్‌రెడ్డి సేకరించారు. పలువురు ఇండ్ల నుంచి బయటకు రావడాన్ని చూసి సీఐ మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు.

వైరస్ నియంత్రణకు చర్యలు

హైపోక్లోరైట్ ద్రావణాన్ని స్ప్రేచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మానకొండూర్: మండల కేంద్రంలో కరోనా వైరస్ నియంత్రణకు చర్యలు చేపట్టారు. సర్పంచ్ పృథ్వీరాజ్, జడ్పీటీసీ టీ శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో హైపోక్లోరైట్ ద్రావణాన్ని స్ప్రే చేశారు.

చెక్‌పోస్టుల పరిశీలన

సిరిసిల్ల రూరల్ : జిల్లెల్లలోని చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఆర్డీవో శ్రీనివాసరావు

సిరిసిల్ల రూరల్/రుద్రంగి: కరోనా కట్టడిలో భాగంగా జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద పకడ్బందీగా వ్యవహరిస్తున్నారు. శనివారం జిల్లెల్ల శివారులో చెక్ పోస్టును ఆర్డీవో శ్రీనివాసరావు, రుద్రంగి శివారులోని చెక్‌పోస్టును జడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డి పరిశీలించారు. పోలీసులు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని, లాక్‌డౌన్‌ను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు.

చిన్నారుల పెద్ద మనస్సు

నిరుపేదలకు నగదు ఇస్తున్న చిన్నారులు

ఎల్లారెడ్డిపేట: దాచుకున్న డబ్బులను నిరుపేదలకు పంచి చిన్నారులు పెద్ద మనస్సును చాటుకున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన పాటి వినోద-సురేందర్ దంపతుల పిల్లలు శృతి, సృజన్ (కవల పిల్లలు). వీరు గల్లగురిగిలో దాచుకున్న నగదును నిరుపేదలకు నిత్యావసరాలకు అందించారు. శనివారం గ్రామస్తుల సమక్షంలో ₹3,200 నగదను ఎనిమిది కుటుంబాలకు ఇచ్చారు.

శానిటైజర్స్ పంపిణీ చేస్తున్న డాక్టర్ బీఎన్‌రావు

పేదలకు దన్నుగా..

■ పెద్దసంఖ్యలో ముందుకొస్తున్న మానవతామూర్తులు

లాక్‌డౌన్‌తో ఉపాధి కోల్పోయిన పేదలు, కూలీలకు మానవతామూర్తులు దన్నుగా నిలుస్తున్నారు. తమకు తోచిన సాయం చేస్తూ, అక్కున చేర్చుకుంటున్నారు. ఇటు ప్రభుత్వం తరఫున వలస కూలీలకు బియ్యం, నగదు అందిస్తున్నారు.

కోనరావుపేట: మామిడిపల్లిలో నిరుపేదలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న పురుషోత్తమరావు

ఇంటింటికీ తిరిగి పేదలకు నిత్యావసర సరుకులు, డబ్బులు అందిస్తున్న మేయర్ వై సునీల్‌రావు

కరీంనగర్ జిల్లా..

కార్పొరేషన్, నమస్తేతెలంగాణ/ కరీంనగర్ హెల్త్/ మానకొండూర్/ హుజూరాబాద్‌టౌన్/ గంగాధర/ చిగురుమామిడి/ సైదాపూర్/ వీణవంక/ మానకొండూర్/ కరీంనగర్‌రూరల్ / తిమ్మాపూర్: కరీంనగర్ 33వ డివిజన్‌లోని 700 మంది పేదలకు ఒక్కొక్కరికి 10 కిలోల బియ్యం, ₹500 చొప్పున నగదును మేయర్ సునీల్‌రావు అందించారు. కరీంనగర్ లయన్స్‌క్లబ్ సభ్యులు చిదురు సురేశ్, ప్రసాద్, రమేశ్, శశిధర్, శ్రీనివాస్, 39వ డివిజన్ కార్పొరేటర్ కొండపల్లి సరిత-సతీశ్ విద్యానగర్‌లో సరుకులు పంపిణీ చేశారు. పోలీసులు, 108 సిబ్బంది, విద్యార్థులు, రెవెన్యూ సిబ్బందికి 'మేమున్నాం మీ కోసం' స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు నగునూరి రాజేందర్ భోజనం అందజేశారు. బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎన్నం ప్రకాశ్ 56వ డివిజన్‌లోని 18మంది పారిశుధ్య కార్మికులకు మాస్కులు, శానిటైజర్లు, పండ్లు పంపిణీ చేసి, సన్మానించారు. 37వ డివిజన్‌లో పేదలకు డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి, హరిశంకర్ బియ్యం పంచారు. స్థానిక సప్తగిరి సమైక్య సమితి సభ్యులు 30 మంది వలస కూలీలకు బియ్యంతోపాటు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఆదరణ సేవా సమితి ఆధ్వర్యంలో జ్యోతినగర్‌లో వలస కూలీలకు వంట సామగ్రి అందించారు. బొమ్మకల్‌లో నిరుపేదలకు సర్పంచ్ శ్రీనివాస్ బియ్యం పంపిణీ చేశారు. లక్ష్మీనగర్‌లో ఇండియన్ క్రిస్టియన్ మిషనరీ ఆధ్వర్యంలో బియ్యం బస్తాలు అందించారు. కరీంనగర్‌లోని ఝాన్సీ మెటర్నిటీ దవాఖానకు చెందిన వైద్యులు ఝాన్సీ లక్ష్మి, విజయలక్ష్మి శనివారం సీపీ కమలాసన్‌రెడ్డికి ఎన్-95 మాస్క్‌లు అందజేశారు. కట్టరాంపూర్‌కు చెందిన శ్రీ అభయ హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో అల్గునూర్‌లో వలస కూలీలకు కార్పొరేటర్ సల్ల శారద, రవీందర్ చేతుల మీదుగా నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఇందిరానగర్‌లో సర్పంచ్ కాటిక వినోద, ఎంపీటీసీ కొత్త తిరుపతిరెడ్డి, ఉపసర్పంచ్ దామ అనురాధ సరుకులు అందజేశారు. కొత్తపల్లిలో పారిశుధ్య కార్మికులకు పొన్నం సత్యనారాయణ బియ్యం బస్తాలు పంపిణీ చేశారు. బొమ్మకల్, దుర్శేడ్ గ్రామస్తులు, పారిశుధ్య కార్మికులకు డాక్టర్ బీఎన్‌రావు మాస్కులు అందజేశారు. రేకుర్తి సంతోష్‌నగర్ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీలు ₹15వేలతో 50 మంది గర్భిణులు, బాలింతలకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. మానకొండూర్‌లో పారిశుధ్య కార్మికులకు చాణక్య కర స్పాండెంట్ ఆడెపు రవీందర్ వితరణ చేసిన నిత్యావసరాలను సర్పంచ్ పృథ్వీరాజ్, సీఐ సంతోష్‌కుమార్ అందజేశారు. హుజూరాబాద్‌లోని 'వాల్ ఆఫ్ కైండ్‌నెస్' వద్ద పేదలకు ₹10వేల విలువైన నిత్యావసరాలను టౌన్ సీఐ మాధవి, ఆమె భర్త విజిలెన్స్ సీఐ మహేశ్, కుమారులు అందజేశారు. గంగాధర సర్పంచ్ గంగాధర్ ఇంటింటికీ సరుకులు, కూరగాయలు పంపిణీ చేశారు. కొత్తగట్టులో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇంటింటికీ నిత్యావసరాలు అందజేశారు. ముదిమాణిక్యంలో పచ్చిమట్ల ప్రవీణ్‌కుమార్‌గౌడ్ 600 కుటుంబాలకు 5 కిలోల చొప్పున కూరగాయలు పంపిణీ చేశారు. సైదాపూర్ మండలం బొమ్మకల్ అంబేద్కర్‌కాలనీలో రుద్రారపు ఐలయ్య, రుద్రారపు రమేశ్, కొంకట చిరంజీవి కూరగాయలు అందజేశారు. వీణవంక, రామకృష్ణాపూర్ ఎస్ఎఫ్ఐ నేత హరీశ్ ఆధ్వర్యంలో వలస కూలీలకు కూరగాయలు పంపిణీ చేశారు.

హుజూరాబాద్ టౌన్: నిరుపేదలకు నిత్యావసరాలను అందజేస్తున్న టౌన్ సీఐ మాధవి భర్త, విజిలెన్స్ సీఐ మహేశ్, వారి కుమారులు

రాజన్న సిరిసిల్ల జిల్లా..

వేములవాడ, నమస్తేతెలంగాణ/ కోనరావుపేట/ బోయినపల్లి/ సిరిసిల్ల టౌన్/ సిరిసిల్ల రూరల్/ ఎల్లారెడ్డిపేట: వేములవాడలో నిరుపేదలు, యాచకులకు ఉచితంగా భోజనం అందజేసేందుకు కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డికి ₹15వేల చెక్కును మిలీనియం ఫౌండేషన్ సభ్యులు ఆంజనేయులు, వినయ్‌కుమార్, అజయ్, అశ్విన్, కృష్ణమూర్తి, ప్రశాంత్, అజయ్, మహేందర్ అందజేశారు. మామిడిపల్లిలో 30నిరుపేద కుటుంబాలకు కిసాన్‌మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిరియాల పురుషోత్తమరావు నిత్యావసర సరుకులను అందజేశారు. నిజామాబాద్ గ్రామంలో ఆరుగురు పారిశుధ్య కార్మికులకు ఒక్కొక్కరికి ₹1,120 చొప్పున సర్పంచ్ కేతిరెడ్డి అరుణారెడ్డి, వైస్ఎంపీపీ వంగపల్లి సుమలత సమక్షంలో ఆరుగురికి రిటైర్డ్ డీఎస్పీ గోగూరి మోహన్‌రెడ్డి అందించారు. కొదురుపాకలోని వలస కూలీలకు ప్రభుత్వం మంజూరు చేసిన నిత్యావసర సరుకులను ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ పంపిణీ చేశారు. టీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు జక్కుల నాగరాజు చీర్లవంచలో హమాలీ కార్మికులకు మాస్కులను అందించారు. కర్త ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ కాలనీలో వలస కార్మికులకు బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని గీతానగర్ ఫ్రెండ్స్‌యూత్ ఆధ్వర్యంలో పోలీస్, పేదలకు అన్నం ప్యాకెట్లను అందజేశారు. పెద్దూరులో కౌన్సిలర్ సత్యనారాయణ ప్రజలకు మాస్కులు అందించగా, నరేన్ ఫౌండేషన్ సభ్యులు అన్నార్తులకు భోజనం అందజేశారు. గొల్లపల్లిలోని ఐదు నిరుపేద కుటుంబాలకు ఏఎస్ఐ శ్రీనివాస్, కానిస్టేబుల్ రాజశేఖర్ తలా పది కిలోల బియ్యం అందించారు. గొల్లపల్లికి చెందిన ఎండీ ఇర్ఫాన్, ఎండీ రజాక్ 12 కుటుంబాలకు, అందెసామియేల్ రెండు కుటుంబాలకు నిత్యావసరాలు ఇచ్చారు. బొప్పాపూర్‌కు చెందిన పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ బాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ హేమలత నెలకు సరిపడా బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. పోలీస్, మున్సిపల్, రెవెన్యూ సిబ్బందికి రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు సిరిసిల్లలో శానిటైజర్లు పంపిణీ చేశారు. కలెక్టర్, రూరల్ సీఐ సర్వర్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యను వారి కార్యాలయాల్లో కలిసి శానిటైజర్లను అందజేశారు. కౌన్సిలర్లు నీరజ, శైలు స్థానికులు, పారిశుధ్య కార్మికులకు నిత్యావసరాలు అందించారు.

సిరిసిల్ల రూరల్: చీర్లవంచలో హమాలీలకు మాస్కులను పంపిణీ చేస్తున్న నాగరాజు, లింగారెడ్డి

సిరిసిల్ల టౌన్: కమిషనర్ సమ్మయ్యకు శానిటైజర్లు అందజేస్తున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

వేములవాడ పట్టణంలోని జగిత్యాల బస్టాండ్ వద్ద డ్రోన్ కెమెరాతో పర్యవేక్షిస్తున్న ఎస్పీ

వేములవాడ : కంటైన్మెంట్ పరిధిలోని సుభాష్‌నగర్‌లో నిత్యావసర సరుకులను అందజేస్తున్న నాయకులు, మున్సిపల్ సిబ్బంది

పకడ్బందీగా కట్టడి

■ కంటైన్మెంట్ పరిధిలోని వేగంగా నివారణ చర్యలు
■ వైద్యసిబ్బంది అప్రమత్తం.. ఇంటింటికీ సర్వే
■ డ్రోన్లతో ఎస్పీ రాహుల్ హెగ్డే పర్యవేక్షణ
■ ఇళ్ల వద్దకే నిత్యావసర సరుకులు..
■ 1,500 కుటుంబాలకు ఉచితంగా పంపిణీ

ఇంటింటికీ సర్వేలో భాగంగా వివరాలను ఆరా తీస్తున్న సిబ్బంది

వేములవాడ, నమస్తేతెలంగాణ/ సిరిసిల్ల కైం/ కలెక్టరేట్: వేములవాడ పురపాలక సంఘం పరిధిలోని సుభాష్‌నగర్‌లో ఒకరికి శుక్రవారం కరోనా పాజిటివ్ రావడంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. వైరస్ వ్యాప్తి చెందకుండా ఉండేందుకు శనివారం కూడా పట్టణంలో పటిష్ట చర్యలు చేపట్టారు. తాజ్ హోటల్, సుభాష్‌నగర్ మసీదు, రాపెల్లి శ్రీధర్ వీధులు, బతుకమ్మ తెప్ప, సుభాష్‌నగర్, వినాయక, ఓల్డ్ మనోహర్ హాస్పిటల్, వాటర్‌ప్లాంట్, ఉప్పుగడ్డ హన్మాన్ టెంపుల్, ఓల్డ్ సిద్ధార్థ స్కూల్ పాయింట్ ప్రాంతాలను కంటైన్మెంట్ జోన్‌గా గుర్తించి, బారికేడ్లు ఏర్పాటు చేశారు. వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో 24/7 పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి, 94905-10308 నంబర్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇటు ప్రభావిత ప్రాంతాల నుంచి ప్రజలెవరూ బయటకు రాకుండా చూస్తున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు 1,500 కుటుంబాలకు నిత్యావసర సరుకులను తాసిల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఉచితంగా అందజేశారు. పాలు, కూరగాయలు, నీటిని కూడా సరఫరా చేశారు. కౌన్సిలర్లు అజయ్, నరాల శేఖర్, సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ మైక్ ద్వారా కరోనా కట్టడిపై విస్తృత ప్రచారం చేశారు.

ఇంటింటికీ సర్వే.

పట్టణంలో ఇంటింటికీ సర్వే చేస్తున్నారు. ఇప్పటికే 6,051 నివాసాల్లో ఆరోగ్య వివరాలను సేకరించారు. 9 మంది జలుబు, దగ్గుతో బాధపడుతున్నట్లు గుర్తించామని, కొవిడ్-19 లక్షణాలు లేనప్పటికీ హోంక్వారంటైన్ చేశామని, మరో వెయ్యి నివాసాలను కూడా ఆదివారం సర్వే చేస్తామని డీఎంఅండ్‌హెచ్‌వో చంద్రశేఖర్ వెల్లడించారు. ప్రభావిత ప్రాంతంలో 14 రోజులపాటు వైద్య పరీక్షలు చేస్తామని చెప్పారు. పాజిటివ్ వచ్చిన యువకుడితో ప్రాథమిక సంబంధాలు కలిగి ఉన్న 13 మందిని గుర్తించి ఐసోలేషన్ వార్డుకు తరలించామని, ఎవరికైనా జలుబు దగ్గు, జ్వరం లక్షణాలు ఉంటే అధికారులకు చెప్పాలని సూచించారు. ఆయన వెంట వైద్యాధికారులు సుమన్ మోహన్‌రావు, రేగుల పాటి మహేశ్‌రావు, కపిలసాయి, అనిల్ కుమార్, మీనాక్షి, మహేశ్ తదితరులు ఉన్నారు.

డ్రోన్‌తో పర్యవేక్షణ

జిల్లాలో లాక్‌డౌన్ అమలును ఎస్పీ రాహుల్‌హెగ్డే పకడ్బందీగా పర్యవేక్షిస్తున్నారు. శనివారం వేములవాడ పట్టణంలోని జగిత్యాల బస్టాండ్ వద్ద, సిరిసిల్లలోని అంబేద్కర్‌చౌరస్తా, గాంధీచౌరస్తా, కొత్త, పాత బస్టాండ్‌లతోపాటు ప్రధాన వీధులను డ్రోన్ కెమెరాతో పరిశీలించారు. కంటైన్మెంట్ ప్రాంతంగా గుర్తించిన సుభాష్‌నగర్ నుంచి ఎవరూ బయటకు రాకూడదని సూచించారు. అనవసరంగా రోడ్లపైకి వస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇకపై సిరిసిల్ల, వేములవాడ పట్టణాలోల డ్రోన్ కెమెరాలతో కూడా ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని, ప్రజలు గమనించాలని సూచించారు. ఆయన వెంట డీఎస్పీలు చంద్రకాంత్, చంద్రశేఖర్, సీఐలు శ్రీధర్, వెంకటనర్సయ్య, సర్వర్, ఎస్ఐలు అభిలాశ్, సుధాకర్ ఉన్నారు.

పటిష్ట చర్యలు: కలెక్టర్

కరోనా కట్టడికి వేములవాడలో పటిష్ట నివారణ చర్యలు అమలు చేస్తున్నట్లు కలెక్టర్ కృష్ణభాస్కర్ ఒక ప్రకటనలో వెల్లడించారు. పాజిటివ్ వచ్చిన వ్యక్తితో సన్నిహితంగా ఉన్న 28 మంది ప్రైమరీ కాంటాక్ట్ వ్యక్తులను గుర్తించి, వారిలో 12మందిని హైరిస్క్ వ్యక్తులుగా, 15 మందిని రిస్క్ వ్యక్తులుగా ప్రాథమికంగా నిర్ధారించి ఐసోలేషన్‌కు తరలించామని తెలిపారు.

రేకొండలో చోరీ..

చిగురుమామిడి: రేకొండలో రాత్రి ఏడు గంటల సమయంలో చోరీ జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..గాదె వెంకటేశ్వర్‌రావు శనివారం బయటికి వెళ్లగా, ఇంట్లో వృద్ధులైన తల్లిదండ్రులున్నారు. వారిద్దరూ ఆరుబయట కూర్చోగా ఇంటి వెనుక నుంచి దొంగలు చొరబడి 15 తులాల బంగారం, 18 తులాల వెండి, ₹25వేలు ఎత్తుకెళ్లారు. ఇంటికి వచ్చిన వెంకటేశ్వర్‌రావు చోరీ జరిగినట్లు గుర్తించి డయల్ 100కు ఫోన్ చేశాడు. ఎస్ఐ మధుకర్‌రెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించగా, అడిషనల్ సీపీ చంద్రమోహన్, కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయసారథి, తిమ్మాపూర్ సీఐ మహేశ్‌గౌడ్ అక్కడికి చేరుకొని జాగిలాలతో తనిఖీలు చేపట్టారు.

పూలేకు ఘన నివాళి

■ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జయంతి ■ పాల్గొన్న ఎమ్మెల్యే, కలెక్టర్లు

మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలను శనివారం ఉమ్మడి జిల్లాలో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

పూలే చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్లు శశాంక, కృష్ణభాస్కర్

కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ/కరీంనగర్ కార్పొరేషన్/ చొప్పదండి/ హుజూరాబాద్‌టౌన్/ తిమ్మాపూర్ /శంకరపట్నం/ జమ్మికుంట/ వీణవంక: కరీంనగర్ కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ శశాంక పూలే చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఇక్కడ డీఆర్వో పవన్‌కుమార్, వెనుకబడిన తరగతుల సహాయ సంక్షేమ అధికారి రాజ్‌మోహన్‌రావు, బీసీ సంక్షేమ శాఖ ఏఈ జయరాజ్, తదితరులున్నారు. రాంపూర్‌లోని పూలే విగ్రహానికి నగర మేయర్ సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి హరిశంకర్ పూలమాల వేశారు. జడ్పీ అధ్యక్షురాలు విజయ తన క్యాంపు కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. అల్గునూర్‌లో జంబుద్వీపం జన జాగృతి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. హుజూరాబాద్ బల్దియా కార్యాలయ ఆవరణలో పంజాల రాంశంకర్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక శ్రీనివాస్, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల శ్రీనివాస్ నివాళులర్పించారు. పూలే చిత్ర పటానికి శంకరపట్నం మండలం కన్నాపూర్ సర్పంచ్ కాటం వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ మోతె భాగ్యలక్ష్మి పూలమాలలు వేశారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్యాదాసి భాస్కర్ పాల్గొన్నారు. జమ్మికుంట తాసిల్ కార్యాలయంలో తాసిల్దార్, వీణవంక బస్టాండ్ ఆవరణలో పూలే చిత్రపటం వద్ద వివిధ సంఘాల నాయకులు నివాళులర్పించారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో..

సిరిసిల్ల, నమస్తే తెలంగాణ/బోయినపల్లి/ కలెక్టరేట్/ ఇల్లంతకుంట: జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ అంజయ్యతో కలిసి పూలే చిత్రపటానికి కలెక్టర్ కృష్ణభాస్కర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏవో గంగయ్య, జడ్పీసీఈవో గౌతంరెడ్డి, సువర్ణ కిరీటి, డీపీఆర్వో దశరథం ఉన్నారు. సిరిసిల్లలోని బీసీ భవన్‌లో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు, ఇల్లంతకుంటలో జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, ఎంపీపీ ఊట్కూరి వెంకటరమణారెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనాథ్‌గౌడ్, సర్పంచ్ భాగ్యలక్ష్మి నివాళులర్పించారు.

మహనీయుడు: సుంకె

బడుగు బలహీన వర్గాల ప్రజల్లో వెలుగులు నింపిన గొప్ప మహనీయుడు జ్యోతిబా పూలే అని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కొనియాడారు. చొప్పదండిలోని ఎమ్మెల్యే క్వార్టర్స్ ఆవరణ, మండల పరిషత్ కార్యాలయం, బోయినపల్లి మండలం మర్లపేటలో పూలే చిత్ర పటానికి పూల మాల వేసి, నివాళులర్పించారు. చైర్‌పర్సన్ గుర్రం నీరజ, సింగిల్‌విండో చైర్మన్ మల్లారెడ్డి, ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, ఎంపీడీవో నల్ల రాజేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

తిమ్మాపూర్, నమస్తేతెలంగాణ: ఎల్ఎండీకి ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎస్సారార్ జలాశయం స్లూయిస్ నుంచి రిజర్వాయర్‌లోకి 4,443 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తుండగా, 3309 క్యూసెక్కులు అవుట్‌ఫ్లో రూపంలో కాలువలకు విడుదల చేశామని, ఎల్ఎండీలో 6.855 టీఎంసీల నీటమట్టం ఉందని అధికారులు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

కార్పొరేషన్, నమస్తే తెలంగాణ: విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదివారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్ ఏడీఈ అంజయ్య తెలిపారు. 11కేవీ కలెక్టరేట్ కాంప్లెక్స్ ఫీడర్ పరిధిలోని ముకరంపుర, భగత్‌నగర్, ప్రతిమ మల్టీప్లెక్స్, కలెక్టరేట్, బస్టాండ్, వన్‌టౌన్ ఏరియాల్లో ఉదయం 7నుంచి ఉదయం 11 గంటల వరకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

రక్తదానం

కరీంనగర్ రూరల్: తలసేమియాతో బాధపడుతున్న వారికోసం ప్రతిమ వైద్య వైజ్ఞానిక సంస్థ ఉద్యోగులు రక్తదానం చేశారు. ప్రతిమ బయోమెడికల్ మేనేజర్, మెయింటనెన్స్ మేనేజర్ మల్లికార్జున్‌యాదవ్, దేవేందర్‌రావు ఆధ్వర్యంలో 16మంది సిబ్బంది రక్తదానం చేశారు. అదే దవాఖానలో చిన్నారి అశ్వత్‌కు ఏబీ పాజిటివ్ రక్తం అత్యవసరం కాగా, టీఆర్ఎస్ నాయకుడు పొన్నాల సతీశ్ రక్తం ఇచ్చారు.

రక్తదానం చేస్తున్న ప్రతిమ వైద్య సిబ్బంది

ఆత్మీయ పలకరింపుల్లో పాయిజన్ పిలుపినిపిస్తున్నది
కడుపుబ్బా నవ్విన ముఖంలో విష జలాల చినుకులు రొదపెడుతున్నయి
లంగ్ ట్రాక్‌తో లోపలపడ్డ కరోనా.. నిన్ను చెదలెక్కిస్తున్నది
గాలిని పీల్చినా బెలూన్ పెరగదు, గాలిని వదిలినా బెలూన్ తగ్గదు
కాటికి సిద్ధమైన దేహమే కళ్లలో కనిపిస్తది. - నర్రా ప్రవీణ్‌రెడ్డి

వాణిజ్య

వెన్‌కాబ్ చికెన్ ధరలు (రూ.)

ఫారం ధర	85.00	రిటైల్ లైవ్	107.00
డ్రెస్‌డ్	155.00	స్కిన్‌లెస్	177.00

గుడ్ల ధరలు (వందకు)

హైదరాబాద్	365.00	వరంగల్	368.00
మెదక్	365.00	కరీంనగర్	368.00
రంగారెడ్డి	365.00	డజన్ ధర	54.00

6-10 ప్యాకేజీ?

లక్షల కోట్ల

ఈ ఆర్థిక సంవత్సరం కోసం అదనపు ఉద్దీపనలు అవసరం: మెకిన్సే

హైదరాబాద్, ఏప్రిల్ 11: కరోనా వైరస్ దెబ్బకు కుదేలైన దేశ ఆర్థిక వ్యవస్థ తిరిగి కోలుకునేందుకు రూ.6 నుంచి 10 లక్షల కోట్ల స్థాయిలో అదనపు ఉద్దీపన ప్యాకేజీ అవసరమని గ్లోబల్ కన్సల్టింగ్ సంస్థ మెకిన్సే అభిప్రాయపడింది. ఈ మహమ్మారి అంతం కోసం దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ అమలవుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం దేశ జీడీపీ సుస్థిరత కోసం కనీసం రూ.6 లక్షల కోట్ల నుంచి 10 లక్షల కోట్ల అదనపు ఉద్దీపనల అవసరం ఉందని తాజా అధ్యయనంలో పేర్కొన్నది. కరోనా వైరస్ ప్రపంచ ఆర్థిక సంక్షోభానికి దారి తీసిన నేపథ్యంలో ఇప్పుడున్న పరిస్థితుల అంచనా, సమస్యల పరిష్కారంపై వివిధ రంగాల్లోని 100 సంస్థల విధానకర్తలు, మార్కెటింగ్ నిపుణులు, సీనియర్ ఆర్థికవేత్తల నుంచి అభిప్రాయాలను సేకరించింది. వీటి ఆధారంగా భారత ఆర్థిక వ్యవస్థ పురోగతికి మరిన్ని ఉద్దీపనలు అవసరమని మెకిన్సే పేర్కొన్నది. దేశంపై మూడు రకాల ప్రభావం ఉందని చెప్పింది.

ఎంఎస్‌ఎంఈలకు గండమే

కరోనా వైరస్ నేపథ్యంలో ఏర్పడిన విపత్కర ఆర్థిక పరిస్థితులు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల (ఎంఎస్‌ఎంఈ)కు గండంగా పరిణమించాయని మెకిన్సే సర్వేలో చాలామంది అభిప్రాయపడ్డారు. బ్యాంకింగ్ రంగంలో మొండి బకాయిలు (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ) పెరుగవచ్చన్న మెకిన్సే.. ఈ నెల 15కు లాక్‌డౌన్ ఎత్తివేస్తే దేశ వృద్ధిరేటు ఈ ఆర్థిక సంవత్సరం (2020-21) 1 నుంచి 2 శాతంగా నమోదు కావచ్చని, మే ప్రథమార్ధం వరకు ఉంటే -2 నుంచి -3 శాతానికి పతనం కావచ్చన్నది. దేశంలో ఎక్కువగా రోజు కూలీలు ఉన్నారని, వీరి భవితవ్యం అంధకారం కానుందన్న మెకిన్సే.. కొనుగోళ్ల సామర్థ్యం పెంచేలా భారీగా అన్ని రంగాలకు ఉద్దీపనల్ని ప్రకటిస్తే పరిస్థితులు మెరుగుపడవచ్చని చెప్పింది. విమానయాన రంగం తీవ్రంగా నష్టపోయిందని, ఐటీ అనుబంధ సేవలు, ఫార్మా, నిర్మాణ, బ్యాంకింగ్ రంగాలకూ ఇబ్బందేనన్నది.

ఉద్దీపనా ప్రపంచం

కరోనా వైరస్ ధాటికి అతలాకుతలమైన ఆర్థిక వ్యవస్థల్ని చక్కదిద్దేందుకు యావత్ ప్రపంచం ఉద్దీపనల బాట పట్టింది. అభివృద్ధి చెందిన దేశాలను సైతం ఈ మహమ్మారి కోలుకోలేని దెబ్బ తీస్తున్నది. దీంతో తమతమ ఆర్థిక వ్యవస్థల్ని కాపాడుకునేందుకు అగ్రరాజ్యాల నుంచి అభివృద్ధి చెందుతున్న దేశాల వరకు ఆర్థిక ప్యాకేజీలను ప్రకటిస్తున్నాయి. జీడీపీలో చెప్పుకోదగ్గ పరిమాణంలో ఈ ఉద్దీపనలు ఉంటున్నాయి. తద్వారా ఓ వైపు లాక్‌డౌన్‌తో ప్రజా రక్షణ.. మరోవైపు ఉద్దీపనలతో దేశ ఆర్థిక వ్యవస్థల్ని పరిరక్షించుకుంటున్నాయి.

అమెరికా
రూ.150 లక్షల కోట్లు
కరోనా దెబ్బకు చిగురుటాకులా వణికిపోతున్న అమెరికా 2 లక్షల కోట్ల డాలర్ల ఉద్దీపనల్ని ప్రకటించింది. ఇది ఆ దేశ జీడీపీలో 10 శాతానికి సమానం. మొదట్నుంచి ఆర్థిక నష్టాన్ని అరికట్టాలనే తలంపుతో ఉన్న ట్రంప్.. ఈ విషయంలో ఉదారంగా స్పందిస్తున్నారు.

జపాన్
రూ.75 లక్షల కోట్లు
కరోనా వైరస్ కాటునుంచి ఆర్థిక వ్యవస్థను కాపాడుకునేందుకు జపాన్ రూ.75 లక్షల కోట్ల ఉద్దీపన ప్యాకేజీని ప్రకటించింది. ఇది ఆ దేశ జీడీపీలో దాదాపు 20 శాతానికి సమానం కావడం విశేషం. పన్ను ప్రోత్సాహకాలు, వడ్డీలేని రుణాలందిస్తున్నారు.

బ్రిటన్
రూ.30 లక్షల కోట్లు
బ్రెగ్జిట్‌తో ఆర్థిక ఇబ్బందులనుఎదుర్కొంటున్న బ్రిటన్.. తమ ఆర్థిక వ్యవస్థను రక్షించుకోవడానికి 350 బిలియన్ యూరో ల ఉద్దీపనల్ని ప్రకటించింది. ఇది ఆ దేశ జీడీపీలో 15 శాతానికి సమానం.

సింగపూర్
రూ.4.5 లక్షల కోట్లు
ఈ వైరస్ నేపథ్యంలో తమ ఆర్థిక వ్యవస్థను రక్షించుకునేందుకు మూడు విడుతల్లో ఇప్పటిదాకా సుమారు 60 బిలియన్ డాలర్ల ఉద్దీపనల్ని ఆ దేశం ప్రకటించింది. ఇది ఆ దేశ జీడీపీలో 12 శాతానికి సమానం.

మారటోరియంపై సుప్రీంలో సవాల్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: కరోనా వైరస్ నేపథ్యంలో ఆర్బీఐ ప్రకటించిన 3 నెలల మారటోరియాన్ని సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో శనివారం పిటిషన్ దాఖలైంది. మార్చి 1 నుంచి మే 31 వరకు రుణాల ఈఎంఐలను వాయిదా వేసే అవకాశాన్ని బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు ఇస్తూ గత నెల రిజర్వ్ బ్యాంక్ ఓ సర్క్యులర్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ మారటోరియం వ్యవధిలోని వడ్డీపై బ్యాంకులు వడ్డీ వేస్తున్నాయని, దీనివల్ల రుణగ్రహీతలపై అదనపు భారం పడుతున్నదని పిటిషన్ పేర్కొన్నారు. రుణగ్రహీతలకు మేలుచేసే చర్యలు చేపట్టాల్సిదిగా ఆర్బీఐని ఆదేశించాలని కోరారు.

పోస్టల్ జీవిత బీమాదారులకు ఊరట

మార్చి-మే ప్రీమియం చెల్లింపుల గడువు పెంపు

- జూన్ 30 వరకు చార్జీలుండవు
- 3 కోట్ల మందికిపైగా లబ్ధి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: తపాలా శాఖ తమ జీవిత బీమా పాలసీదారులకు గొప్ప ఊరట నిచ్చింది. లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రీమియం చెల్లింపుల గడువును మూడు నెలలు పొడిగించింది. తపాలా జీవిత బీమా (పీఎల్ఐ), గ్రామీణ తపాలా జీవిత బీమా (ఆర్పీఎల్ఐ) పాలసీదారులు మార్చి, ఏప్రిల్, మే నెలల ప్రీమియంలను జూన్ 30 వరకు చెల్లించవచ్చని తెలిపింది. ఇందుకు ఎలాంటి జరిమానాలు, చార్జీలు ఉండబోవని శనివారం ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. దీంతో 3 కోట్ల మందికిపైగా లబ్ధి చేకూరింది. అధికారిక గణాంకాల ప్రకారం మార్చిలో 64.62 లక్షల

పీఎల్ఐ పాలసీలు, 2.5 కోట్ల ఆర్పీఎల్ఐ పాలసీలు మనుగడలో ఉన్నాయి.

మార్చి, ఏప్రిల్ ఎల్ఐసీ ప్రీమియంలపైనా..

కరోనా వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో మార్చి, ఏప్రిల్ నెలల్లోని ప్రీమియంల చెల్లింపు గడువును ఎల్ఐసీ 30 రోజులు పెంచింది. లాక్‌డౌన్ మధ్య పాలసీదారుల ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా సంస్థ ఈ నిర్ణయం తీసుకున్నది. ఉదాహరణకు ఫిబ్రవరి ప్రీమియంల చెల్లింపు గడువుకున్న గ్రేస్ పీరియడ్ మార్చి 22 తర్వాత కూడా ఉన్నట్లైతే అవి ఈ నెల 15 వరకు చెల్లించవచ్చని ఎల్ఐసీ శనివారం ప్రకటించింది. అలాగే ఆరోగ్య పరిస్థితులతో నిమిత్తం లేకుండా పాలసీలను ఆన్‌లైన్‌లో పునరుద్ధరించుకోవచ్చని, సర్వీస్ చార్జీ లేకుండా ఎల్ఐసీ డిజిటల్ పేమెంట్ సదుపాయాల ద్వారా ప్రీమియంలను చెల్లించుకోవచ్చని చెప్పింది. డిజిటల్ పేమెంట్స్ విధానాల ద్వారా ప్రీమియంలను చెల్లించవచ్చని వెల్లడించింది.

పిలిస్తే వస్తా..

కరోనాపై పోరులో దేశానికి సేవ చేస్తా: రఘురామ్ రాజన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: భారత్‌లో కరోనాపై పోరులో భాగస్వామి కావడానికి సిద్ధమేనని ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ స్పష్టం చేశారు. పిలిస్తే వస్తానన్నారు. ఈ మహమ్మారి నిర్మూలనకు దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ అమలవుతున్నది. ఈ క్రమంలో దేశ ఆర్థిక వ్యవస్థ బలహీనపడుతుండగా, తిరిగి ఉత్తేజపరుచడం ఓ సవాల్‌గా కనిపిస్తున్నది. అయితే మోదీ సర్కారు ఆహ్వానిస్తే దేశ ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దడానికి తన వంతు కృషి చేస్తానని ఎన్డీటీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో రాజన్ అన్నారు. మూడేండ్లు ఆర్బీఐ గవర్నర్‌గా పనిచేసిన ఆయన ఇప్పుడు వర్సిటీ ఆఫ్ బూత్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రొఫెసర్‌గా ఉన్నారు. 'అమెరికా, ఇటలీ తరహాలో భారత్‌లోనూ వైరస్ విజృంభిస్తే దాన్ని చాలాచాలా తీవ్రంగా పరిగణించాల్సి ఉంటుంది' అన్నారు. యావత్ ప్రపంచం మాంద్యం ఊబిలో కూరుకుపోతున్నదన్న ఆయన తగిన నిర్ణయాలు తీసుకుంటే వచ్చే ఏడాది కోలుకోవచ్చన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. భారత్ విషయానికొస్తే.. 'దేశంలో తరచూ కనిపించే సమస్యే విదేశీ మారకం. ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోల్చితే మన మారకం రేటు కొంత స్థిరంగానే ఉంటుంది. ఇందుకు ఆర్బీఐ సహకారం కూడా ఉన్నది. డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఇటీవలికాలంలో బాగానే పడిపోతున్నది. అయితే బ్రెజిల్ లాంటి దేశాల కరెన్సీలైతే 25 శాతం క్షీణించాయి. అలాంటి పరిస్థితి మనకు లేదు' అన్నారు.

Paytm
100 కోట్లు సేకరించిన పేటీఎం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: పీఎం-కేర్స్ ఫండ్ కోసం పేటీఎం రూ.100 కోట్లకుపైగా విరాళాలను సేకరించింది. కరోనా వైరస్ సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు తమ వంతుగా పీఎం-కేర్స్ ఫండ్‌కు రూ.500 కోట్ల నిధులను అందించడమే మా లక్ష్యమని పేటీఎం ఇదివరకే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే రూ.100 కోట్లకుపైగా విరాళాలను సేకరించామని శనివారం ఓ ప్రకటనలో వెల్లడించింది. వాలెట్, యూపీఐ లేదా పేటీఎం బ్యాంక్ డెబిట్ కార్డు ద్వారా పేటీఎంపై చేసే ప్రతీ విరాళానికి తమ వంతు సాయంగా రూ.10 జత చేస్తున్నామని పేర్కొన్నది. 1,200లకుపైగా ఉద్యోగులు 15 రోజులు, నెల, 2 నెలలు, 3 నెలల చొప్పున వేతనాలను విరాళంగా ఇస్తున్నట్లు చెప్పింది. మరోవైపు లుపిన్ కొవిడ్-19 సంక్షోభం నేపథ్యంలో తమ వంతు సాయంగా రూ.21 కోట్లను విరాళంగా ప్రకటించింది.

నెట్‌వర్క్ ఏదైనా.. సెట్‌టాప్ బాక్సు ఒక్కటే!

ఇంటరాపరబిలిటీని తప్పనిసరి చేయాలని ట్రాయ్ సిఫారసు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: కేబుల్ టీవీ, డీటీహెచ్ (డైరెక్ట్ టు హోం) వినియోగదారులకు శుభవార్త. ఇకపై కేబుల్ టీవీ, డీటీహెచ్ సర్వీస్ ప్రొవైడర్లు తమ వినియోగదారులకు అందజేసే సెట్‌టాప్ బాక్సులు తప్పనిసరిగా ఇంటరాపరబిలిటీ సపోర్ట్‌ను కలిగి ఉండాలని మార్కెట్ నియంత్రణా సంస్థ 'ట్రాయ్' (టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా) సిఫారసు చేసింది. సెట్‌టాప్ బాక్సుల్లో ఇంటరాపరబిలిటీ సపోర్ట్‌ను తప్పనిసరి చేసేందుకు అవసరమైన నిబంధనలను ప్రవేశపెట్టాలని ట్రాయ్ శనివారం సమాచార, ప్రసార మంత్రిత్వశాఖకు విజ్ఞప్తి చేసింది. వినియోగదారులు కొత్త సెట్‌టాప్ బాక్సును కొనుగోలు చేయకుండానే తమ సర్వీస్ ప్రొవైడర్‌ను మార్చుకొనేందుకు ఇంటరాపరబుల్ సెట్‌టాప్ బాక్సులు వీలుకల్పిస్తాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అన్ని డీటీహెచ్, కేబుల్ టీవీ నెట్‌వర్కులు తమ వినియోగదారులకు నాన్-ఇంటరాపరబుల్ సెట్‌టాప్ బాక్సులను అందజేస్తున్నాయి. ఒక నెట్‌వర్క్ నుంచి మరో నెట్‌వర్క్‌కు మారేందుకు నాన్-ఇంటరాపరబుల్ సెట్‌టాప్ బాక్సులు ఉపయోగపడవు. దీంతో వినియోగదారులు సర్వీస్ ప్రొవైడర్‌ను మార్చుకోవాలంటే కొత్త సెట్‌టాప్ బాక్సును కొనుగోలు చేయాల్సి వస్తున్నది.

0.2% మందిలోనే ఆ సత్తా!

ఐటీ ఉద్యోగుల వర్క్ ఫ్రం హోం సామర్థ్యంపై సర్వే

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించేందుకు ప్రస్తుతం అన్నిచోట్లా లాక్‌డౌన్లు విధించడంతో ఐటీ కంపెనీల ఉద్యోగులంతా వర్క్ ఫ్రం హోం నిర్వర్తిస్తున్నారు. కానీ వీరిలో చాలామంది పనితీరు సక్రమంగా లేదని, కేవలం 0.2 శాతం మంది మాత్రమే చక్కగా పనిచేస్తున్నారని ఓ అధ్యయనంలో వెల్లడైంది. మిగిలిన 99.8 శాతం మందికి ఇండ్ల నుంచి విధులు నిర్వర్తించే సామర్థ్యం లేదని 'సైకీ మైండ్ టెక్' అనే సంస్థ తన సర్వే నివేదికలో స్పష్టం చేసింది. ఇండ్ల నుంచి విధులు నిర్వర్తించలేకపోతున్నవారిలో చాలామంది కొత్తగా నేర్చుకోవడం, విశ్లేషణ (95% మంది), ప్రాక్టికల్ కమ్యూనికేషన్ నైపుణ్యాల కొరత (65% మంది), సరైన ప్రణాళిక లేకపోవడం (71%మంది).. ఇలా ఏదో ఒక అంశంలో వెనుకబడి ఉన్నట్టు ఈ సర్వేలో తేలింది. సవాళ్లను స్వీకరించేందుకు 16.97% మంది సిద్ధంగా ఉన్నారని, ఇలాంటివారికి చిన్నచిన్న సలహాలిస్తే సత్ఫలితాలుంటా యన్నది.

ఉద్యోగుల ఖాతాల్లోకి
పీఎంజీకేవై సాయం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 11: పీఎంజీకేవై కింద కేంద్ర ప్రభుత్వం ఇటీవల తన సామాజిక భద్రత పథకాలకు ప్రకటించిన ప్యాకేజీని ఉద్యోగులు, వారి యాజమాన్యాల ఈపీఎఫ్, ఈపీఎస్ ఖాతాల్లో జమచేసేందుకు ఈపీఎఫ్‌వో ఎలక్ట్రానిక్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో కేంద్రం నుంచి వచ్చే రూ.4,800 కోట్లతో దాదాపు 79 లక్షల మంది ఈపీఎఫ్ చందాదారుల తోపాటు 3.8 లక్షల సంస్థలకు లబ్ధి చేకూరుతున్నదని కేంద్ర కార్మికశాఖ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించింది.

తెలంగాణలో జియో హైస్పీడ్ నెట్

హైదరాబాద్, ఏప్రిల్ 11: తెలంగాణలోని తమ వినియోగదారులకు అత్యుత్తమ సేవ లందించేందుకు జియో ఫైబర్ నిరంతరం శ్రమిస్తున్నది. లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రస్తుతం చాలామంది ఉద్యోగులు తమ ఇండ్ల నుంచే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇలాంటివారికి హైస్పీడ్ ఇంటర్నెట్‌ను అందించేందుకు జియో ఫైబర్ అలుపెరుగకుండా కృషిచేస్తున్నది. హైదరాబాద్‌తోపాటు హన్మకొండ, వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, కోదాడ, మహబూబ్‌నగర్, నల్లగొండలోని రెసిడెన్షియల్ ప్రాంతాల్లో సెకనుకు 1 గిగా బైట్ వేగంతో హైస్పీడ్ ఇంటర్నెట్‌ను అందిస్తున్నది. 100 ఎంబీపీఎస్ మొదలుకొని 1 జీబీపీఎస్ వేగంతో ఇంటర్నెట్‌ను అం దిస్తుండటంతో ఎంతోమంది ఉద్యోగులు, విద్యార్థులతోపాటు అనేక చిన్న, పెద్ద సంస్థలు కూడా లబ్ధి పొందుతున్నాయి. ప్రస్తుతం డాటా వినియోగం రోజురోజుకూ గణనీయంగా పెరుగుతుండటంతో జియో 'స్టే కనెక్టెడ్, స్టే ప్రొడక్టివ్' ఆఫర్‌ను తీసుకొచ్చింది. ఈ ఆఫర్ కింద జియో తమ వినియోగదారులకు అన్ని ప్లాన్లపై డబుల్ డాటా ను అందజేస్తున్నది. మరోవైపు కొత్త వినియోగదారులకు ఉచిత కనెక్టివిటీతో 100 జీబీ డాటాను 10 ఎంబీపీఎస్ వేగంతో అందిస్తున్నది.

ఆట

మూడు సిక్సర్లు బాదితే.. రెండు బంతులు పోయాయి

న్యూజిలాండ్‌పై మెరుపు సెంచరీని గుర్తుచేసుకున్న అజారుద్దీన్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ క్రికెట్‌లో ఎన్ని సెంచరీలు చేసినా.. న్యూజిలాండ్‌పై కొట్టిన మెరుపు శతకమే తనకు ఎప్పటికీ గుర్తుంటుందని భారత మాజీ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్ పేర్కొన్నాడు. 'నా కెరీర్‌లో దాదాపు 30 సెంచరీలు చేశా. అందులో 10-12 కన్నా ఎక్కువ గుర్తులేవు. న్యూజిలాండ్‌పై మెరుపు శతకం బాది 31 ఏండ్లైనా అది నా మదిలో ఇప్పటికీ తాజాగా ఉంది' అని అజ్జూభాయ్ అన్నాడు. 1988 డిసెంబర్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన నాలుగో వన్డేలో అజార్ 62 బంతుల్లోనే సెంచరీ కొట్టాడు. ఆ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన కివీస్ 3 వికెట్లకు 278 పరుగులు చేయగా.. లక్ష్యఛేదనలో ఆరోస్థానంలో బరిలో దిగిన అజార్ (65 బంతుల్లో 108 నాటౌట్; 10 ఫోర్లు, 3 సిక్సర్లు) అజేయ శతకంతో జట్టుకు విజయాన్నందించాడు. 'అప్పట్లో 279 పరుగుల ఛేదన అంటే ఇప్పుడు 340తో సమానం. ఆ మ్యాచ్‌లో మూడు సిక్సర్లు బాదినట్లు గుర్తు. అందులో రెండు బంతులు గ్రౌండ్ బయటపడ్డాయి' అని మూడు దశాబ్దాల క్రితం జ్ఞాపకాలను అజార్ గుర్తుచేసుకున్నాడు.



'మూడేండ్లు ఇంటికే రాను'

న్యూఢిల్లీ: లాక్‌డౌన్ ఎత్తేశాక మూడేండ్ల పాటు ఇంటికి రాకుండా గ్రౌండ్‌లోనే ఉంటానని టీమ్‌ఇండియా స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ అంటున్నాడు. కరోనా వైరస్ మహమ్మారి కారణంగా విధించిన సుదీర్ఘ లాక్‌డౌన్‌తో ఇంటికే పరిమితమైన చాహల్.. క్రికెట్‌కు దూరంగా ఉండటం చాలా కష్టంగా ఉందన్నాడు. 'లాక్‌డౌన్ ఎత్తేయగానే బయటపడతా. మూడేండ్లకు సరిపడా ఇంట్లో ఉన్నా.. ఇక మైదానంలోనే ఉంటా' అని చాహల్ అన్నాడు.

'ధోనీ.. తరానికొక్కడు'

ముంబై: టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీలాంటి వాళ్లు తరానికి ఒకరే వస్తారని.. అలాంటి ఆటగాడి రిటైర్మెంట్ గురించి పదేపదే చర్చించడం సబబు కాదని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ నాసిర్ హుసేన్ అన్నాడు. మాటిమాటికి ఈ విషయం గురించి చర్చిస్తే.. అది మహీపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నాడు.

లిఫ్టింగ్‌కు లాక్

కొవిడ్-19తో ఇంట్లోనే సాధన

నమస్తే తెలంగాణతో యువ లిఫ్టర్ ఎర్ర దీక్షిత

బంధువులను చూసొద్దాం అని బయలుదేరి.. లాక్‌డౌన్ ప్రకటనతో లాక్ అయిపోయానని తెలంగాణ యువ వెయిట్ లిఫ్టర్ ఎర్ర దీక్షిత అంటున్నది. టోర్నమెంట్‌లేవీ లేకపోవడంతో మార్చి 19న మహబూబాబాద్ చేరిన దీక్షిత.. ఇరవై రోజులుగా అక్కడే ఉండిపోయింది. ప్రాక్టీస్‌కు తగిన ఉపకరణాలు లేకపోవడంతో.. ఉదయం, సాయంత్రం వ్యాయామాలతో సరిపెట్టుకుంటున్న ఈ మానుకోట మాణిక్యం.. జాతీయ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం నెగ్గడమే తన లక్ష్యమని అంటున్నది. కరోనా వైరస్ మహమ్మారి విజృంభిస్తున్న తరుణంలో ఇంటికే పరిమితమైన దీక్షిత చెప్పిన వివరాలు ఆమె మాటల్లోనే..

నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:

ఊహించని విపత్తు కారణంగా ప్రపంచం స్తంభించినట్లుంది. గత నెలలో ప్రాక్టీస్ పక్కన పెట్టి సొంత పట్టణమైన మహబూబాబాద్‌కు వచ్చా. ఆ తర్వాత కోవిడ్-19 కారణంగా దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించారు. దీంతో ప్రస్తుతం ఇంటికే పరిమితమయ్యా. ప్రాక్టీస్ చేసేందుకు సరైన సదుపాయాలు లేకపోవడంతో.. చిన్న, చిన్న వ్యాయామాలతో పాటు.. యోగా చేస్తున్నా. శరీర దారుఢ్యాన్ని కాపాడుకునేందుకు అవసరమైన ఎక్సర్‌సైజ్‌లతో పాటు కండరాలు పట్టేయకుండా షటిల్ ఆడుతున్నా.

మరింత మెరుగయ్యేందుకు

అక్టోబర్‌లో జరుగనున్న జాతీయ క్రీడల్లో స్వర్ణం సాధించడమే నా ముందున్న లక్ష్యం. ప్రస్తుతం 59 కేజీల విభాగంలో బరిలో దిగుతున్నా. స్నాచ్‌లో 88 కేజీలు, క్లీన్ అండ్ జెర్క్ కేటగిరీలో 115 కేజీలతో మొత్తం 203 కిలోల బరువెత్తగలుగుతున్నా.. దీన్ని మరింత పెంచుకోవడంపై దృష్టిపెట్టా. హైదరాబాద్‌లోని రైల్వే గ్రౌండ్‌లో వెయిట్ లిఫ్టింగ్ కోచ్ బాషా వద్ద ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నా. ప్రతిరోజూ ట్రైనర్ నాకు వాట్సాప్ ద్వారా సూచనలు ఇస్తూనే ఉన్నారు. ఆయన పంపిన షెడ్యూల్ ప్రకారమే ప్రాక్టీస్ సాగిస్తున్నా.

కుటుంబసభ్యులతో సరదాగా క్యారమ్స్ అడుతున్న దీక్షిత

మామయ్య ప్రోత్సాహంతోనే..

తొమ్మిదేండ్ల వయసులో నాలో ఓ అథ్లెట్ దాగుందని గుర్తించిన మామయ్య శ్రీనివాస్.. అమ్మానాన్న (వినోద, కేశవరావు)లను ఒప్పించి గ్రౌండ్‌కు తీసుకెళ్లారు. పదమూడేండ్లప్పుడు నేను లిఫ్టింగ్ వైపు అడుగులు వేశా. అప్పటి నుంచి క్రమక్రమంగా బరువు పెంచుకుంటూ.. ప్రస్తుతం నా కేటగిరీలో జాతీయ చాంపియన్‌గా ఎదిగా. ఖాళీ సమయంలో టీవీ చూడటం, క్యారమ్స్ ఆడటంతో పాటు పుస్తకాలు చదువుతున్నా. తమిళ నటుడు సూర్య అంటే చాలా ఇష్టం. ప్రైమ్ వీడియోస్‌లో సింగం సిరీస్ మొత్తం చూశా. వీటన్నింటితో పాటు అప్పుడప్పుడూ చెట్లకు నీళ్లు పట్టడం, వంటలో అమ్మకు సాయంచేయడం వంటి పనులు చేస్తున్నా. ప్రస్తుతం ఎక్కడ చూసినా కరోనా వైరస్ వ్యాప్తి గురించే చర్చ జరుగుతున్నది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో.. సామాజిక దూరం పాటిస్తూ.. ఇంటికే పరిమితమవడం మంచిది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న పకడ్బందీ చర్యలతో త్వరలోనే తిరిగి మామూలు పరిస్థితులు నెలకొంటాయని ఆశిస్తున్నా.

వెటరన్ క్రికెటర్ సురేశ్ రైనా శనివారం కొత్త లుక్‌తో దర్శనమిచ్చాడు. లాక్‌డౌన్‌లో పెరిగిన జట్టుతో ఇబ్బంది పడుతున్న తనకు.. భార్య ప్రియాంక కటింగ్ చేసిందని పేర్కొన్నాడు

జాన్‌రైట్ వల్లే

- పాండ్యా బ్రదర్స్ ఫ్లాష్‌బ్యాక్

ముంబై: టీమ్‌ఇండియా మాజీ కోచ్ జాన్ రైట్ వల్లే తమ ప్రతిభ వెలుగులోకి వచ్చిందని పాండ్యా బ్రదర్స్ అంటున్నారు. కెరీర్ ఆరంభ రోజులను గుర్తుచేసుకున్న కృనాల్ పాండ్యా.. 'అప్పట్లో ముస్తాక్ అలీ టోర్నీ కోసం ట్రయల్స్ నడుస్తున్నాయి. అదే సమయంలో నాకు ప్రభుత్వం ఉద్యోగం వచ్చినట్లు ఓ ఉత్తరం వచ్చింది. అది చూసిన మా నాన్న.. ఇది మంచి చాన్స్ అని అన్నారు. కానీ నేను దాన్ని చించేసి ట్రయల్స్‌కు హాజరై జట్టుకు ఎంపికయ్యా. అప్పటికే హార్దిక్ ఆ జట్టులో ఉన్నాడు. ఆ టోర్నీలో మా ఆటతీరు గుర్తించిన అప్పటి ముంబై కోచ్ జాన్ రైట్.. మా ఇద్దరిని ముంబై ఇండియన్స్ జట్టుకు ఎంపిక చేయడంతో మా తలరాత మారిపోయింది' అని కృనాల్ అన్నాడు.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com

నమస్తే తెలంగాణ
నిపుణ
[హైదరాబాద్]
ఆదివారం 12 ఏప్రిల్ 2020

భారత రక్షణ దళాల్లో మూడు వేటికవే సాటి. వీటిలో జాబ్స్ అంటే ఫుల్ క్రేజీ. బాలాకోట్ సంఘటన తర్వాత దేశమంతా వాయుసేన వీరత్వాన్ని మరింతగా చవిచూసింది. అలాంటి చాలెంజింగ్ కెరీర్‌కు పేరుగాంచిన ఎయిర్‌ఫోర్స్‌లో ఇంటర్‌తో ఉద్యోగావకాశాలు ఉన్నాయి. ఏటా ఎయిర్‌మెన్ సెలక్షన్స్‌తో వందలాది పోస్టులను ఎయిర్‌ఫోర్స్ భర్తీ చేస్తుంది. సాధారణంగా ఈ రిక్రూట్‌మెంట్‌ను స్టార్, ర్యాలీ పద్ధతుల్లో భర్తీ చేస్తారు. ఈ సెలక్షన్స్ ద్వారా చిన్న వయసులోనే భద్రమైన కొలువుతోపాటు మంచి జీతం అందుకోవచ్చు. ఉన్నతస్థాయి పదోన్నతులను పొందవచ్చు. దేశ సేవ చేయడానికి అపూర్వ అవకాశం. ఎయిర్‌మెన్ పోస్టుల గురించి ప్రత్యేక కథనం..

వాయుపుత్రులు

ఇంటర్‌తో ఎయిర్‌ఫోర్స్ కొలువులు

- **ఎయిర్‌ఫోర్స్:** రక్షణ దళాల్లో వాయుసేన ఒకటి. 1932, అక్టోబర్ 8న భారత వాయుసేన ప్రారంభమైంది. 1950లో పూర్తిస్థాయిలో భారత ప్రభుత్వం పరిధిలోకి వచ్చింది. తర్వాతి కాలంలో క్రమక్రమంగా ఎదిగి నేడు ప్రపంచంలో ఉత్తమమైన వాయుబలగాల్లో భారత్ ఒకటిగా నిలిచింది.
- **సీఏఎస్‌బీ:** సెంట్రల్ ఎయిర్‌మెన్ సెలక్షన్ బోర్డు (సీఏఎస్‌బీ). దీన్ని మే 1980లో న్యూఢిల్లీలో ప్రారంభించారు. ఎయిర్‌ఫోర్స్ ప్రధానకేంద్రం పరిధిలో ఇది పని చేస్తుంది. ఆ తర్వాత 1996లో దీన్ని బరార్ స్క్వేర్‌కు తరలించారు.
- **విధులు:** ఇది ఎయిర్‌మెన్ ఎంపిక ప్రక్రియను పూర్తిగా నిర్వహిస్తుంది. అభ్యర్థుల ఎంపిక కోసం ప్రత్యేక డ్రైవ్‌లను ఏర్పాటు చేయడం, ప్రశ్నపత్రాలను రూపొందించడం, పరీక్ష నిర్వహణ, అభ్యర్థుల ఎంపిక చేస్తుంది.
- **ఎయిర్‌మెన్:** ఎయిర్‌మెన్ పోస్టుల్లో రెండురకాలు ఉంటాయి. అవి ఒకటి గ్రూప్ ఎక్స్. రెండోది గ్రూప్ వై.
- **గ్రూప్ ఎక్స్:** ఇది రెండు రకాలు. ఒకటి టెక్నికల్, రెండోది నాన్ టెక్నికల్.
- టెక్నికల్ పోస్టులు- ఆటోమొబైల్ ఫిట్టర్, ఎలక్ట్రానిక్స్ ఫిట్టర్, ఎలక్ట్రికల్ ఫిట్టర్, మెకానికల్ సిస్టమ్ ఫిట్టర్, స్ట్రక్చర్స్ ఫిట్టర్, ప్రొపల్షన్ ఫిట్టర్, వర్క్‌షాప్ ఫిట్టర్ (స్మిత్), వర్క్‌షాప్ ఫిట్టర్ (మెకానికల్), వెపన్ ఫిట్టర్.
- **నాన్ టెక్నికల్ పోస్టు:** ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్టర్
- **గ్రూప్ వై:** ఇది రెండు రకాలు. ఒకటి టెక్నికల్, రెండు నాన్ టెక్నికల్.
- **టెక్నికల్:** కమ్యూనికేషన్ టెక్నీషియన్, ఆటోమొబైల్ టెక్నీషియన్
- **నాన్ టెక్నికల్:** అడ్మిన్ అసిస్టెంట్, అకౌంట్స్ అసిస్టెంట్, లాజిస్టిక్స్ అసిస్టెంట్, ఎన్విరాన్‌మెంట్ సపోర్ట్ సర్వీసెస్ అసిస్టెంట్, ఆపరేషన్స్ అసిస్టెంట్, గ్రౌండ్ ట్రెయినింగ్ అసిస్టెంట్, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ (పోలీస్), ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ (సెక్యూరిటీ), మ్యూజీషియన్.

అర్హతలు

- **గ్రూప్ - ఎక్స్:** ఈ ఉద్యోగాలకు మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్‌లతో ఇంటర్ /ప్లస్ 2 కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఇంగ్లిష్‌లో 50 శాతం మార్కులు తప్పనిసరి. లేదా 50 శాతం మార్కులతో ఏదైనా మూడేండ్ల డిప్లొమా కోర్సు పూర్తిచేసినవారు అర్హులు. డిప్లొమాలోని ఇంగ్లిష్ సబ్జెక్టులో 50 శాతం మార్కులు తప్పనిసరి. డిప్లొమాలో ఇంగ్లిష్ సబ్జెక్టు లేకపోతే ఇంటర్ లేదా పదోతరగతి ఇంగ్లిష్‌లో కనీసం 50 శాతం మార్కులు వచ్చి ఉండాలి.అవివాహిత పురుష అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

గ్రూప్ ఎక్స్ (ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్టర్ ట్రేడ్)

- **వయస్సు:** 20 -25 ఏండ్ల మధ్య ఉండాలి.
- **విద్యార్హతలు:** కనీసం 50 శాతం మార్కులతో బీఏ (ఇంగ్లిష్ ఒక సబ్జెక్టుగా కలిగి ఉండాలి) లేదా బీఎస్సీ (ఫిజిక్స్/సైకాలజీ లేదా కెమిస్ట్రీ/మ్యాథ్స్ లేదా ఐటీ/సీఎస్ఈ లేదా స్టాటిస్టిక్స్‌లలో ఏదో ఒకదానిని ఒక సబ్జెక్టుగా కలిగి ఉండాలి) లేదా బీసీఏ ఉత్తీర్ణతతోపాటు కనీసం 50 శాతం మార్కులతో బీఈడీ డిగ్రీ ఉండాలి. లేదా ఎంఏ ఇంగ్లిష్/సైకాలజీ లేదా ఎమ్మెస్సీ మ్యాథ్స్/ఫిజిక్స్ లేదా స్టాటిస్టిక్స్ లేదా సీఎస్ఈ/ఐటీ లేదా ఎంసీఏలో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత.

నోట్: డిగ్రీ/పీజీ, బీఈడీ డిగ్రీలు యూజీసీ/ఎన్‌సీటీఈ లేదా సంబంధిత అథారిటీ గుర్తింపు పొంది ఉండాలి.

- **గ్రూప్ - వై:** ఈ పోస్టులకు ఇంటర్ ఏదైనా గ్రూప్‌లో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులు అర్హులు. ఇంగ్లిష్ సబ్జెక్టులో 50 శాతం మార్కులు ఉండాలి. ఈ గ్రూప్‌లో మెడికల్ అసిస్టెంట్ ట్రేడ్ పోస్టులకు మాత్రం ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ సబ్జెక్టులతో ఇంటర్ 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఇంగ్లిష్ సబ్జెక్టులో 50 శాతం మార్కులు తప్పనిసరి.
- **గ్రూప్ వై మ్యూజీషియన్ ట్రేడ్:** పదోతరగతి లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతోపాటు కింది పేర్కొన్న ఏదో ఒక సంగీత సాధనలో ప్రావీణ్యం ఉండాలి. అవి.. ట్రంపెట్, బేస్, వయోలిన్, సాక్సాఫోన్, క్లారినెట్, యుఫోనియం, జాగ్‌డ్రమ్, పికోలో, బేస్ ట్రాంబోన్, కీబోర్డ్, గిటార్, సరోద్, వియోలా, సెల్లో, కాంట్రాబేస్.

నోట్: మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులతో ఇంటర్ చదువుకున్న విద్యార్థులు గ్రూప్ - ఎక్స్, గ్రూప్ - వై రెండు రకాల ఉద్యోగాలకూ అర్హులే. వీరు ఎక్స్, వైలలో నచ్చిన గ్రూప్ కోసం దరఖాస్తు చేసుకొని పరీక్ష రాయవచ్చు లేదా రెండు గ్రూపులకు కలిపి నిర్వహించే పరీక్షనూ ఎంచుకోవచ్చు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేటప్పుడే ఆ విషయాన్ని పేర్కొనాలి. డిప్లొమా విద్యార్థులు గ్రూప్ ఎక్స్ పోస్టులకు మాత్రమే అర్హులు.

శారీరక ప్రమాణాలు

- **ఎత్తు:** కనీసం 152.5 సెం.మీ. ఉండాలి. ఊపిరి పీల్చక ముందు, పీల్చిన తర్వాత ఛాతీ వ్యత్యాసం కనీసం 5 సెం.మీ. ఉండాలి. దృష్టిదోషం ఉండరాదు. వినికిడి సామర్థ్యం స్పష్టంగా ఉండాలి.

ఎంపిక ప్రక్రియ

- ఎయిర్‌మెన్ సెలక్షన్లను రెండు పద్ధతుల్లో చేస్తారు. అవి స్టార్, ర్యాలీ.
- **స్టార్ (షెడ్యూల్డ్ టెస్ట్ ఫర్ ఎయిర్‌మెన్ రిక్రూట్‌మెంట్):** దేశంలోని అన్ని ప్రాంతాల వారు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ స్టార్ రెండు ఫేజ్‌లలో ఉంటుంది. ఫేజ్-1, ఫేజ్-2.
- ఫేజ్-1 ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ). దీన్ని సీడాక్ నిర్వహిస్తుంది.
- ఫేజ్-2 సీబీటీలో కనబర్చిన ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి ఎయిర్‌మెన్ ఎంపిక కేంద్రాల్లో తదుపరి ప్రక్రియను కొనసాగించి తుది ఎంపిక చేస్తారు.
- **ర్యాలీ:** ఎయిర్‌ఫోర్స్‌లో అన్ని ప్రాంతాల వారికి సమాన ప్రాధాన్యం ఇవ్వాలన్న సంకల్పంతో దేశంలోని మారుమూల ప్రాంతాల్లో ఎంపిక ప్రక్రియను అప్పటికప్పుడు చేపడుతారు. దీనికి సంబంధించిన వివరాలను స్థానిక పత్రికల ద్వారా ముందుగా తెలియజేస్తారు.
- స్టార్, ర్యాలీ రిక్రూట్‌మెంట్ ప్రక్రియల సమాచారాన్ని https://airmenselection.cdac.in ద్వారా తెలుసుకోవచ్చు.

జీతభత్యాలు

- శిక్షణ సమయంలో నెలకు రూ.14,600 స్టయిఫండ్ ఇస్తారు. శిక్షణ పూర్తయిన తర్వాత
- గ్రూప్ ఎక్స్ (టెక్నికల్)- నెలకు రూ.31,100+ డీఏ
- గ్రూప్ వై (నాన్ టెక్నికల్)- నెలకు రూ.26,900+ డీఏ
- ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్టర్- నెలకు రూ.40,600+ డీఏ
- వీటితోపాటు టీఏ, సీపీఎంఏ, ఎల్ఆర్ఏ, పిల్లల చదువుకు అలవెన్స్, హెచ్ఆర్ఏ తదితరాలు ఉంటాయి.
- రేషన్, దుస్తులు, వైద్యసౌకర్యం, క్యాంటీన్, ఎల్‌టీసీ తదితర బత్తాలు కూడా వాయుసేన ఇస్తుంది.
- మన రాష్ట్రంలో ఎయిర్‌మెన్ సెలక్షన్ సెంటర్ చిరునామా, ఫోన్ నంబర్లు

Airmen Selection Center
Air Force Station, Begumpet, Bowenpally,
Secunderabad – 500 011
040-27753512 (Direct) 040-27753500
Extn:467

- **వెబ్‌సైట్:** http://indianairforce.nic.in.

ఫేజ్ -1 పరీక్ష

- ఈ పరీక్షను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలో ఇస్తారు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో ఉంటుంది. గ్రూప్-ఎక్స్ ట్రేడ్ పరీక్ష వ్యవధి ఒక గంట. ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్‌ల నుంచి ప్రశ్నలు అడుగుతారు. గ్రూప్-వై పరీక్ష వ్యవధి 45 నిమిషాలు. ఇంగ్లిష్, రీజనింగ్ అండ్ జనరల్ అవేర్‌నెస్ విభాగాల నుంచి ప్రశ్నలుంటాయి. గ్రూప్ - ఎక్స్, వై రెండింటికీ దరఖాస్తు చేసుకున్నవారికి పరీక్ష 85 నిమిషాలు ఉంటుంది. ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్, రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్‌ల నుంచి ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు. తప్పుగా గుర్తించిన ప్రతి జవాబుకు 0.25 మార్కులు కోత విధిస్తారు. అన్ని ప్రశ్నపత్రాల్లోనూ ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్ ప్రశ్నలు సీబీఎస్ఈ 10+2 సిలబస్ నుంచే వస్తాయి. ఎంచుకున్న పరీక్షను బట్టి ఇంగ్లిష్‌లో 20, ఫిజిక్స్‌లో 25, మ్యాథ్స్‌లో 25, రీజనింగ్ అండ్ జనరల్ అవేర్‌నెస్‌లో 30 ప్రశ్నలు వస్తాయి.
- అనంతరం ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, వైద్యపరీక్షలు నిర్వహిస్తారు.
- **శిక్షణ:** 20 ఏండ్ల కాలానికి ఈ పోస్టులను భర్తీ చేస్తారు. ఎంపికైన అభ్యర్థులకు మొదట జాయింట్ బేసిక్ ఫేజ్ ట్రెయినింగ్ ఇస్తారు. తర్వాత ట్రేడ్ శిక్షణ ఉంటుంది. శిక్షణ విజయవంతంగా పూర్తిచేసుకున్నవారికి ఆయా ట్రేడ్‌లలో ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగవకాశం కల్పిస్తారు.

నోట్: ఏటా క్రమం తప్పకుండా ఎయిర్‌ఫోర్స్ ఎయిర్‌మెన్ సెలక్షన్స్ కోసం స్టార్, ర్యాలీలను నిర్వహిస్తుంది.

- **పదోన్నతులు:** ఎయిర్‌మెన్ - ఎయిర్ క్రాఫ్ట్స్‌మెన్- లీడింగ్ ఎయిర్ క్రాఫ్ట్స్‌మెన్, కార్పొరల్, సర్జెంట్, జూనియర్ వారెంట్ ఆఫీసర్, వారెంట్ ఆఫీసర్, వారెంట్ ఆఫీసర్, మాస్టర్ వారెంట్ ఆఫీసర్ వరకు పదోన్నతి పొందవచ్చు.

...✍ కేశవపంతుల వేంకటేశ్వరశర్మ

భారతదేశానికి ఏ సంస్థలో సభ్యత్వం లేదు?

1. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దే అంశంపై ఏప్రిల్ 15న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏ సంస్థ ఆర్థిక మంత్రుల సమావేశం జరుగనున్నది?
1) జీ-5 2) జీ-20 3) జీ-8 4) ఏదీకాదు
2. కరోనా వైరస్‌వల్ల లాక్‌డౌన్ విధించడంతో ఆగిపోయిన అన్ని కార్యక్రమాలు తిరిగి ఏ నగరంలో మొదలయ్యాయి?
1) బీజింగ్ 2) న్యూయార్క్ 3) రోమ్ 4) వుహాన్
3. నవంబర్‌లో జరగాల్సిన 2020 ఫిఫా అండర్-17 టోర్నమెంట్ కరోనా వల్ల వాయిదా పడింది. మళ్లీ ఎప్పుడు ఈ టోర్నీ నిర్వహించనున్నారు?
1) 2021 2) 2022 3) 2023 4) 2024
4. రాజీవ్ గబ్బా ఎవరు?
1) ఆర్థిక శాఖ కార్యదర్శి
2) హోం శాఖ కార్యదర్శి
3) కేబినెట్ సెక్రటరీ
4) ఏదీకాదు
5. మాస్క్ లేకుంటే నో పెట్రోల్ విధానం ఏ రాష్ట్రంలో అమల్లోకి వచ్చింది?
1) తమిళనాడు 2) మహారాష్ట్ర 3) ఉత్తరప్రదేశ్ 4) ఒడిశా
6. ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ ఏడాది తీసుకున్న ఇతివృత్తం?
1) అందరికీ ఆరోగ్యం
2) సపోర్ట్ నర్సెస్, మిడ్‌వైవ్స్
3) కరోనాను అంతమొందించాలి
4) పైవన్నీ
7. కరోనాపై పోరుకు రూ.7.500 కోట్ల సాయాన్ని ప్రకటించిన జాకో డోర్సీ ఏ సంస్థ సీఈవో?
1) టిక్‌టాక్ 2) ట్విటర్ 3) యూట్యూబ్ 4) గూగుల్
8. 2020కు గాను విజ్డెన్ క్రికెటర్ ఆఫ్ ది ఇయర్‌గా?
1) కోహ్లీ 2) డివిలియర్స్ 3) బెన్ స్టోక్స్ 4) షేన్ వాట్సన్
9. కరోనా అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనేందుకు సార్క్ అత్యవసర ఫండ్ కోసం భారత్ తరఫున ఎన్ని మిలియన్ డాలర్ల సాయం ప్రకటించింది?
1) 10 2) 15 3) 18 4) 20
10. యూఎన్‌వో ప్రకారం కరోనా ప్రభావంతో ఎన్ని కోట్ల ప్రజలు కరువు బారిన పడనున్నారు?
1) 60 2) 70 3) 30 4) 50
11. కరోనాపై ఉమ్మడిగా పోరాడుదామని ఏప్రిల్ 10న ఏ రెండు దేశాల ప్రధానులు అంగీకరించారు?
1) ఇండియా-బంగ్లాదేశ్
2) ఇండియా-నేపాల్
3) ఇండియా-భూటాన్
4) ఇండియా-శ్రీలంక
12. సీఆర్‌పీఎఫ్ శౌర్య దివస్‌ను ఏటా ఏ రోజున నిర్వహిస్తారు?
1) ఏప్రిల్ 4 2) ఏప్రిల్ 5 3) ఏప్రిల్ 8 4) ఏప్రిల్ 9
13. ఆసియాలోనే అతిపెద్ద మురికివాడ ధారావి ఏ రాష్ట్రంలో ఉంది?
1) మహారాష్ట్ర 2) తమిళనాడు 3) ఉత్తరప్రదేశ్ 4) మధ్యప్రదేశ్
14. కింది వాటిలో 1965లో ఏర్పడిన సంస్థ?
1) ఐఏఈఏ 2) యూఎన్‌డీపీ 3) యూఎన్‌ఈపీ 4) ఐఎంఎఫ్
15. 2020కు గాను ప్రపంచంలోనే శక్తిమంతమైన పాస్‌పోర్ట్ కలిగిన దేశం?
1) సింగపూర్ 2) జపాన్ 3) హాంకాంగ్ 4) ఫిన్‌లాండ్
16. స్కూల్ స్ట్రైక్స్ ఫర్ క్లైమెట్ చేంజ్ స్వచ్ఛంద సంస్థ స్థాపకురాలు గ్రెటా థన్‌బెర్గ్ ఏ దేశానికి చెందినవారు?
1) స్పెయిన్ 2) స్వీడన్ 3) స్విట్జర్లాండ్ 4) అమెరికా
17. ప్రస్తుతం భారత్‌లో హైడ్రాక్సిక్లోరోక్విన్ మాత్రలు ఎన్ని అందుబాటులో ఉన్నాయి?
1) 3.28 కోట్లు 2) 4.28 కోట్లు 3) 4.21 కోట్లు 4) 5.28 కోట్లు
18. మే 1 వరకు లాక్‌డౌన్ ప్రకటించిన తొలి రాష్ట్రం?
1) ఒడిశా 2) మధ్యప్రదేశ్ 3) మహారాష్ట్ర 4) పంజాబ్
19. అత్యధిక సార్లు ఆసియా క్రీడలను థాయిలాండ్ ఐదు సార్లు నిర్వహిస్తే భారత్ ఎన్ని సార్లు నిర్వహించింది?
1) 2 2) 3 3) 4 4) 5
20. ప్రస్తుతం ఏ సంస్థలో 54 సభ్యదేశాలు ఉన్నాయి?
1) కామన్‌వెల్త్ 2) ఈయూ 3) అపెక్ 4) ఒపెక్
21. సుస్థిరమైన వృద్ధి సాధించడానికి భాగస్వామ్యాన్ని పెంపొందించాలని ఏషియాన్ సంస్థ ఎన్నో సమావేశంలో పిలుపునిచ్చింది?
1) 35 2) 36 3) 37 4) 38
22. 2022లో కామన్‌వెల్త్ క్రీడలను బర్మింగ్‌హాంలో నిర్వహించనున్నారు. భారత్‌లో ఏ ఏడాదిలో వీటిని నిర్వహించారు?
1) 2010 2) 2011 3) 2012 4) 2014
23. కింది వాటిలో గ్రాస్‌కోర్టులో నిర్వహించే టెన్నిస్ టోర్నీ?
1) ఆస్ట్రేలియన్ ఓపెన్ 2) ఫ్రెంచ్ ఓపెన్ 3) వింబుల్డన్ 4) అమెరికన్ ఓపెన్
24. కిందివాటిలో అభివృద్ధి చెందిన దేశాల సంస్థ?
1) జీ-4 2) జీ-20 3) జీ-5 4) జీ-7
25. భారతదేశానికి కింది ఏ సంస్థలో సభ్యత్వం లేదు?
1) డబ్ల్యూటీవో 2) డబ్ల్యూహెచ్‌వో 3) ఐఎల్‌వో 4) ఏపీఈసీ (అపెక్)
26. భారత సంతతి వైద్యురాలు భాషాముఖర్జీ 2019కు గాను ఏ దేశ మిస్ యూనివర్స్‌గా ఎంపికయ్యారు?
1) అమెరికా 2) ఇండియా 3) ఫ్రాన్స్ 4) బ్రిటన్
27. భారత్ ఉచితంగా 34 లక్షల హైడ్రాక్సిక్లోరోక్విన్ మాత్రలను ఏ దేశానికి పంపించింది?
1) అమెరికా 2) బ్రిటన్ 3) ఫ్రాన్స్ 4) ఇజ్రాయెల్
28. హైడ్రాక్సిక్లోరోక్విన్ వాడకాన్ని నిలిపివేసిన దేశం?
1) ఫ్రాన్స్ 2) చైనా 3) జపాన్ 4) జర్మనీ
29. రెండుసార్లు ఒలింపిక్స్‌లో పాల్గొని స్వర్ణం సాధించిన డొనాటో సాచియా.... కరోనాతో మరణించారు. ఈమె ఏ దేశానికి చెందినవారు?
1) జపాన్ 2) జర్మనీ 3) ఇటలీ 4) అమెరికా
30. ఏ దేశంలో కరోనా రోగులకు రోబోలతో సేవలు అందిస్తున్నారు?
1) చైనా 2) స్పెయిన్ 3) ఇటలీ 4) జపాన్
31. ఏప్రిల్ 10న ఏపీ కన్నికల ప్రధాన కమిషనర్‌గా ఎస్ ఈసీ కనగరాజ్ నియమితులయ్యారు. ఈయన ఏ రంగానికి చెందినవారు?
1) వైద్యం 2) విద్య 3) ఆర్థిక 4) న్యాయశాస్త్రం
32. 6.2 టన్నుల డ్రగ్స్‌ను భారత్ ఏ దేశానికి సరఫరా చేసింది?
1) శ్రీలంక 2) మాల్దీవులు 3) బంగ్లాదేశ్ 4) నేపాల్
33. యోవెరి ముసెవెణి ఏ దేశ అధ్యక్షుడు?
1) ఉగాండా 2) రువాండా 3) అంగోలా 4) బాలి
34. ఏ రాష్ట్రంలో ఎన్నికల ప్రధాన కమిషనర్ పదవీకాలాన్ని మూడేండ్లకు తగ్గించారు?
1) తమిళనాడు 2) ఆంధ్రప్రదేశ్ 3) తెలంగాణ 4) ఉత్తరప్రదేశ్

జవాబులు

1-2	2-4	3-1	4-3	5-4	6-2
7-2	8-3	9-1	10-4	11-2	12-4
13-1	14-2	15-2	16-2	17-1	18-4
19-1	20-1	21-1	22-1	23-3	24-4
25-4	26-4	27-1	28-1	29-3	30-3
31-4	32-3	33-1	34-2		

వేముల సైదులు
జీకే, కరెంట్ అఫైర్స్ నిపుణులు
ఆర్‌సీ రెడ్డి స్టడీ సర్కిల్
హైదరాబాద్

రాజ్యాంగం చారిత్రక పరిణామాలు

- ప్రపంచ దేశాల్లో ఆధునిక రాజ్యాల అవతరణకు మూలాధారం రాజ్యాంగం. ఆధునిక రాజ్యాల రాజకీయ ప్రక్రియా విధానాన్ని సూచించే నియమ నిబంధనల సముదాయ రూపంలో ఒక అత్యున్నత చట్టం ఉంటుంది. దీన్నే 'రాజ్యాంగం' అంటారు. క్రీ.పూ. 384-322 కాలానికి చెందిన గ్రీకు తత్వవేత్త అరిస్టాటిల్ అప్పటికే ఉన్న 156 రాజ్యాంగాలను అధ్యయనం చేసి రాజ్యాంగ భావనను వివరించారు. అంతేకాకుండా ప్రభుత్వాలు శాస్త్రీయ పద్ధతిలో వర్గీకరించి రాజనీతిశాస్త్ర పితామహుడు అయ్యాడు. భారత రాజ్యాంగ ఆవిర్భావానికి కొన్ని చట్టాలు దోహదపడ్డాయి. రాజ్యాంగ నిర్మాణ పరిణామ క్రమాన్ని బీసీ రావత్ 6 దశలుగా అధ్యయనం చేయవచ్చునని పేర్కొన్నారు. అవి..

Iవ దశ- 1600-1773

- మొదటి ఎలిజబెత్ మహారాణి 1600, డిసెంబర్ 31న ఈస్టిండియా కంపెనీకి వ్యాపారం చేసుకునేందుకు రాయల్ చార్టర్ (ఏదైనా ఒక సంస్థ లేదా సంఘాల ఏర్పాటుకు అనుమతినిస్తూ ప్రభుత్వం జారీచేసే అనుమతిపత్రాన్ని చార్టర్ అంటారు) ద్వారా అనుమతించారు. దీంతో దేశంలో వ్యాపారం చేసుకునే క్రమంలో దేశంపై కంపెనీ పాలనాధికారాన్ని సంపాదించుకునేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో కంపెనీ బెంగాల్, బొంబాయి, మద్రాసు రాష్ట్రాలను స్వాధీనం చేసుకుంది.
- ఈస్టిండియా కంపెనీ చేస్తున్న అవినీతిని బయటపెట్టేందుకు బ్రిటిష్ ప్రభుత్వం జనరల్ బుర్గాయిన్ అధ్యక్షతన ఒక కమిటీని రహస్యంగా ఏర్పాటు చేసింది. ఈ కమిటీ కంపెనీ అవినీతి పెరిగిపోయిందని నివేదిక ఇచ్చి, కంపెనీ కార్యక్రమాలను క్రమబద్ధం చేయమని సిఫారసు చేసింది.

IIవ దశ- 1773-1858

- **రెగ్యులేటింగ్ చట్టం (1773):** రెగ్యులేటింగ్ అంటే క్రమబద్ధం చేయడం. వ్యాపారరీత్యా భారతదేశానికి వచ్చిన ఈస్టిండియా కంపెనీని క్రమబద్ధం చేయడంతోపాటు దాని కార్యక్రమాలను నియంత్రించడానికి చేసిన మొదటి చట్టం కాబట్టి దీన్ని 'రెగ్యులేటింగ్ చట్టం' అంటారు. దీన్ని దేశానికి సంబంధించి మొదటి లిఖిత రాజ్యాంగ చట్టంగా కూడా పేర్కొంటారు. అంతవరకు వ్యాపార కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఈస్టిండియా కంపెనీకి మొదటిసారిగా రాజకీయ, పరిపాలన, అధికారాలు లభించాయి.
- ఈ చట్టాన్ని 1773, మే 18న అప్పటి బ్రిటిష్ ప్రధాని లార్డ్ ఫ్రెడరిక్ నార్త్.. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. బెంగాల్ గవర్నర్ హోదాను 'గవర్నర్ జనరల్ ఆఫ్ ది ప్రెసిడెన్సీ ఆఫ్ ఫోర్ట్ విలియం లేదా గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్'గా మార్చారు. ఇతనికి సలహాలు ఇవ్వడానికి నలుగురు సభ్యులతో కూడిన కార్యనిర్వహణ మండలిని ఏర్పాటు చేశారు.
- ఆ విధంగా మొదటి గవర్నర్ జనరల్‌గా నియమితులైనవారు వారెన్ హేస్టింగ్స్. కార్యనిర్వహణ మండలిలోని నలుగురు సభ్యులు 1) క్లావెరింగ్ 2) బార్‌వెల్ 3) ఫిలిప్ ఫ్రాన్సిస్ 4) మాన్‌సన్.
- 1774లో ఒక ప్రధాన న్యాయమూర్తి, ముగ్గురు సాధారణ న్యాయమూర్తులతో 'సుప్రీంకోర్ట్ ఆఫ్ జ్యూడికేచర్'ను కలకత్తా ఫోర్ట్ విలియంలో ఏర్పాటు చేశారు. మొదటి ప్రధాన న్యాయమూర్తి ఎలిజా ఎంఫే, న్యాయమూర్తులు రాబర్ట్ చాంబర్స్, సీజర్ లైమెస్టర్, జాన్ హైడ్.
- **పిట్స్ ఇండియా చట్టం (1784):** రెగ్యులేటింగ్ చట్టంలోని లోపాలను సవరించడానికి బ్రిటిష్ పార్లమెంట్ ఈ చట్టాన్ని 1784లో ఆమోదించింది. ఆనాటి బ్రిటన్ ప్రధానమంత్రి 'విలియం పిట్' ఈ చట్టాన్ని ప్రతిపాదించడంతో దీన్ని పిట్స్ ఇండియా చట్టం అని వ్యవహరిస్తారు. ఈ చట్టాన్ని చేసిన సమయంలో గవర్నర్ జనరల్ వారెన్ హేస్టింగ్స్.
- ఇంగ్లండ్‌లో బోర్డ్ ఆఫ్ కంట్రోల్ అనే ఒక నూతన విభాగాన్ని ఆరుగురు సభ్యులతో ఏర్పాటుచేసి కంపెనీ రాజకీయ, సైనిక, రెవెన్యూ వ్యవహారాలను దీనికి అప్పగించారు. ముగ్గురు డైరెక్టర్లతో నియమించి ఒక రహస్య కమిటీ ఈ బోర్డు ఆదేశాలను భారతదేశానికి చేరవేసేది. ఈ కోర్ట్ ఆఫ్ డెరెక్టర్స్ వాణిజ్య వ్యవహారాలకే పరిమితమైంది.
- **చార్టర్ చట్టం (1793):** ఈ చట్టం ద్వారా గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా అధికారాలను విస్తృతం చేశారు. కంపెనీకిగల వ్యాపార గుత్తాధిపత్యాన్ని మరో 20 ఏండ్లు పొడిగించారు. బోర్డు కార్యదర్శిని పార్లమెంట్‌లో కూర్చోవడానికి అనుమతించారు. ఈ చట్టం సమయంలో గవర్నర్ జనరల్ కారన్ వాలీస్.
- భారతీయుల హక్కులు, ఆస్తులు, వారసత్వం, వివాహం, మత విషయాలకు సంబంధించి గవర్నర్ జనరల్ చేసే నిబంధనలకు చట్టాలతోపాటుగా సమాన విలువ ఉంటుంది.
- **చార్టర్ చట్టం (1813):** దీని ద్వారా ఈస్టిండియా కంపెనీ చార్టర్‌ను మరో 20 ఏండ్లు పొడిగించారు. తేయాకు, చైనాతో వ్యాపారం మినహా కంపెనీకి వర్తకంపై గల గుత్తాధిపత్యాన్ని తొలగించి ప్రతి బ్రిటన్ పౌరుడికి వర్తకం చేసుకునే అవకాశం కల్పించి కంపెనీని కేవలం పరిపాలనాపరమైన సంస్థగా మార్చారు.
- భారతీయులకు మతపరమైన, విద్యాపరమైన అధ్యయనం కోసం ప్రతి ఏడాది రూ.లక్ష కేటాయించేలా ఏర్పాటు చేశారు. సివిల్ సర్వెంట్లకు శిక్షణా సదుపాయాన్ని కల్పించారు. ఈస్టిండియా కంపెనీలో భారతీయులకు కూడా ఉద్యోగ అవకాశాలు కల్పించారు.



- ఈ చట్టం ద్వారా భారత్‌కు క్రిస్టియన్ మిషనరీలు రావడానికి అనుమతించడంతో చర్చిలు, విద్యాలయాలు, ఆస్పత్రులు స్థాపితమయ్యాయి. దీంతో మతమార్పిడులకు అవకాశం ఏర్పడింది.
- **చార్టర్ చట్టం (1833):** దీని ద్వారా ఈస్టిండియా కంపెనీ చార్టర్‌ను మరో 20 ఏండ్లు పొడిగించారు. ఈ చట్టం ద్వారా గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్ పదవి భారత్ గవర్నర్ జనరల్‌గా మారింది. దీంతో బెంగాల్ గవర్నర్ జనరల్‌గా ఉన్న విలియం బెంటింక్ భారత మొదటి గవర్నర్ జనరల్ అయ్యాడు.
- ఈస్టిండియా కంపెనీ వ్యాపార లావాదేవీలను రద్దుచేసి పరిపాలనా సంస్థగా మార్చారు. యూరోపియన్లు భారత్‌కు వలసవచ్చేందుకు, భూమి, ఆస్తులు సంపాదించుకునేందుకు ఉన్న నియంత్రణలను తొలగించి వారికి పూర్తిస్వేచ్ఛ కల్పించారు. దీంతో బ్రిటిష్ వలసరాజ్య స్థా